
ఎయిర్ పోర్టు భూముల రికార్డులను పరిశీలిస్తున్న బృందం

ఎయిర్ పోర్టు ప్రతిపాదిత భూముల పరిశీలన

- అల్లూరు, ఆలూరుల్లో.. ప్రాజెక్టు రిపోర్టు బృందం పర్యటన

ఒంగోలు నగరం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : విమానాశ్రయ ఏర్పాటుకు మండలంలోని ఆలూరు, అల్లూరు గ్రామాల పరిధిలో ప్రతిపాదించిన భూములను ప్రాజెక్టు రిపోర్టు తయారీ బాధ్యతలు చూస్తున్న టీజీ భరత్ సంస్థ బృందం సోమవారం పరిశీలించింది. సంస్థప్రతినిధులు పరమితరాయ్, అనిన్‌దితారాయ్, దీపక్ భట్టాచార్య ఆ ప్రాంతంలో పర్యటించారు. అనంతరం అల్లూరు సచివాలయంలో స్థానికులతో సమావేశమయ్యారు. గ్రామాల్లో పరిస్థితులు, జనాభా వివరాలు, ప్రైవేటు, ప్రభుత్వ భూములు, రైతుల గురించి సమాచారం సేకరించారు. అక్కడి నుంచే ఫోన్ ద్వారా ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డితో మాట్లాడారు. ప్రాజెక్టు రిపోర్టును త్వరితగతిన అందించాలని ఈ సందర్భంగా వారికి మాగుంట సూచించారు.

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

- అధికారులకు కలెక్టర్ రాజాబాబు ఆదేశం
- మీకోసంలో ప్రజల నుంచి వినతుల స్వీకరణ


అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు ఇచ్చే అర్జీలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ పి.రాజాబాబు అధికారులను ఆదేశించారు. వాటి విషయంలో అలసత్వం ప్రదర్శించవద్దని సూచించారు. స్థానిక ప్రకాశం భవన్‌లోని స్పందన హాలులో సోమవారం నిర్వహించిన మీకోసంలో ఆయన పాల్గొన్నారు. ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. అధికారులనుద్దేశించి మాట్లాడారు. వివిధ సమస్యలపై అర్జీలు ఇచ్చేందుకు వచ్చే వారిపట్ల మర్యాదగా వ్యవహరించాలన్నారు. అర్జీదారు సంతృప్తి చెందారా? లేదా? అన్నది స్వయంగా ఫోన్ చేసి తెలుసుకోవాలన్నారు. అప్పుడే ప్రభుత్వ సేవలపై ప్రజలకు సానుకూల అభిప్రాయం ఏర్పడుతుందని చెప్పారు. అర్జీల పరిష్కార ప్రగతిని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేశు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కుమార్, జాన్సన్, విజయజ్యోతి, కళావతితోపాటు పలు శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రధాన మంత్రి ఉపాధి సృష్టి పథకం కింద వ్యక్తిగతంగా, సూక్ష్మ, చిన్న పరిశ్రమలు స్థాపించేందుకు సబ్సిడీతో కూడిన రుణాలను పొందవచ్చని కలెక్టర్ రాజాబాబు తెలిపారు. ఔత్సాహికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. సోమవారం ఈ పథకం కింద మంజూరైన రెండు కార్లను ప్రకాశం భవన్‌లో ఆయన ప్రారంభించారు.

మార్కాపురం కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పాటు దాదాపు ఖాయమైంది. ప్రభుత్వం నుంచి లైన్‌క్లియర్ అయ్యింది. జనవరిలోనే ఇది ఏర్పడనుంది. అందుకు అవసరమైన అన్ని చర్యలూ చకచకా జరిగిపోతున్నాయి. కొత్త రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుకు సంబంధించి ఆయా మండలాల కలయికపై తుది కసరత్తు సాగుతోంది. సోమవారం మంత్రివర్గ ఉపసంఘంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై ప్రధానంగా చర్చించినట్లు తెలిసింది. పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు సమాచారం.


మార్కాపురం పట్టణం వ్యూ

మార్కాపురం జిల్లాకు లైన్ క్లియర్!

వచ్చే ఏడాది జనవరికి ఏర్పాటు

నేడు ప్రాథమిక నోటిఫికేషన్?
రెవెన్యూ డివిజన్లపై తుది కసరత్తు
మంత్రివర్గ ఉపసంఘంతో సీఎం చంద్రబాబు భేటీ



(ఆంధ్రజ్యోతి, ఒంగోలు) రాష్ట్రంలో గత వైసీపీ ప్రభుత్వం ఇష్టానుసారం కొత్త జిల్లాలను ఏర్పాటు చేసింది. ఈ విషయంలో ప్రజాభీష్టానికి భిన్నంగా వ్యవహరించింది. దీంతో అనేకచోట్ల తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ప్రజాప్రభుత్వం ఏర్పడ్డాక ప్రజల ఆకాంక్షను పరిగణలోకి తీసుకుంది. కొన్ని జిల్లాలపై సమీక్ష చేసి సవరణలు చేయాలని భావించింది. అందుకోసం మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. ఈ ఉపసంఘం రాష్ట్రస్థాయిలో ఆయా అంశాలపై ప్రత్యేక పరిశీలన చేసింది. సాంకేతికపరమైన సమస్యలను కూడా దృష్టిలో ఉంచుకొని జిల్లాల పునర్విభజనపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటికే రెండుసార్లు మంత్రివర్గ ఉపసంఘంతో సమీక్ష చేశారు. అందులో భాగంగా సోమవారం నిర్వహించిన సమీక్షలో రెవెన్యూ డివిజన్లపై తుది కసరత్తు చేయాలని ఆదేశించినట్లు తెలిసింది. మంగళవారం సాయంత్రంలోపు ప్రాథమిక నోటిఫికేషన్ ఇవ్వనున్నట్లు తెలిసింది. అనంతరం ప్రజలు, ప్రజాప్రతినిధుల అభ్యంతరాలు, అభిప్రాయాలను తెలుసుకునేందుకు నెలరోజులు సమయం ఇవ్వాల్సి ఉంటుంది. అందువల్ల డిసెంబరు చివరివారం లోపు ఈ ప్రక్రియను పూర్తిచేసే అవకాశం ఉంది. జనవరి 1వతేదీ లోపు తుది నోటిఫికేషన్ ఇవ్వొచ్చని సమాచారం.

రెవెన్యూ డివిజన్లపై కసరత్తు

మార్కాపురం జిల్లా ఏర్పాటుకు గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అంగీకరించారు. అలాగే ఇటు అద్దంకి, అటు కందుకూరు నియోజకవర్గాలను ప్రకాశం జిల్లాలో కలపాలని నిర్ణయించారు. తదనుగుణంగా కొత్త రెవెన్యూ డివిజన్ల ఏర్పాటు, వాటిలో ఆయా మండలాలను కలిపే అంశంపై కసరత్తు ఇంకా కొలిక్కి రాలేదు. వెంటనే దాన్ని పూర్తి చేయాలని మంత్రివర్గ ఉపసంఘానికి సీఎం చంద్రబాబు సూచించారు. నెల్లూరు జిల్లా నుంచి కందుకూరు ప్రకాశంలో కలుస్తున్నందున కందుకూరు కేంద్రంగా రెవెన్యూ డివిజన్‌ను కొనసాగించాలని నిర్ణయించినట్లు తెలిసింది. అందులోకి కొండపి నియోజకవర్గాన్ని కలపాలన్న ఆలోచన చేశారు. అయితే మంత్రి, కొండపి ఎమ్మెల్యే స్వామి టంగుటూరు మండలాన్ని మాత్రం ఒంగోలు డివిజన్‌లోనే కొనసాగించాలని పట్టుపట్టినట్లు తెలిసింది. ఒక నియోజకవర్గంలోని మండలాలను ఒకే డివిజన్‌లో ఉంచాలన్న సూత్రానికి ఇది విరుద్ధం. దీంతో ఆ విషయంపై ప్రత్యేక కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది. కొత్తగా అద్దంకి కేంద్రంగా రెవెన్యూ డివిజన్ చేయాలని నిర్ణయించారు. దర్శి నియోజకవర్గంలోని తాళ్లూరు, ముండ్లమూరు మండలాల ప్రజలు తాము ఏజిల్లాలో ఉన్నా రెవెన్యూ డివిజన్ మాత్రం అటు ఒంగోలు, ఇటు అద్దంకిలో ఉంచాలని డిమాండ్ చేస్తున్నారు. దర్శి నియోజకవర్గం మొత్తాన్ని అద్దంకి డివిజన్‌లో కలిపి ప్రకాశం జిల్లాలో ఉంచటమా? లేక ఆ రెండు మండలాలను అద్దంకి డివిజన్‌లో కలిపి మిగిలిన మండలాలను కనిగిరిలో కొనసాగించి నియోజకవర్గాన్ని మార్కాపురం జిల్లాలో కలపాలా? అన్న విషయంపై స్పష్టత రాలేదని తెలిసింది. సోమవారం సాయంత్రం నుంచి ఇదే అంశంపై మంత్రివర్గ ఉపసంఘం ఆయా ప్రాంతాల ప్రజలు, నాయకుల నుంచి సమాచారం సేకరిస్తున్నట్లు తెలిసింది. గిద్దలూరు కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటుపై మంత్రివర్గ ఉపసంఘం సానుకూలంగా ఉన్నట్లు సమాచారం. ఎర్రగొండపాలెం నియోజకవర్గాన్ని మార్కాపురం డివిజన్‌లో కొనసాగించాలని నిర్ణయించారు. ఏదిఏమైనా జిల్లాలు, రెవెన్యూ డివిజన్లకు సంబంధించి చిన్నపాటి మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది.

రైతన్న చెంతకు..

ఇంటింటికీ వ్యవసాయ, అనుబంధ శాఖల సిబ్బంది
పంచసూత్రాలపై అవగాహన
రైతు కుటుంబాల స్థితిపై అధ్యయనం
ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం
ఆర్ఎస్కే యూనిట్‌గా కార్యక్రమం
రాచవారిపాలెంలో 'రైతన్నా మీ కోసం' ప్రారంభించిన డీఏవో శ్రీనివాసరావు
ఈనెల 29 వరకు నిర్వహణ

ఒంగోలు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు, సిబ్బంది రైతు ఇంటిబాట పట్టారు. రైతన్నా మీకోసం' అంటూ ఈనెల 29 వరకు ప్రభుత్వం రూపొందించిన కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. వారం రోజులపాటు కొనసాగనుంది. జిల్లాలోని మొత్తం 516 రైతు సేవా కేంద్రాల్లో (ఆర్ఎస్కేలు) కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవసాయ, ఉద్యాన, ఎనర్జీ, ఇంజనీరింగ్, మత్స్య, పశుసంవర్ధక, మార్కెటింగ్, సహకార శాఖల సిబ్బంది, వీఆర్వో తదితరులు పాల్గొన్నారు. రైతుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలపై వారికి అవగాహన కల్పించడం, రైతు కుటుంబాల స్థితిగతులపై అధ్యయనం, వారి సూచనలతో వచ్చే వ్యవసాయ సీజన్ కార్యాచరణ లక్ష్యంగా ప్రభుత్వం ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించింది.

రోజుకు 90 రైతు కుటుంబాలను కలవడమే లక్ష్యం

రైతన్నా మీకోసం కార్యక్రమంలో మూడు రైతు కుటుంబాలను ఒక క్లస్టర్‌గా చేసుకొని ఒక్కో క్లస్టర్ వారితో కనీసం 15 నిమిషాలు సమావేశమై ఆయా అంశాలపై చర్చించాల్సి ఉంది. ప్రభుత్వం తాజాగా ప్రకటించిన పంచసూత్రాలతోపాటు వ్యవసాయ యాంత్రీకరణ, ఇతరత్రా అంశాలను వివరించాల్సి ఉంది. అదే సమయంలో రైతు కుటుంబాల స్థితిగతులను కూడా సిబ్బంది పరిశీలిస్తారు. ఈ ఏడాది ఇప్పటికి రెండు విడతలుగా అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ఒక్కో రైతు కుటుంబానికి రూ.14 వేల నగదు జమచేయగా దాని వినియోగంపైనా ఆరా తీస్తారు. వ్యవసాయ, అనుబంధ రంగాలలో ప్రభుత్వం తీసుకొస్తున్న మార్పులు రైతులకు వివరించి వారి ఆలోచనలు తెలుసుకొంటారు. వాటన్నింటినీ మిళితం చేసి వచ్చే ఏడాది ఖరీఫ్, రబీ సీజన్ల సాగు ప్రణాళికలు రూపొందించనున్నారు. ఇలా ఈ నెల 29 వరకు రోజుకు ఒక్కో ఆర్ఎస్కే పరిధిలో కనీసం 90 కుటుంబాలను అధికారులు, సిబ్బంది కలవనున్నారు.


రాచవారిపాలెంలో 'రైతన్నా మీకోసం' కార్యక్రమంలో పాల్గొన్న డీఏవో శ్రీనివాసరావు, ఇతర అధికారులు

3వ తేదీ తర్వాత వచ్చే ఏడాది వ్యవసాయ ప్రణాళిక

తొలిరోజైన సోమవారం జిల్లాలో 516 ఆర్ఎస్కేలలో రైతన్నా మీకోసం ప్రారంభమైంది. మద్దిపాడు మండలం రాచవారిపాలెంలో జిల్లా వ్యవసాయ అధికారి (డీఏవో) సి.హెచ్.శ్రీనివాసరావు కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. సీఎస్‌పురం మండలం ఉప్పలపాడులో కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఇటీవల అన్నదాత సుఖీభవ పథకం నగదు అందుకొన్ని రైతులతో ఆయన మాట్లాడారు. తొలిరోజు కార్యక్రమంలో వివిధ స్థాయిల్లోని అధికారులు, సిబ్బంది పాల్గొన్నట్లు సమాచారం. ఈనెల 29 వరకు కార్యక్రమాన్ని నిర్వహించిన అనంతరం 30 నుంచి వచ్చేనెల 2 వరకు సంబంధిత డేటాను విశ్లేషిస్తారు. దాని ఆధారంగా ఆర్ఎస్కే స్థాయిలో వచ్చేనెల 3వ తేదీన సమావేశమై రానున్న ఏడాది సాగుకు కార్యాచరణ ప్రణాళికలు రూపొందిస్తారు.


కలెక్టరేట్ వద్ద పోరాట దీక్ష చేస్తున్న సమగ్రశిక్ష ఉద్యోగులు

సమగ్రశిక్ష ఉద్యోగుల పోరుబాట

- కలెక్టరేట్ ఎదుట దీక్ష

ఒంగోలు (విద్య), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టులో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పోరుబాట పట్టారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక కలెక్టరేట్ ఎదుట సోమవారం దీక్షకు దిగారు. ఈ సందర్భంగా ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్యాణి మాట్లాడుతూ ఉద్యోగ భద్రత లేకుండా తక్కువ జీతాలతో పనిచేస్తున్న తమకు హెచ్ఆర్ విధానం అమలు చేయాలని, మినిమం టైమ్ స్కేల్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని, జీతాలను సకాలంలో చెల్లించాలని, ఉద్యోగ విరమణ వయస్సును 62 సంవత్సరాలకు పెంచాలని కోరారు. జేఏసీ నాయకుడు సిహెచ్.సంపత్ మాట్లాడుతూ తమకు ఈపీఎఫ్, గ్రాడ్యుటీ, పెన్షన్ ప్రయోజనాలతోపాటు ఆరోగ్య బీమా, మెడికల్ సదుపాయాలు కల్పించాలన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే వచ్చేనెల 10న చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని హెచ్చరించారు. అనంతరం నాయకులు కలెక్టర్ రాజబాబును కలిసి వినతిపత్రం అందజేశారు.

సమగ్ర శిక్ష ఏపీసీగా అనిల్‌కుమార్ బాధ్యతల స్వీకరణ


కలెక్టర్‌కు బొకే ఇస్తున్న సమగ్రశిక్ష ఏపీసీ అనిల్‌కుమార్

ఒంగోలు (విద్య) నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర శిక్ష జిల్లా అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్(ఏపీసీ)గా దాసరి అనిల్‌కుమార్ సోమవారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు. ఒంగోలు నగరం కొప్పోలుకు చెందిన అనిల్‌కుమార్ నెల్లూరు జిల్లా ఉదయగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వృక్షశాస్త్ర అధ్యాపకుడుగా పనిచేస్తూ డిప్యుటేషన్‌పై ఇక్కడ ఏపీసీగా నియమితులయ్యారు. బాధ్యతల స్వీకరణకు ముందు ఆయన డీఈవో కిరణ్‌కుమార్‌తోపాటు కలెక్టర్ రాజాబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామిని కూడా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. సమగ్రశిక్ష కార్యాలయానికి చేరుకున్న ఏపీసీకి ఉద్యోగులు ఘనంగా స్వాగతం పలికారు. శాలువాలతో సన్మానించి అభినందనలు తెలిపారు.


బాధితులను పరామర్శిస్తున్న ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్

అధైర్యపడొద్దు... ప్రభుత్వం అండగా ఉంటుంది

- బాధితులకు నివేశన స్థలాలు, పక్కా గృహాలు మంజూరు
- బండ్లమూడి దళితులకు ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్ భరోసా
- కౌంటర్ కేసులు ఎత్తివేయాలని పోలీసులకు ఆదేశం

7

గుంటుపల్లిలో అగ్నిప్రమాదం

- షార్ట్‌సర్క్యూట్‌తో రెండు దుకాణాలు దగ్ధం
- రూ.50 లక్షలకుపైగా ఆస్తి నష్టం


7

ఇంకా పాత ధరలే!

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేసిన సూపర్ జీఎస్టీ ఆచరణలోకి వచ్చి రెండు నెలలు అవుతున్నా ధరల్లో మాత్రం మార్పు కన్పించడం లేదు. తగ్గించిన జీఎస్టీపై అటు ప్రజలకు, ఇటు వ్యాపారులకు అవగాహన కల్పిస్తూ ప్రభుత్వం ఆధ్వర్యంలో పెద్దఎత్తున కార్యక్రమాలు నిర్వహించినా రేట్లు తగ్గలేదు. ముఖ్యంగా ఎలక్ట్రికల్ వస్తువులు, బైక్‌లు, కార్లు వంటి వాటిపై జీఎస్టీ తగ్గింపు అమలవుతున్నా.. మందులను, నిత్యవసర సరుకులను వ్యాపారులు పాత ధరలకే అమ్మకాలు చేస్తున్నారు. అధికారులు అవగాహన ర్యాలీలతోనే సరిపెట్టి పర్యవేక్షణ, తనిఖీలను వదిలేశారు. దీంతో కేంద్రం అమలు చేసిన సూపర్ జీఎస్టీ ఫలాలు ప్రజలకు చేరడం లేదు.

- వినియోగదారులకు అందని జీఎస్టీ ఫలాలు
- నిత్యావసర సరుకులు, మెడిసిన్స్‌లో కనిపించని మార్పు
- కూల్‌డ్రింక్స్, వాటర్ బాటిల్స్ పాత ధరలకే విక్రయం
- ఎలక్ట్రికల్ పరికరాలు, ఫుట్‌వేర్, కార్లు, బైక్‌ల రేట్లు తగ్గింపు
- పర్యవేక్షణ, తనిఖీలను వదిలేసిన అధికారులు

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం పలు వస్తువులపై జీఎస్టీ తగ్గించినా వాటి ఫలాలు సామాన్యులకు పూర్తిస్థాయిలో అందడం లేదు. సూపర్ జీఎస్టీ 2.0 గురించి రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పెద్దఎత్తున ప్రచారం నిర్వహించారు. అయితే పెద్దగా మార్పు కనిపించలేదు. ముఖ్యంగా మెడికల్ షాపులలో ఎవరైనా ప్రశ్నిస్తే బ్యాచ్ నెంబరు, ఎక్స్‌పైరీ డేట్‌లు ముందుగానే ముద్రించి ఉన్నందున ఇంకా మార్పులు జరగలేదని వెల్లడిస్తున్నారు. మరోవైపు ఇప్పటికే 20 శాతం డిస్కౌంట్ ఇస్తున్నామని చెప్పడంతో చేసేదేమీ లేని పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇక నిత్యవసర సరుకులదీ అంతంత మాత్రమే. మార్టులలో కొన్నింటికే జీఎస్టీ అమలవుతోంది.



కనిపించని తగ్గింపు బోర్డులు

కూల్‌డ్రింక్స్

మిగతా 6లో...



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సాయిశ్రీనివాస్

విద్యారంగ సంక్షేమమే ఎస్టీయూ ధ్యేయం

● యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సాయిశ్రీనివాస్

గిద్దలూరు టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సంక్షేమమే ధ్యేయంగా పని చేసే ఏకైక సంఘం రాష్ట్రోపాధ్యాయ సంఘం ఎస్టీయూ అని సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.సాయిశ్రీనివాస్ అన్నారు. సోమవారం పట్టణంలోని విశ్వభారతి హైస్కూలు నందు ఏర్పాటు చేసిన గిద్దలూరు నియోజకవర్గ స్థాయి సమావేశానికి హాజరైన సాయిశ్రీనివాస్ మాట్లాడుతూ గత ప్రభుత్వాలపై పోరాటాల ద్వారా సాధించుకున్న ఎన్నో ప్రయోజనాలు ఎస్టీయూ ముందుండి నడిపిన ఉద్యమాలతోనే సాధ్యమైందన్నారు. కానీ ఈనాటి పాలకులు ఆ ప్రయోజనాలకు తూట్లు పొడుస్తూ ఉపాధ్యాయ విద్యారంగాన్ని తిరోగమనం బాట పట్టించడం సరికాదన్నారు. వెంటనే 12వ పీఆర్సీ కమిషన్‌ను ఏర్పాటు చేసి 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని కోరారు. ఎస్టీయూ ప్రధాన కార్యదర్శి ఎం.రఘునాథరెడ్డి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న 11వ పీఆర్సీ బకాయిలు, డీఏ బకాయిల చెల్లింపుల విషయంలో వెంటనే రూట్ మ్యాప్ ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.రమణరెడ్డి, బి.వెంగలరెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.ఎర్రయ్య, జి.నరసింహారెడ్డి, టీకేఎస్ ప్రసాద్, ఎస్.భాస్కర్‌రెడ్డి, ఎస్.రాఘవరెడ్డి, డి.నాగయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు బాలగురువయ్య, సిద్దిక్, సుబ్బరాయుడు, వెంకటేశ్వర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.



అండర్ -19 యోగా ట్రెడిషనల్ పోటీలలో తలపడుతున్న వివిధ జిల్లాల బాలికలు

రసవత్తరంగా యోగా పోటీలు

పంగులూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని చందలూరు గ్రామంలో రాష్ట్రస్థాయి 69వ ఎస్‌జీఎఫ్ యోగా పోటీలు సోమవారం రసవత్తరంగా సాగాయి. అండర్ - 14, అండర్ -17 విభాగాలలో ట్రెడిషనల్, ఆర్టిస్టిక్, రిథమిక్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. అండర్-19 ట్రెడిషనల్ విభాగంలో కృష్ణ, కడప, నెల్లూరు, చిత్తూరు, కర్నూల్, తూర్పు గోదావరి, అనంతపురం, గుంటూరు, శ్రీకాకుళం జిల్లా క్రీడాకారులు న్యాయనిర్ణేతలు నిర్దేశించిన ఆసనాలతో పాటు వారు ఎంచుకున్న ఆసనాలు ప్రదర్శించారు. యోగా క్రీడలో వివిధ జిల్లాల బాల, బాలికలు క్రీడానైపుణ్యం చాటిన తీరు వీక్షకులకు కనువిందు చేసింది. రాష్ట్రం నలుమూలల నుంచి చందలూరు చేరుకున్న యోగా క్రీడాకారులకు ఆర్గనైజింగ్ కమిటీ ఆధ్వర్యంలో గ్రామస్థులు తగు వసతి కల్పించారు. అండర్-19 ఆర్టిస్టిక్, రిథమిక్ పోటీలు మంగళవారంతో ముగియనుండగా, ఈ పోటీలను పరిశీలకులు డాక్టర్ శ్రీనివాసరెడ్డితో పాటు పూర్ణచందరరావు, రాజ్‌కుమార్‌లు పర్యవేక్షిస్తున్నారు. ఎస్ఐఎస్ అధికారులు న్యాయనిర్ణేతలుగా వ్యవహరిస్తున్నారు.

ఇంకా పాత ధరలే

(5వపేజీ తరువాయి)

ధర గతంలో రూ.20 ఉంటే, నూతన జీఎస్టీతో రూ.18కి తగ్గింది. వాటర్ బాటిల్ రూ.13.36కి తగ్గింది. అయితే నేటికీ రూ.20కే అమ్ముతున్నారు. పాల ధరలపైనా జీఎస్టీ తగ్గించ లేదు. స్టేషనరీ, వస్త్రాలు, చెప్పులను మాత్రం పాత ధరలకే విక్రయిస్తున్నారు. ముఖ్యంగా జీఎస్టీ రాకముందు ఉన్న ధరలను, ప్రస్తుతం తగ్గిన ధరలను చూపిస్తూ ప్రతి దుకాణంలో కొనుగోలుదారులకు తెలిసేలా బోర్డులు ఏర్పాటు చేయాలి. కానీ జిల్లాలో ఆ పరిస్థితి ఏ ఒక్క దుకాణంలోనూ లేదు. దీంతో ప్రజలకు జీఎస్టీ ఫలాలు అందకపోతుండగా.. రిటైల్ వ్యాపారులు యథేచ్ఛగా పాత ధరలకే అమ్మకాలు చేస్తున్నారు. గత నెలలో జీఎస్టీ తగ్గింపుపై జిల్లావ్యాప్తంగా భారీగా అవగాహన ర్యాలీలు ఆర్భాటంగా నిర్వహించారు. ఆ తర్వాత అమలు తీరును అధికారులు పెద్దగా పట్టించుకోకపోవడంతో వ్యాపారులు కూడా పాత ధరలకే అమ్మకాలు జరుపుతున్నారు.

ఫిర్యాదు చేసేందుకు టోల్ ఫ్రీ

కేంద్ర ప్రభుత్వం సెప్టెంబరు 22 నుంచి జీఎస్టీ నూతన సంస్కరణల్లోకి తెచ్చింది. వీటిని అత్యధిక శాతం వ్యాపారులు అమలు చేయకపోవడంతో ప్రజలు భారీగా నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో జీఎస్టీ మోసాలపై ఫిర్యాదు చేసేందుకు ప్రభుత్వం టోల్ ఫ్రీ నెంబరును అందుబాటులోకి తెచ్చింది. 1915కు నేరగా ఫిర్యాదు చేయడంతోపాటు, 8800001915కి ఎస్ఎంఎస్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. జాతీయ వినియోగదారుల హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయవచ్చు.

పోలీసు గ్రీవెన్స్‌కు 63 ఫిర్యాదులు

ఒంగోలు క్రైం,నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ లో 63 మంది తమ ఫిర్యాదులు అందజేశారు. సోమవారం మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ రమణకుమార్ , పోలీసు అధికారులు ఈ కార్యక్రమం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదిదారులు తమసమస్యలను పోలీసు అధికారులకు విన్నవించారు. గ్రీవెన్స్‌లో అందిన ఫిర్యాదులను చట్ట పరిధిలో సత్వరమే పరిష్కరించాలని పోలీసు అధికారులు సెల్‌ఫోన్‌లో మాట్లాడి బాధితులకు భరోసా కల్పించారు.

గుండ్లకమ్మ రిజర్వాయర్‌ను సందర్శించిన పాఠశాల విద్యార్థులు



గుండ్లకమ్మ ప్రాజెక్టు వద్ద విద్యార్థులు

చినగంజాం, నవంబరు 24,(ఆంధ్రజ్యోతి) : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు కందుల ఓబుల్‌రెడ్డి గుండ్లకమ్మ రిజర్వాయర్‌ను సోమవారం సందర్శించినట్లు పాఠశాల హెచ్‌ఎం. కొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు భౌగోళిక, పర్యాటక ప్రాంతాల గురించి తెలియజేయటానికి విద్యార్థులను విహారయాత్రకు తీసుకెళ్లామన్నారు. గుండ్లకమ్మ రిజర్వాయర్ ప్రాజెక్టు, పర్యాటక ప్రాంతాన్ని గురించి విద్యార్థులకు వివరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పి.శ్రీలక్ష్మి, సీ.హెచ్.కుమార్, గంటా అంకమ్మ, కృష్ణారావు, చినగంజాం క్లస్టర్ సీఆర్పీ సీ.హెచ్.సురేంద్రకుమార్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పట్టుబడిన మూడు ఇసుక ట్రాక్టర్‌లు

వేటపాలెం(చీరాల), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం పోలీసులకు మూడు అక్రమ రవాణా ఇసుక ట్రాక్టర్లు పట్టుబడ్డాయి. పందిళ్లపల్లి వైపు నుంచి చీరాల వైపుకు జాతీయ రహదారిలో వెళుతుండగా సమాచారం అందుకున్న పోలీసులు వాటిని పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. అలాగే డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నారు. రవాణాపై ఆరా తీస్తున్నారు.

చీమకుర్తిలో పులి సంచారంపై హల్‌చల్

మిడ్‌వెస్ట్ డంప్ వద్ద సంచరిస్తున్నట్లు సోషల్ మీడియాలో వైరల్

భయాందోళనలో హిమగిరికాలనీ వాసులు

సంఘటనా స్థలాన్ని పరిశీలించిన జిల్లా ఫారెస్ట్ అధికారులు

పదేళ్లనాడు ఫేస్‌బుక్‌లో అప్‌లోడ్ అయిన వీడియో అని నిర్ధారణ

చీమకుర్తి, నవంబరు24 (ఆంధ్రజ్యోతి): చీమకుర్తి పరిసరప్రాంతాల్లో విస్తరించిన గ్రానైట్ డంపుల వద్ద పులి సంచరిస్తున్నట్లు సోమవారం సాయంత్రం సోషల్ మీడియాలో వీడియో హల్‌చల్ చేసింది. మిడ్ వెస్ట్ గ్రానైట్ డంపు, కరెంట్ ఆఫీస్ సమీపంలో పులి సంచరిస్తున్నట్లు పుకార్లు షికార్లు చేయటంతో పట్టణవాసులు మరీ ముఖ్యంగా సమీపంలో ఉన్న హిమగిరి కాలనీవాసులు వణికిపోయారు. రెండురోజుల క్రితం ఈ ప్రాంతంలో పులిముద్రలు కనపడ్డాయని స్థానికులు చర్చించుకుంటున్న నేపథ్యంలో సోషల్ మీడియాలో దర్శనం ఇచ్చిన వీడియోతో కాలనీవాసులు మరింత బెంబేలెత్తిపోయారు. వీడియో పూర్తిస్థాయిలో వైరల్ కావటంతో డీఎఫ్‌వో వినోద్‌కుమార్,సబ్ డీఎఫ్‌వో శ్రీనివాసులు,రేంజర్ నరసింహారావు,శశిభూషణ్‌లు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియో 2015లో మధ్యప్రదేశ్‌లో జరిగిన సంఘటనను తీసి ఫేస్‌బుక్‌లో అప్‌లోడ్ చేసిందని నిర్ధారించారు. ఫారెస్ట్ అధికారులు భయాందోళనలో ఉన్న హిమగిరికాలనీ వాసులతో మాట్లాడారు. వారు చూసిన ముద్రలు అడవి కుక్కలకు సంబందించినవని, ఎవరూ భయపడవద్దని తెలిపారు.తదుపరి విలేకర్లతో డీఎఫ్‌వో మాట్లాడుతూ ఈ ప్రాంతంలో పులి సంచరిస్తుందా లేదా అన్న విషయాన్ని నిర్ధారించుకోవటానికి మాకు రెండురోజులు సమయం పడుతుందన్నారు. అప్పటివరకూ ఈ ప్రాంతవాసులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.వైరల్ అవుతున్న ఈ వీడియో ఈ ప్రాంతానికి చెందినది కాదని తెలిపారు.పదేళ్ల క్రితం ఫేస్‌బుక్‌లో అప్‌లోడ్ అయిన వీడియోను తిరిగి ఎవరో సోషల్‌మీడియాలో పోస్టు చేసినట్లు గుర్తించామన్నారు. కాగా ఈ వీడియోను పోస్టు చేయటంలో అంతర్యం,పోస్టు చేసిన వారి వివరాలను సేకరించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు.



సోషల్ మీడియాలో హల్‌చల్ చేసిన వీడియోలోని పులి ఫొటో



డంపింగ్ పరిసరప్రాంతాలను పరిశీలిస్తున్న డీఎఫ్‌వో, ఫారెస్ట్ అధికారులు

ఇంటిని మరిపించిన ప్రేమ, ఆప్యాయతలు

రాష్ట్రస్థాయి యోగా పోటీల నిర్వహణ బాగు బాగు

పంగులూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): 'గ్రామీణ ప్రాంతమైన చందలూరులో రాష్ట్రస్థాయి పోటీల నిర్వహణ బాగుంది. గ్రామస్థులు చూపిన ప్రేమ, ఆప్యాయతలు మరువలేని అనుభూతిని మిగిల్చాయి. నగరాలు, పట్టణాలలో జరిగే రాష్ట్ర, జాతీయస్థాయి యోగా పోటీలు ఓ గ్రామీణ ప్రాంతంలో ఇంత అద్భుతంగా నిర్వహించడం సంతృప్తినిచ్చింది.' అని పలువురు క్రీడాకారులు 'ఆంధ్రజ్యోతి'తో తమ అభిప్రాయాలు పంచుకున్నారు. పంగులూరు మండలం చందలూరులో రాష్ట్రస్థాయిలో 69వ ఎస్‌జీఎఫ్ యోగా పోటీలు నిర్వహించిన సంగతి తెలిసిందే. చందలూరు గ్రామంలో రెండురోజుల క్రీడా పోటీలలో పాల్గొన్న పరిశీలకులు, కోచ్‌లు, మేనేజర్లు, క్రీడాకారులు వసతుల ఏర్పాటు, భోజన సదుపాయం, క్రీడా పోటీల నిర్వహణ పట్ల పూర్తి సంతృప్తిని వ్యక్తం చేశారు.

మరువలేని అనుభూతి



17 ఏళ్లుగా యోగా పోటీలకు వెళుతున్నా. పట్టణాలు, నగరాలలో జరిగే రాష్ట్ర, జాతీయ స్థాయి యోగా పోటీలు నిర్వహిస్తారు. అయితే మారుమూల గ్రామంలో ఇంత అద్భుతంగా నిర్వహించడం గొప్ప విషయం. మేము ఎక్కడ పోటీలకు వెళ్లినా, పాఠశాల భవనాల్లో వసతి కల్పించేవారు. కామన్ టాయిలెట్లతో మేము ఇబ్బంది పడిన సందర్భాలు అనేకం ఉన్నాయి. అయితే ఇక్కడ గ్రామీణ ప్రాంతమైనా చక్కని వసతులు కల్పించారు.

- పి.సుజాత, కోచ్, తూర్పు గోదావరి జిల్లా.

గ్రామస్థులు సొంత బిడ్డలా చూసుకున్నారు



యోగా పోటీలకు వచ్చిన తమకు నివాస గృహాలలో వసతి కల్పించారు. మాకు ఎలాంటి ఇబ్బంది లేకుండా గ్రామస్థులు తమ సొంత బిడ్డలా చూసుకున్నారు. సెలవురోజుల్లో అమ్మమ్మ, నానమ్మల ఇంటికి వచ్చిన అనుభూతి కలిగింది. ఇంటి యజమానులు మా పట్ల చూపిన అభిమానం మరువలేనిది.

- క్రీడాకారిని అమృత, చిత్తూరు.

గ్రామీణ ప్రాంతమనే భావనే కలగలేదు



రాష్ట్ర స్థాయి యోగా పోటీలలో పాల్గొన్న మాకు అధికారులు, గ్రామస్థులు చక్కని వసతి, భోజనం అందించారు. గ్రామీణ ప్రాంతమనే భావనే మాకు కలగ లేదు. నిత్యం మా పాఠశాలల్లో ఇళ్ల వద్ద సాధన చేసిన మాదిరిగానే ఇక్కడ పోటీలలో పాల్గొన్నాం.

- కోయ చరణ్, పశ్చిమ గోదావరి క్రీడాకారుడు.

బాలికలకు నివాస గృహాల్లో వసతి



యోగా పోటీలలో పాల్గొన్న వివిధ జిల్లాల బాలికలకు నివాస గృహాల్లో వసతి కల్పిచడం సంతోషంగా ఉంది. గ్రామస్థులు ఆదరించిన తీరు, కల్పించిన వసతులు బాగున్నాయి. గ్రామీణ ప్రాంతంలో క్రీడాకారులు, క్రీడల పట్ల ఉన్న ముక్కువను గ్రామస్థుల ఆతిథ్యం చెప్పకనే చెబుతోంది.

- నరేంద్ర జట్టు మేనేజర్, కృష్ణాజిల్లా

గురుకుల పాఠశాలల్లో పార్టుటైమ్ టీచర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలి

ఒంగోలు నగరం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలో నడుస్తున్న అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలు,కళాశాలల్లో ఖాళీగా ఉన్న పార్టుటైమ్ టీచర్ పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సంస్థ జిల్లా కో ఆర్డినేటర్ డి.జయ ఓ ప్రకటనలో కోరారు.

చీమకుర్తి బాలికల పాఠశాలలో జేఎల్ బోటనీ, మార్కాపురం బాలికల పాఠశాలలో జేఎల్, గణితం, కొండపి బాలికల పాఠశాలలో టీజీటీ ఫిజికల్ సైన్సు, పీజీటీ గణితం పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆమె తెలిపారు. అభ్యర్థులకు సంబంధిత సబ్జెక్టులో డిగ్రీతో పాటు పీజీ, బీఈడీ అర్హత ఉండాలన్నారు. టెట్‌లో ఉత్తీర్ణత సాధించాలన్నారు. వచ్చే నెల ఒకటో తేదీ సాయంత్రం ఐదు గంటలలోపు తమ దరఖాస్తులను నేరుగా చీమకుర్తిలోని గురుకుల పాఠశాల కార్యాలయంలో అందజేయాలన్నారు. దరఖాస్తు చేసుకున్నవారికి డిసెంబరు రెండో తేదీన ఉదయం 11 గంటల నుంచి టీచింగ్ డెమో నిర్వహిస్తామన్నారు.

ప్రాంగణ ఎంపికలతో విద్యార్థులకు ప్రయోజనం

● సెయింట్ ఆన్స్‌లో 50 మందికి ఉద్యోగాలు

చీరాల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రాంగణ ఎంపికలతో విద్యార్థులకు ఆర్థిక భరోసాతో పాటు నాణ్యమైన అనుభవం ఉంటుందని సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు పేర్కొన్నారు. సోమవారం కళాశాలలో ముంబయి ప్రధాన కేంద్రంగా ఉన్న అలింబిక్ ఫార్మాసూటికల్స్ లిమిటెడ్ కంపెనీ సౌజన్యంతో ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ఈక్రమంలో కళాశాలకు చెందిన బీ ఫార్మసీ విద్యార్థులు 100 మంది, ఎంబీఏకు చెందిన 50 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. వారిని ప్రతినిధులు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డా.జగదీష్, ఎంపికల అధికారి పూర్ణ చంద్రరావు పాల్గొన్నారు.

వ్యవసాయరంగ అభివృద్ధికి కృషి

● రైతన్న మీకోసం సభలో మంత్రి గొట్టిపాటి రవికుమార్ ● అగ్రహారం భూముల సమస్యను పరిష్కరిస్తాం

సంతమాగులూరు సెప్టెంబర్ 24(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని, రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ అన్నారు. సంతమాగులూరు మండలం కొమ్మాలపాడు గ్రామంలో రైతన్న మీకోసం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మంత్రి గొట్టిపాటి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి రవికుమార్ మాట్లాడు తూ వ్యవసాయ రంగ అభివృద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎంతగానో కృషి చేస్తున్నా రన్నారు. వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా తీర్చిదిం దేందుకు పంటమార్పిడి పైకి అవగాహన కల్పించేందు కు రైతన్న మీకోసం' కార్యక్రమాన్ని చేపట్టినట్లు రవికుమార్ తెలిపారు. వ్యవసాయ అధికారులు సిబ్బంది ప్రతి రైతును కలిసి వ్యవసాయం లాభ సాటిగా మార్చుకునేందుకు ఐదు అంశాలతో కూడిన ప్రాధాన్యతలను తెలియజేస్తున్నారన్నారు.

అన్నదాత సుఖీభవ కింద అద్దంకి నియోజకవర్గంలో 40228 మంది రైతులకు ప్రయోజనం చేకూరిందని, సంతమాగులూరు మండలంలో 8871 మంది రైతులు లబ్ధి పొందారన్నారు. కొమ్మలపాడు అగ్రహారం భూములలో 1373 మంది రైతులు ఉండగా 966 మంది రైతుల ఖాతాల్లో అన్నదాత సుఖీభవ నగదు జమైనట్లు తెలిపారు. అన్నదాత సుఖీభవ జమ కాని రైతుల సాంకేతిక సమస్యలు ఉన్న 377 మంది రైతులకు కూడా నగదు జమయ్యేలా చూస్తామన్నారు.

గత పాలకుడు జగన్ జమానాలో ఐదేళ్లలో వ్యవసాయ రంగం పూర్తిగా కుదేలైందన్నారు. రైతుల వద్ద నుంచి ధాన్యం సేకరించిన రైతులకు 1870 కోట్లు జగన్ జమానాలో చెల్లించకుండా బాకీలు ఉన్నట్లు తెలిపారు. రైతుశ్రేయస్సు ముఖ్యంగా పరిపాలిస్తున్న కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పాత బకాయిలు రూ.1870 కోట్లను రైతుల ఖాతాలో జమ చేశామన్నారు. పొగాకు రైతులను సంక్షోభం నుండి కాపాడేందుకు దేశంలో మరే రాష్ట్ర ప్రభుత్వం చేయని విధంగా రూ.270 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం భరించి పొగాకు కొనుగోలు చేసిందన్నారు. చిత్తూరు జిల్లాలో మామిడి రైతులకు కూడా రాష్ట్ర ప్రభుత్వం ఆదుకున్న విషయాన్ని మంత్రి రవికుమార్ గుర్తు చేశారు. రైతులకు ఎరువుల సమస్యను కూడా పరిష్కరించినట్లు తెలిపారు. రైతులు అధికారులకు సహకరించి పంటమార్పిడి విధానాన్ని అనుసరించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలన్నారు. కార్యక్రమంలో మార్టూరు ఏడీఏ వ్యవసాయ అధికారి షేక్ సైదా, ఉద్యానవనశాఖ అధికారి హనుమంత నాయక్, తహసీల్దార్ రవిబాబు, సంతమాగులూరు ఏఎంసీ ఛైర్మన్ తేలప్రోలు రమేష్, టీడీపీ మండల అధ్యక్షుడు చేవూరి వాసురెడ్డి, గ్రామ టీడీపీ కార్యదర్శి కొష్టాల మస్తాన్‌వలి, నాయకులు మోతాదు భాషా, అబ్దుల్ హఫీజ్, బుజ్జి గారి ఖాదర్ మస్తాన్ పాల్గొన్నారు.

రైతులకు అండగా ప్రభుత్వం

అద్దంకిటౌన్ : ప్రభుత్వం రైతుల కొరకు విత్తనం దగ్గర నుంచి పంట అమ్ముకునే వరకు ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. సోమవారం మండలంలోని నాగులపాగు గ్రామంలో పర్యటించిన ఆయన రైతన్న.. మీ కోసం' కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ అధికారులు, సిబ్బందితో కలిసి రైతుల ఇంటి వద్దకు వెళ్లి ముఖ్యమంత్రి సందేశాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా సంబంధిత యాప్‌లో రైతుల వివరాల నమోదును మంత్రి పరిశీలించారు.



మాట్లాడుతున్న మంత్రి రవికుమార్

అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం ద్వారా రూ.14 వేలను రైతుల ఖాతాలల్లో జమ చేసినట్లు తెలిపారు. జనవరిలో మరో 6 వేల రూపాయలు అందిస్తామని అధికారులు తెలిపారు. ధాన్యం కోనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి రవికుమార్ మాట్లాడుతూ వ్యవసాయ సిబ్బంది ప్రతి రైతు ఇంటికి వెళ్లి సాగుకు మంచి చేసే ముఖ్యమంత్రి 5 సూత్రాలను రైతులకు తెలియజేయాలన్నారు. రసాయన ఎరువుల వినియోగం తగ్గించి సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం చేసే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. డీఏవో కె. అన్నపూర్ణ, ఏడీఏ బి. ఎఫ్రాయిమ్, ఏవో కొర్రపాటి వెంకటకృష్ణ, ఉద్యాన శాఖ అధికారిణి దీప్తి, బాపట్ల శాస్త్రవేత ఏడుకొండలు, గ్రామ వ్యవసాయ సహాయకులు చాందిని, వీఆర్‌వో అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఊపందుకున్న మిర్చి సాగు

పర్చూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : గత రెండు సీజన్లు మిర్చి రైతులకు నష్టాలు మిగిల్చినప్పటికీ, మరో ఏడాది రైతులు సాగుకు ఉత్సాహం చూపుతున్నారు. వచ్చే సీజన్‌కు ధర ఆశాజనకంగా ఉండవచ్చన్న చిన్న దింపుడుకల్లం ఆశ రైతులను ఆ దిశగా ముందుకు నెడు తోంది. మరోవైపు పొగాకు, పత్తి, శనగ వంటి పంటలు సాగు కూడా నష్టాలను మిగిలస్తుండడంతో అని వార్యంగా రైతులు మిరపవైపు మొగ్గు చూపుతు న్నారు.

స్వల్పంగా పెరిగిన ధర

రెండు నెలల క్రిందట క్వింటా రూ.10 నుండి 12వేలకే పరిమితమైన మిర్చి ధర ప్రస్తుతం ఒకింత చురుగ్గా ఉంది. ప్రస్తుతం రూ.15 వేల వరకు ధర పలుకుతోంది. గతంలో పండించిన పంట శీతల గిడ్డంగుల్లో ముగ్గుతున్న ఈ ఏడాది కర్ణాటకలో సైతం మిరప సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. దీంతో భవిష్యత్‌లో ధర వస్తుందన్న ఆశతో రైతులు సాగుకు సన్నద్ధం అవుతున్నారు. మొంథా తుఫాను నాటికి మిరప మొక్క రూ.1కి మించి లేకపోవడంతో పాటు, కొనేదిక్కుకూడా లేకుండా పోయింది. ప్రస్తుతం రైతులు మిర్చి సాగుకు ఆసక్తి చూపుతుండడంతో ప్రస్తుతం మిర్చి మొక్క రూ.2.50 ధర పలుకుతోంది. అయితే ధర ఎంత అయినా సకాలంలో నాటుకునేందుకు రైతులు నారుకోసం పోటీపడుతు న్నారు. గతంలో పండించిన శనగ పంటను కొనేపరిస్థితి లేకపోవటం, నల్లబర్లీ సాగుచేసుకున్న రైతులు కొనేదిక్కులేక నష్టాల ఊబిలో చిక్కుకు పోవటం, ఈఏడాది నల్లబర్లీ పొగాకు సాగును ప్రభుత్వం నిషేధించటంతో రైతులు ప్రత్యామ్నాయం వైపు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఇలాంటి పరిస్థితుల్లో బహిరంగ మార్కెట్‌లో ధర పెరుగుతుండడంతో మిర్చి సాగువైపు రైతులు మొగ్గేలా ప్రస్తుత పరిస్థితి ఉంది. సాగుకు అధిక వ్యయం వెచ్చించాల్సి ఉన్నా కనీస దిగుబడి వచ్చినా మంచి ధర లభిస్తుందన్న ఆశతో రైతులు మిర్చిసాగుకు మొగ్గు చూపుతున్నారు. పర్చూరు వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలోని పర్చూరు, యద్దనపూడి, కారంచేడు మండలాల పరిధిలో మిర్చి సాగు జోరుగా సాగుతుంది. వాతావరణ పరిస్థితులు, తెగుళ్లు, ధర, మిర్చి రైతులను ఏమేరకు ఒడ్డున చేరుస్తాయో వేచిచూడాల్సి ఉంది



మిరపనారును తీసుకెళుతున్న రైతులు



నూతలపాడులో మిర్చి మొక్కలు నాటుతున్న కూలీలు

యూరియా అధిక ధరకు విక్రయిస్తే చర్యలు

● ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

● పలు ఎరువుల దుకాణాల్లో ముమ్మర తనిఖీలు

చీరాల, నవంబరు 24(ఆంధ్రజ్యోతి) : రైతులకు ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు మాత్రమే యూరియా విక్రయించాలని, భిన్నంగా వ్యవహరిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు హెచ్చరించారు. గత శనివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన యూరియా బస్తా రూ.500 కథనానికి ఆర్డీవో స్పందించారు. వీఆర్వోలతో కూడిన పలు బృందాలను ఏర్పాటు చేసి చీరాల రెవెన్యూ డివిజన్ పరిధిలోని దుకాణాల్లో తనిఖీలు చేయించారు. రికార్డులు పరిశీలించారు. నిర్వాహకులకు పలు హెచ్చరికలు జారీ చేశారు. సమస్యలున్న రైతులు నేరుగా సంప్రదించాలని ఆర్డీవో స్పష్టం చేశారు.

రేపు మార్టూరులో రైతుల నిరసన

మార్టూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగాన్ని కాపాడు కోవాలని, రైతాంగాన్ని రక్షించుకోవాలని, సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు బుధవారం మార్టూరులో రైతులతో నిరసన కార్యక్రమం చేపట్టినట్లు సోమవారం మార్టూరులో రైతుసంఘం నాయకులు, సీఐటీయూ నాయ కులు ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.

ప్రతి వ్యాపార సముదాయం పన్ను చెల్లింపు పరిధిలో ఉండాలి

ఆదాయపన్ను శాఖ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు

చీరాల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రతి వ్యాపార సంస్థ, వారి వ్యాపార భాగస్వాములు అలాగే రూ.15 వేలకు మించి జీత భత్యాలు అందిస్తున్న సిబ్బందికి సంబంధించి పన్నులు విధిగా ఈనెల 30వ తేదీ లోగా చెల్లించాలని ఆదాయపన్ను శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఆర్.శ్రీనివాసరావు చెప్పారు. సోమవారం పట్టణంలోని ఆయన కార్యాలయంలో వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ వృత్తి, వ్యాపారం చేస్తున్న వారు నిబంధనలు అనుసరించి పన్ను చెల్లింపులు చేయా లన్నారు. ఏడాదిలో రూ.10 లక్షలకు మించి వ్యాపారాలు నిర్వహిస్తున్న వారు ఏడాదికి ఒక్కసారి మాత్ర మే పన్ను చెల్లించా ల్సి ఉంటుందన్నారు.

నెల వారీ చెల్లింపుల్లో ఫారం-1 అనుసరించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్లు మల్లికార్జున, లక్ష్మీకుమార్, గూడ్స్ అండ్ సర్వీస్ టాక్స్ అధికారి జమీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ మాసం ప్రారంభం

● వేడుకలకు సిద్ధమవుతున్న చర్చిలు

చీరాల, నవం బరు 24 (ఆంధ్ర జ్యోతి) : క్రైస్తవులు అత్యంత ప్రీతిపాత్రంగా భావించే క్రిస్మస్ మాసం మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. అందుకు సంబంధించి ఇప్పటికే క్రైస్తవ ప్రార్థనా మంది రాల వద్ద కోలాహలం నెలకొంది. క్రీస్తు పుట్టుకను సూచిస్తూ, స్టార్ల ఏర్పాటుకు భక్తులు సిద్ధ మయ్యాయరు. వివిధ చర్చిల వద్ద విద్యుత్ దీపాల ఏర్పాటు చేస్తున్నారు.



సెయింట్ మార్క్స్ లూథరన్ చర్చ్ (ఫైల్)


గుంటుపల్లిలో దగ్ధమవుతున్న కిరాణా దుకాణం

గుంటుపల్లిలో అగ్నిప్రమాదం

● విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో రెండు దుకాణాలు దగ్ధం
● రూ. 50 లక్షలకు పైగా ఆస్తి నష్టం

పీసీపల్లి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంటుపల్లిలో సోమవారం తెల్లవారుజామున జరిగిన అగ్నిప్రమాదంలో రెండు దుకాణాలు దగ్ధమయ్యాయి. ఈప్రమాదంలో రూ.50 లక్షలకు పైగా ఆస్తి నష్టం జరిగింది. గుంటుపల్లి గ్రామంలో గాదంశెట్టి సాయికృష్ణ కిరాణాదుకాణం, దుస్తులషాపు నిర్వహిస్తున్నారు. ఎప్పటిలాగే ఆదివారం కూడా దుకాణాన్ని తెరిచిన సాయికృష్ణ రాత్రి దుకాణాన్ని మూసివేసి ఇంటికి వెళ్లాడు. సోమవారం తెల్లవారు జామున విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో దుకాణంలో మంటలు చెలరేగాయి. గమనించిన గ్రామస్థులు దుకాణ యజమానికి సమాచారం అందించారు. దుకాణం వద్దకు చేరుకున్న సాయికృష్ణ స్థానికులతో కలిసి నీటితో మంటలను అదుపుచేసే ప్రయత్నం చేశారు. అగ్నిజ్వాలలు వేగంగా వ్యాపించడంతో మంటలు చెలరేగి నిముషాల్లోనే రెండు దుకాణాలు దగ్ధమయ్యాయి. కిరాణాదుకాణంలో ఉన్నరూ.15లక్షల విలువగల కిరాణాసామాన్లు, దుస్తుల దుకాణంలో రూ.పది లక్షల విలువగల బట్టలు, రూ.7 లక్షల నగదు మంటల్లో కాలి బూడిదయ్యాయి. అలాగే, రెండు దుకాణాలు పూర్తిగా కాలిపోవడంతో సుమారు రూ.50 లక్షలకు పైగా ఆస్తినష్టం జరిగినట్లు బాధితుడు సాయికృష్ణ చెప్పారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు.


మాట్లాడుతున్న ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్ రెడ్డి

పీఆర్సీ కమిషన్‌ను నియమించాలి

ఒంగోలు కల్చరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వం తక్షణమే పీఆర్సీ కమిషన్‌ను నియమించాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నపరెడ్డి కిరణ్‌కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఒంగోలులోని సంఘ కార్యాలయంలో నిర్వహించిన ఒంగోలు పట్టణ, తాలూకా కార్యనిర్వాహక కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సభ్యత్వ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని, సంఘ పటిష్టతకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని అన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి వరకుమార్, కోశాధికారి రంగారెడ్డి, పట్టణ అధ్యక్షుడు మోటా శ్రీనివాస రావు, తాలూకా అధ్యక్షుడు సురేష్ బాబు, మహిళా విభాగం అధ్యక్షురాలు రజిత మానస, చంద్రశేఖర్, శ్రీనివాసులు, ఏసురత్నం, చెంచారావు, ప్రసన్న, సుమతి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.


ప్రశాంతి గీసిన చిత్రాన్ని తిలకిస్తున్న గోవా సీఎం ప్రమోద్‌సావంత్ (ఇన్‌సెట్లో) చాయాచిత్రం

ఈదుమూడి వాసికి గోవా సీఎం ప్రశంసలు

నాగులుప్పలపాడు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): గోవా రాష్ట్రంలో ఈనెల 21 నుంచి ఈఎస్‌టీ ఆర్ట్ గ్యాలరీలో జరుగుతున్న గోవా ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్- 2025 లో ఈదుమూడి గ్రామానికి చెందిన చుండూరు ప్రశాంతి గీసిన చాయాచిత్రం ఆ రాష్ట్ర సీఎం ప్రమోద్‌సావంత్, ఇతర మంత్రుల ప్రశంసలు అందుకొంది. ఉద్యోగరీత్యా గోవాలో స్థిరపడిన ఈదుమూడి గ్రామానికి చెందిన పోలినేని వెంకటేశ్వరరావు, చుండూరి ప్రశాంతి దంపతులు ఉద్యోగరీత్యా తొమ్మిదేళ్ల క్రితం గోవాలో స్థిరపడ్డారు.ప్రశాంతి పేయింటింగ్‌పై ఉన్న మక్కువతో అక్కడి వాటర్‌కలర్ అసోసియేషన్‌లో సభ్యత్వం పొంది చాయాచిత్రాలను గీస్తూ ప్రతి ఏడాది పలు ప్రదర్శనలిచ్చేవారు. అందులో భాగంగా 2025 గోవా ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రశాంతి స్వయంగా గీసి ప్రదర్శించిన చిత్రాన్ని ఆ రాష్ట్ర సీఎం ప్రమోద్‌సావంత్,పలువురు మంత్రులు తిలకించి ప్రశంసలు అందించారు.


సాయుధ దళాల పతాక దినోత్సవానికి విరాళాన్ని అందిస్తున్న కలెక్టర్ రాజాబాబు

సాయిధ దళాల పతాక దినోత్సవ పోస్టర్ల ఆవిష్కరణ

ఒంగోలు(రూరల్),నవంబరు24(ఆంధ్రజ్యోతి): డిసెంబరు 7న జరగనున్న సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం పీజీఆర్ఎస్ హాల్లో అందుకు సంబంధించిన స్టిక్కర్‌లను, కారు ఫ్లాగ్స్ పోస్టర్‌లను కలెక్టర్ పి. రాజాబాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడతూ ఈ స్టికర్‌లను జిల్లాలోని వివిధ కార్యాలయాలకు పంపి వ్యాపారులు, ప్రజలు, పారిశ్రామిక వేత్తలకు అమ్మకాలు చేయాలన్నారు.ఆ వచ్చిన నగదును యుద్ధంలో వీరమరణం పొందిన కుటుంబాలవారికి,గాయపడిన సైనికుల కుటుంబాల సంక్షేమం కోసం ఉపయోగిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ ఆర్. గోపాలకృష్ణ, డీఆర్‌వో, జిల్లా సైనిక సంక్షేమ అధికారి తదతరులు పాల్గొన్నారు.

గిద్దలూరు-నంద్యాల మధ్య గల నల్లమల ఘాట్‌రోడ్డు ప్రమాదాలకు కేరాఫ్‌గా మారింది. తరచూ ఘాట్‌రోడ్డులో ప్రమాదాలు చోటుచేసుకుంటుండడంతో ట్రాఫిక్ స్తంభించి పోతోంది. ప్రమాదం జరిగిన ప్రతిసారి గంటల తరబడి వాహనాలు ఆగిపోతున్నాయి. ఆసమయంలో బస్సుల్లో, ఆ వాహనాల్లో ఉన్న ప్రయాణికులు, వాహన చోదకులు తిండికి, నీటికి అలమటించే పరిస్థితులు నెలకొంటున్నాయి. గత నెలలో 2 లారీ ప్రమాదాలు ఒకే ప్రాంతంలో చోటుచేసుకోగా ఈ రెండు లారీల డ్రైవర్లు అక్కడికక్కడే మృతిచెందారు. 6గంటల పాటు ట్రాఫిక్ పూర్తిగా స్తంభించిపోయింది.

ఘాట్‌లో నిత్యం ప్రమాదాలే

తరచూ స్తంభిస్తున్న ట్రాఫిక్
గంటల తరబడి నిలిచిపోతున్న వాహనాలు
నరకయాతన పడుతున్న ప్రయాణికులు, చోదకులు
రోడ్డు విస్తరణ కోసం ఎదురుచూపులు




నల్లమల ఘాట్ రోడ్డులో మలుపు వద్ద బ్రిడ్జి గోడను ఢీకొన్న లారీలు (ఫైల్)

గిద్దలూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): గిద్దలూరు నుండి నంద్యాల మధ్య సుమారు 60 కిలోమీటర్లు ఉండగా దిగువమెట్ట నుంచి గాజులపల్లి వరకు మధ్య ఉన్న 30 కిలోమీటర్ల దూరం మొత్తం నల్లమల అటవీ ప్రాంతం గుండా వెళ్ళాల్సిందే. ఈ ఘాట్‌రోడ్డులో అనేక చోట్ల రోడ్డు మార్జిన్లు ఉన్నప్పటికీ కీలకమైన మలుపుల వద్ద, ఎత్తైన ప్రదేశాలలో మోటార్ సైకిల్ పోయేంత మార్జిన్ కూడా లేని పరిస్థితి తెలిసిందే. మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనం కనిపించదు. కేవలం హారన్ ఆధారంగా ముందుకు వెళ్ళాల్సిందే. ప్రతినెలలో 10 నుంచి 15 ప్రమాదాలు చిన్నవి, పెద్దవి జరుగుతుండగా లారీలు వంటి పెద్ద వాహనాలు ప్రమాదానికి గురైన సందర్భాలలో ట్రాఫిక్ స్తంభించిపోతున్నది. ట్రాఫిక్ ఆగిపోయిన సందర్భాలలో వాహనాలలోంచి దిగుదామంటే కూడా అటవీ జంతువుల భయం పట్టి పీడిస్తున్నది.

రెండు జిల్లాల పరిధిలో..

ఈ ఘాట్ రోడ్డు ప్రకాశం, నంద్యాల జిల్లాల పరిధిలో ఉన్నది. గిద్దలూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో కొంత భాగం ఉండగా, నంద్యాల జిల్లాలోని సిరివెల్ల, మహానంది పోలీసుస్టేషన్ల పరిధిలో కొంత భాగం ఘాట్ రోడ్డు ఉన్నది. ఘాట్‌రోడ్డులో చాలా వరకు సెల్‌సిగ్నల్స్ పనిచేయవు. ప్రమాదం జరిగిన సందర్భాలలో ప్రమాదం ఏ పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది, ఎవరు స్పందించాలని అనే విషయంపై తెలుసుకునే వరకే గంటలు గడిచిపోతున్నాయి. పోలీసులు తెలుసుకుని ప్రమాద స్థలికి వెళ్ళిన తరువాత పరిస్థితి తీవ్రత తెలుసుకుని ఇటు గిద్దలూరు, అటు గాజులపల్లి నుంచి క్రేన్లు తెప్పించి వాహనాలను పక్కకు తీసేందుకు గంటల సమయం పడుతున్నది.

కర్నూలు జిల్లాలో ప్రధానమంత్రి పర్యటన జరుగుతున్న ముందురోజు రాత్రి ఘాట్‌రోడ్డులో లారీ అదుపుతప్పి కీలకమలుపు వద్ద బ్రిడ్జి గోడను ఢీకొనగా డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందాడు. రోడ్డుకు అడ్డంగా లారీ నిలిచిపోవడంతో ట్రాఫిక్ ఆగిపోయింది. ఇతర జిల్లాల నుంచి, మన జిల్లా నుంచి తెల్లవారితే ప్రధానమంత్రి పర్యటనలో పాల్గొనేందుకు వెలుతున్న వందలాది వాహనాలను గిద్దలూరులోనే ఆపి పోరుమామిళ్ళ, మైదుకూరు మీదుగా నంద్యాలకు ఆపై కర్నూలు జిల్లాలోకి 100 కిలో మీటర్ల చుట్టూ తిప్పి పంపాల్సిన పరిస్థితి నెలకొన్న విషయం అందరికీ తెలిసిందే.


మలుపు తిరిగితే తప్ప ఎదురుగా వచ్చే వాహనం కనిపించని ఘాట్‌రోడ్డు

విస్తరణ జరిగేనా ?

అనంతపురం-అమరావతి రోడ్డును స్టేట్ హైవే నుంచి నేషనల్ హైవేకు గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో మార్పు చేయించారు. ఈ రోడ్డును విస్తరించాలని టెండర్లు కూడా పిలిచారు. టెండర్‌దారుల మధ్య పోటీ కారణంగా రాజకీయ పలుకుబడి ఉపయోగించి కొన్ని ప్యాకేజీలను వాయిదా వేయించారు. కేవలం గిద్దలూరు నుంచి వినుకొండ వరకు మాత్రమే 112 కిలోమీటర్ల మేర రోడ్డు విస్తరణ జరిగింది. అనంతపురం నుంచి గిద్దలూరు వరకు, వినుకొండ నుంచి గుంటూరు వరకు విస్తరణ పనులు ఆగిపోయాయి. ఆ తరువాత వైసీపీ ప్రభుత్వం రాగా రోడ్డు విస్తరణ పనులను పట్టించుకోలేదు. ప్రస్తుతం మళ్ళీ టీడీపీ ప్రభుత్వం రావడంతో విస్తరణపై ఆశలు మొదలయ్యాయి. ఇందులో భాగంగానే ఇటీవల మిగిలిన రోడ్డును 4 లైన్ల రోడ్డుగా మార్చేందుకు 9వేల కోట్ల రూపాయలను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసేందుకు సుముఖత వ్యక్తం చేయడంతో ప్రజల్లో మళ్ళీ ఆశలు మొదలయ్యాయి. ఘాట్ రోడ్డును 4 లైన్లుగా కనీసం కీలక మలుపుల వద్దనైనా ఎక్కువ మార్జిన్ ఉండే విధంగా తాత్కాలిక మార్పులు చేస్తే తప్ప ప్రమాదాలు ఆగిపోని పరిస్థితి నెలకొన్నది. ప్రజాప్రతినిధులు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చి విస్తరణ పనులు మొదలయ్యే విధంగా చూడాలని వాహన చోదకులు, ప్రయాణికులు కోరుతున్నారు.

వేర్వేరు ఘటనల్లో ముగ్గురు మృతి

● రైలు, లారీ కింద పడి ఇద్దరు, భయంతో ఆత్మహత్య చేసుకున్న ఒకరు..

పశ్చిమ ప్రకాశంలో సోమవారం జరిగిన వేర్వేరు ఘటనల్లో ముగ్గురు మృతిచెందారు. కంభం మండలం కందులాపురంలో వేగంగా వెళుతున్న ద్విచక్రవాహనానికి ఓ యువకుడు అడ్డురావడంతో ఢీకొని ప్రమాదవశాత్తు లారీ కిందపడి వాహనచోదకుడు దుర్మరణం చెందాడు. కొంతకాలంగా ఆరోగ్యం బాగోలేకపోవడంతో జీవితంపై విరక్తి చెంది త్రిపురాంతకం మండలం దూపాడుకు చెందిన లారీ డ్రైవర్ మార్కాపురం రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. అలాగే ఓ బాలికపై లైంగిక దాడికి యత్నించిన ఘటనపై పోక్సో కేసు నమోదు కావడంతో భయపడిన మార్కాపురానికి చెందిన ఓ యువకుడు ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

బైక్ అదుపుతప్పి లారీ కిందకు..


లారీ కిందపడి మరణించిన షేర్ అలీ (ఫైల్)

కంభం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : బైక్ ప్రమాదంలో వేగంగా వెళుతున్న లారీ కిందపడి యువకుడు మృతిచెందిన ఘటన సోమవారం కంభం మండలం కందులాపురం సెంటర్లో జరిగింది. వివరాలలోకి వెళితే షేర్ అలి (23) అనే యువకుడు స్కూటీపై కంభం వైపు వెళ్తుండగా కందులాపురం సెంటర్‌లో డివైడర్ దగ్గర ఓ యువకుడు అలి నడుపుతున్న ద్విచక్రవాహనానికి అడ్డు రావడంతో ఆ యువకుడిని ఢీకొట్టిన అలీ అదుపుతప్పి మార్కాపురం నుంచి కడప వైపు వెళ్తున్న లారీ టైర్ల కిందపడ్డాడు. దీంతో తల ఛిద్రమై అక్కడికక్కడే మృతిచెందాడు. కుమారుడు మృతి చెందడంతో తండ్రి మదార్ రోదిస్తున్న తీరు అందరినీ కలచివేసింది. కంభం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కింద పడి..

మార్కాపురం రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కింద పడి కొండమాల కృపాలు (50) మృతి చెందిన ఘటన సోమవారం తెల్లవారు జామున జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం త్రిపురాంతకం మండలం దూపాడు గ్రామానికి చెందిన కొండమాలు కృపాలు మార్కాపురం పట్టణంలో లారీ డ్రైవర్‌గా పనిచేస్తుండేవాడు. కొంతకాలంగా పక్షవాతంతో బాధపడుతున్నారు. తాజాగా విజయవాడలోని ప్రైవేటు వైద్యశాలలో చికిత్స చేయించుకునేందుకు వెళ్లారు. ఆరోగ్యం సరిగ్గా లేకపోవడం, ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు పాల్పడిఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. ఘటనా స్థలాన్ని రైల్వే ఏఎస్ఐ వెంగళరెడ్డి పరిశీలించి మృతదేహాన్ని శవ పంచనామా నిమిత్తం మార్కాపురం జీజీహెచ్‌కు తరలించారు.

కేసు భయంతో ఉరివేసుకుని..

మార్కాపురం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఓ మైనర్ బాలికపై అత్యాచారానికి యత్నించిన వ్యక్తిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు అయ్యింది. దీంతో భయాందోళనకు గురై ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సోమవారం వేకువజామున చోటు చేసుకుంది. ఈ ఘటనలో షేక్ రఫీ (23) మృతి చెందాడు. టౌన్ ఎస్సై ఎం.సైదుబాబు కథనం మేరకు.. స్థానిక విజయా టాకీస్ ప్రాంతానికి చెందిన షేక్ రఫీకి భార్య, కుమారుడు ఉన్నారు. అతని ఇంటికి సమీపంలోని 9వ తరగతి చదువుతున్న ఓ మైనర్ బాలికపై ఆదివారం సాయంత్రం లైంగిక దాడికి యత్నించాడు. దీంతో బాలిక తల్లిదండ్రులు వెంటనే టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసుకుని నిందితుడి కోసం వెతుకులాట ప్రారంభించారు. విషయం తెలుసుకుని భయాందోళనకు గురైన రఫీ సోమవారం వేకువజామున ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ఆత్మహత్య చేసుకున్న రఫీ మృతదేహాన్ని పరిశీలిస్తున్న టౌన్ ఎస్సై సైదుబాబు

గంజాయి విక్రయిస్తున్న ముగ్గురి అరెస్టు

● 2.5 కిలోలు స్వాధీనం
● కొనుగోలు చేసిన మరో 8 మందిపై కేసు నమోదు

ఒంగోలు క్రైం,నవంబరు 24(ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న ముగ్గురిని అరెస్టు చేసి 2.5 కిలలో గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు ఒంగోలు తాలుకా సీఐ విజయకృష్ణ తెలిపారు. సోమవారం స్థానిక సౌత్ బైపాస్ రోడ్డులోని ఫ్లైవోవర్ బ్రిడ్జి కింద నగరంలోని కమ్మపాలెంనకు చెందిన షేక్ సాహిల్, షేక్ నాయబ్ రసూల్, ఇందిరమ్మ కాలనీకి చెందిన బాలాజీలు ఒడిస్సా నుంచి గంజాయి తెచ్చి విక్రయించేందుకు నగరంలో ఉన్న మరో 8 మందిని పిలిచారు.

అక్కడ గంజాయి విక్రయాలు జరుగుతుండగా సమాచారం అందుకున్న ఒంగోలు మండల తహసీల్దార్ పిన్నిక శ్రీనివాసరావు, తమ సిబ్బందితో కలిసి దాడి చేసి గంజాయి విక్రయిస్తున్న ముగ్గురుతోపాటు కొనుగోలు చేసే మరో 8 మందిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరుస్తామని సీఐ తెలిపారు.

బ్రాయిలర్ ధరలు
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	117, 124, 136
చికెన్ విత్ స్కిన్ (కిలో)	222.00
చికెన్ స్కిన్ లెస్ (కిలో)	232.00

అధైర్యపడొద్దు.. ప్రభుత్వం అండగా ఉంటుంది..

బండ్లమూడి ఘటనలో బాధితులకు జవహర్ భరోసా
కౌంటర్ కేసులు ఎత్తివేయాలని పోలీసులకు ఆదేశం

చీమకుర్తి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): అధైర్యపడకండి.. బాధిత ఎస్సీ కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది అని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కె.ఎస్.జవహర్ భరోసా ఇచ్చారు.చీమకుర్తి మండలపరిధిలోని బండ్లమూడి గ్రామంలో ఇటీవల జరిగిన ఘటనలో గాయపడ్డ ఎస్సీ కుటుంబాలకు చెందిన బాధితులను సోమవారం జవహర్ పరామర్శించారు.సంఘటన జరిగిన తీరు, గాయాలు, వైద్యపరమైన సహాయం, సంఘటన తదుపరి జరిగిన పరిణామాలపై బాధితుడు కంట్లం ఏసుదాసు కుటుంబసభ్యులను అడిగి తెలుసుకున్నారు.దాడిలో గాయపడిన ముగ్గురికి నివేశన స్థలాలు, గృహనిర్మాణాలు మంజూరుచేస్తామని జవహర్ హామీ ఇచ్చారు. బాధితులపై నమోదైన కేసులను వెంటనే ఎత్తివేయాలని పోలీసులను ఆదేశించారు. గ్రామంలో కులవివక్ష లేకుండా తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబాలకు అన్ని విధాలా న్యాయం చేస్తామన్నారు. ఇంటిలో ఒకరికి ఉద్యోగం,ఎకరం పొలం ఇవ్వాలని బాధితులు జవహర్ దృష్టికి తీసుకురాగా ఈ విషయాన్ని ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా సాంఘికసంక్షేమ అధికారి లక్ష్మణ్ నాయక్,ఆర్‌డీవో లక్ష్మీప్రసన్న,తహసీల్దార్ బ్రహ్మయ్య. ఎంఆర్‌పీఎస్ నాయకులు రుద్రపోగు సురేష్,విశ్వనాథన్,మున్నంగి నాగరాజు,రామకృష్ణ,సాంబయ్య,వెంకటేశ్వర్లు,ఆనంద్,మోషే తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్సీ కమిషన్ చైర్మన్ కె.ఎస్. జవహర్


జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థితో ఉపాధ్యాయులు

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మార్కాపురంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు ఎం.చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం తెలిపారు. పాఠశాలకు చెందిన ఎం.అభి కర్నూలు జిల్లాలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ 17 రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలలో సత్తా చాటారని తెలిపారు. జాతీయ పోటీలలో ఏపీ రాష్ట్ర కబడ్డీ తరుపున ప్రాతినిథ్యం వహించనున్నట్లు హెచ్ఎం తెలిపారు. ప్రకాశం జిల్లా జట్టుకు పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపిక కాగా వారిలో ముండ్ల అభి, జాతీయ కబడ్డీ పోటీలకు అర్హత సాధించడం జరిగిందన్నారు. శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు పి.దామోదర్‌రెడ్డి, డి.శ్యామల దేవి, ఓబులేసును అభినందించారు.

అభివృద్ధి పనులకు విఘాతం కలిగిస్తున్న వైసీపీ సర్పంచ్

● టీడీపీ నేత శ్రీనివాసరావు ఆవేదన



డ్రైనేజీకాలువలో తీసిన పూడిక

సంతనూతలపాడు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఎం.వేములపాడులో చేపట్టే అభివృద్ధి పనులకు వైసీపీకి చెందిన సర్పంచ్ విఘాతం కలిగిస్తున్నారని టీడీపీ గ్రామ అధ్యక్షుడు మారెళ్ల శ్రీనివాసరావు ఆరోపించారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ గ్రామంలో రూ.లక్షలు వెచ్చించి పారిశుధ్య పనులను చేశామని, అయితే అందుకు సంబంధించిన బిల్లుల పై సర్పంచ్ సంతకం చేయకుండా ఇబ్బందిపెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో పనులు పూర్తిచేసిన వెంటనే బిల్లులు మంజూరైతే మిగతా పనులు చేసేందుకు అడుగు ముందుకు పడుతుందని తెలిపారు. కానీ వైసీపీకి చెందిన సర్పంచ్ మాత్రం అభివృద్ధి పనులు జరగకుండా విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. సంబంధిత బిల్లుపై పంచాయతీ కార్యదర్శి, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు సంతకాలు చేసినా గ్రామ సర్పంచ్ ఇంతవరకు సంతకం చేయలేదని ఆయన వాపోయారు. ఈ విషయంపై ఒంగోలు కలెక్టరేట్‌లో జరిగిన స్పందనలో ఫిర్యాదు చేసినట్లు ఆయన వెల్లడించారు. దీనిపై గ్రామ సర్పంచ్‌ని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా గ్రామంలోని ఎస్టీకాలనీలో కొందరు పారిశుధ్యపనులు పూర్తిగా చేసి బిల్లులు పెట్టుకోగా అవి మంజూరైనట్లు తెలిపారు.

యామినీశర్మకు సత్కారం



యామినీశర్మను సత్కరిస్తున్న నాయకులు

ఒంగోలు(రూరల్), నవంబరు24(ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని బీజేపీ సోమవారం ఆ పార్టీ రాష్ట్ర నాయకురాలు యామినీశర్మను ఓబీసీ మోర్చా మాజీ కార్యదర్శి రావులపల్లి నాగేంద్ర యాదవ్ సన్మానించారు. నెల్లూరులో జరుగుతున్న రాష్ట్ర బీజేపీ శిక్షణ కార్యక్రమాలకు వెళుతూ యామినీశర్మ ఒంగోలులోని పార్టీ కార్యాలయానికి విచ్చేశారు. ఈ సందర్భంగా నాయకులు ఆమెను కలిసి సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు రాష్ట్ర కార్యదర్శి బొడ్డు నాగలక్ష్మి, అధికార ప్రతినిధి గాయిత్రి గోగులు మల్లేశ్వరి, శారద తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌లో మూడు అర్జీలు

మద్దిపాడు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మద్దిపాడు తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో మూడు అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ వేమూరి ఆదిలక్ష్మి తెలిపారు. రెండు అర్జీలు కొలతలు, ఒకటి మ్యూటేషన్ కోసం దరఖాస్తులు వచ్చాయని, వాటిని వెంటనే పరిష్కరించాలని వీఆర్వోలను ఆదేశించినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ అజయ్‌కుమార్‌రెడ్డి, ఆర్‌ఐ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రాబ్యాంక్ విశ్రాంత ఉద్యోగుల వితరణ



నిత్యావసర సరుకులను అందజేస్తున్న సిబ్బంది

ఒంగోలు కల్చరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఆంధ్రాబ్యాంక్ విశ్రాంత ఉద్యోగుల సంఘం సభ్యులు సోమవారం స్థానిక హౌసింగ్‌బోర్డులోని మహిళాశ్రయం శక్తిసదన్‌కు నిత్యావసర సరుకులను అందజేశారు. ఆంధ్రాబ్యాంక్ వ్యవస్థాపకులు, స్వాతంత్ర్య సమరయోధుడు భోగరాజు పట్టాభి సీతారామయ్య 146వ జయంతి సందర్భంగా వీటిని వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రా బ్యాంక్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పి.కె.రాజేశ్వరరావు అధ్యక్షతన పట్టాభి సీతారామయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మహిళాభ్యుదయ సమితి రాష్ట్ర అధ్యక్షురాలు తేళ్ల అరుణ, ఆంధ్రా బ్యాంక్ విశ్రాంత ఉద్యోగుల సంఘం డిప్యూటీ జనరల్ సెక్రటరీ సబీ.రావు, రీజనల్ సెక్రటరీ వి.పార్ధసారథి, ఎగ్జిక్యూటివ్ సభ్యులు యూవీ.రత్నం, జీవీ.శేషగిరిరావు, సీహెచ్.త్యాగరాజు, స్వామి, డి.బ్రహ్మయ్య, కవయిత్రులు నాళం నరసమ్మ, సింహాద్రి జ్యోతిర్మయి, బీరం అరుణ తదితరులు పాల్గొన్నారు.

యరజర్లలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రత్యేక శిబిరం



మాట్లాడుతున్న ప్రిన్స్‌పాల్ హనుమంతరావు

ఒంగోలు(విద్య), నవంబరు24(ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని క్విజ్ ఇంజినీరింగ్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం, డాక్టర్ ఎన్‌ఎస్‌కేసీ వికసిత్ భారత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం ఒంగోలు మండలం యరజర్ల గ్రామంలో ఏడు రోజుల ప్రత్యేక శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా క్విజ్ విద్యాసంస్థల చైర్మన్ ఎన్.సూర్యకళ్యాణచక్రవర్తి మాట్లాడుతూ దేశ అభివృద్ధిలో యువత కీలకపాత్ర పోషించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్స్‌పాల్ వై.హనుమంతరావు, ఎన్‌ఎస్‌ఎస్ జిల్లా నోడల్ ఆఫీసర్ వాసుబాబు, డీన్ నవనీతకృష్ణన్, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, వైస్ సర్పంచ్ హరిబాబు, ఎంపీటీసీ జి.శ్రీనివాసులు, టీడీపీ నాయకుడు శ్రీనివాసరావు పాల్గొన్నారు. విద్యార్థులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి : డీఏవో

మద్దిపాడు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రైతులు తక్కువ ఖర్చుతో వ్యవసాయం చేసి అధిక దిగుబడి సాధించాలని డీఏవో శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం రాచవారిపాలెంలో నిర్వహించిన రైతన్న మీ కోసం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రానున్న ఐదు సంవత్సరాలలో రైతును రాజును చేసేందుకు కార్యాచరణ చేపడుతున్నట్లు చెప్పారు. సహాయ వ్యవసాయ సంచాలకులు బి.రమేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సాగు ఖర్చులు తగ్గించుకోవాలన్నారు. కార్యక్రమంలో వెటర్నరీశాఖ సంచాలకులు పి.కిషోర్‌కుమార్, ఏవో జి.స్వర్ణలత, తహసీల్దార్ ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలి

ఒంగోలు(రూరల్), నవంబరు24(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని కోరుతూ సీఐటీయూ నాయకులు సోమవారం ఒంగోలులో డీపీవో ఎం.వెంకటేశ్వరరావుకు వినతిపత్రం సమర్పించారు. కాంట్రాక్ట్ కార్మికులకు, గ్రీన్ అంబాసిడర్‌లకు వేతనాలు అందక ఇబ్బందులుపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు ఎం.రమేష్, పేరాబత్తిన శ్రీను, ఎ.ఇజ్రాయిల్, ఎన్.రత్నకుమార్, బాలగురవయ్య, చలమయ్య, రామారావు తదతరులు పాల్గొన్నారు.

ప్రజావేదికకు వినతుల వెల్లువ

సమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్యే దామచర్ల ఆదేశం



ప్రజల సమస్యలను ఆలకిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యల పరిష్కార వేదికగా ఒంగోలులో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ నిర్వహించిన ప్రజావేదికకు వినతులు వెల్లువెత్తాయి. సోమవారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావేదికలో పలువురు విచ్చేసి తమ సమస్యలను ఎమ్మెల్యే దామచర్ల ఎదుట విన్నవించారు. అర్జీదారుల సమస్యలను సానుకూలంగా ఆలకించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులకు ఫోన్ చేసి ఆయా సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే ప్రజలు కూడా నగరంలో ఏర్పాటు చేసిన ప్రజా వేదిక ఫిర్యాదుల బాక్సుల ద్వారా తమ సమస్యలను తెలియజేవచ్చని తెలిపారు. ఆ సమస్యలను తమ కార్యాయల సిబ్బంది ఫోన్ చేసి, అర్జీదారులతో మాట్లాడటంతోపాటు, అధికారుల దృష్టికి తీసుకెళతారని చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే దామచర్ల మీడియాతో మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారం కోసం తాను ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని చెప్పారు. ఆయా సమస్యలను బట్టి, పరిష్కారానికి కొంత సమయం పడుతుందని, ప్రజలు ఎవరూ నిరుత్సాహపడవద్దని, తప్పనిసరిగా అర్జీదారుల న్యాయం జరిగేలా తాను ముందు ఉంటానని తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ఒంగోలు నియోజకవర్గ పరిధిలోని పలువురికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే దామచర్ల పంపిణీ చేశారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో 20 మంది లబ్ధిదారులకు రూ.12.33లక్షల విలువైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి సహాయనిధి లక్ష్యం అన్నారు. అనారోగ్య సమయంలో చికిత్స పొందిన వారికి భరోసా కల్పిస్తుందని తెలిపారు.

ప్లాస్టిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి

● జనవిజ్ఞాన వేదిక ప్రతినిధుల వినతి



కమిషనర్ వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నగరంలో ప్లాస్టిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుని ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చి దిద్దాలని జన విజ్ఞాన వేదిక నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం నగర కమిషనర్ కె.వెంకటేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకంపై అవగాహన కార్యక్రమాలు వివిధ విద్యా సంస్థలలో నిర్వహించాలన్నారు. ప్రత్యామ్నాయంగా నేత సంచులు వినియోగంపై అవగాహన కల్పించాలని చెప్పారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ అమ్మకంపై దాడులు నిర్వహించి చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక గౌరవ అధ్యక్షుడు డాక్టర్ కొల్లా నాగేశ్వరరావు, రాష్ట్ర బాధ్యులు కొల్లా మధు, కంచర్ల వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు చిన్నాజీ, చిట్టెం వెంకటేశ్వర్లు, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

బీపీఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి - కమిషనర్

అక్రమ కట్టడాల క్రమబద్ధీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలులోకి తీసుకొచ్చిందని, బిల్డింగ్ పీనలైజేషన్ స్కీమ్ (బీపీఎస్)ను సద్వినియోగం చేసుకోవాలని నగర కమిషనర్ వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ అక్రమ కట్టడాల క్రమబద్ధీకరించుకోవడం ద్వారా బ్యాంకుల నుంచి రుణ సదుపాయం, పన్ను సౌకర్యాన్ని పొందవచ్చని తెలిపారు. అలాగే క్రమబద్ధీకరణకు ప్రభుత్వం చివరి అవకాశం కల్పించిందని చెప్పారు. 120 రోజులలోపు ప్లాను లేకుండా, అనధికారకంగా నిర్మించిన భవనాల క్రమబద్ధీకరించుకోవాలని, 2026 మార్చిలోపు అలా చేయని పక్షంలో ఆయా నిర్మాణాలను కచ్చితంగా తొలస్తామని స్పష్టం చేశారు.

'రైతన్నా మీకోసం' వారోత్సవాలను విజయవంతం చేయాలి

● తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్



నాగులుప్పలపాడులో జరిగిన సమావేశంలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది

నాగులుప్పలపాడు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతన్నా మీకోసం వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని తహసీల్దార్ కెప్రవీణ్‌కుమార్ కోరారు. సోమవారం నాగులుప్పలపాడు మండలపరిషత్ కార్యాలయంలో ఏవో వెంకట్రావు అధ్యక్షతన అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రైతు సేవా కేంద్రం ఇన్‌చార్జ్‌గా ఉన్న వ్యక్తి టీమ్ లీడర్‌గా, ఏడు మందితో ఒక బృందంగా ప్రతి రోజు మూడు గృహాలను సందర్శించాలని తెలిపారు. ప్రతి రైతుకు వ్యవసాయం, విత్తనాలు, ఎరువులు, పంటల ఎంపిక, దిగుబడి, క్రిమి సంహారక మందులు వాడకం, పరికరాలు, మార్కెటింగ్, పథకాలను సవివరంగా తెలపాలని చెప్పారు. ముఖ్యమంత్రి సందేశ పత్రాన్ని అందజేయాలని సూచించారు. ఈ నెల 29 వరకు వారోత్సవాలను నిర్వహించాలన్నారు. ఎంపీడీవో తేళ్ల రవికుమార్ మాట్లాడుతూ రైతన్నా మీకోసం బృంద సభ్యులు కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి అవగాహన కల్పించాలని చెప్పారు. రైతుల సమస్యలు నమోదు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పొన్నలూరు మండలంలో..

పొన్నలూరు: మండలంలోని అన్ని గ్రామాల రైతు సేవా కేంద్రంలో రైతన్న మీకోసం కార్యక్రమాన్ని సోమవారం వ్యవసాయ అధికారి వి.రాము ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సింగరాయకొండ వ్యవసాయ సహాయకులు డాక్టర్ నిర్మలకుమారి మాట్లాడుతూ అన్నదాతలకు రానున్నకాలంలో వ్యవసాయ శాఖ, అనుబంధ శాఖల ద్వారా రైతులకు మేలు చేయాలని సూచించారు. నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్. ఫుడ్ ప్రాసెసింగ్ ద్వారా మేలైన యాజమాన్య పద్ధతిలో అధిక ఉత్పాదకత సాధించాలని ఆమె కోరారు. వ్యవసాయ అధికారి రాము మాట్లాడుతూ 24వ తేదీ నుంచి డిసెంబర్ 3వ తేదీ వరకు అన్ని రైతు సేవా కేంద్రాల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తారని తెలిపారు.

కొత్తపట్నం మండలంలో ..

కొత్తపట్నం: రాష్ట్ర ప్రభుత్వం సోమవారం నుంచి తలపెట్టిన రైతన్న మీకోసం కార్యక్రమాన్ని మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రారంభమైంది. కొత్తపట్నం తదితర గ్రామాల్లో ఏవో కిషోర్‌బాబు రైతులతో మాట్లాడారు. సాగులో రైతులకు సరైన సూచనలు చేస దిగుబడులు పెంచటం ద్వారా వ్యవసాయాన్ని లాభసాటిగా చేయటమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ వారోత్సవాలను నిర్వహిస్తుందన్నారు.

వంతెన నిర్మాణం కోసం వినతి



ఈఈకి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

నాగులుప్పలపాడు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పుగుండూరు నుంచి మట్టిగుంట గ్రామానికి వెళ్లే రోడ్డులో హిందూ స్మశానవాటిక వద్ద మురుగుకాలువపై హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలంటూ టీడీపీ గ్రామ అధ్యక్షుడు కనగాల శ్రీనివాసరావు కోరారు. ఈమేరకు సోమవారం ఒంగోలులోని రోడ్లు భవనాలశాఖ ఈఈ గోపీనాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో ఆ మార్గంలోని లోలెవల్ బ్రిడ్జిపైకి వరదనీరు చేరి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని, అందువల్ల హైలెవల్ వంతెన నిర్మాణానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామంలోని మాలకుంట వద్ద ఉన్న ఎస్టీ కాలనీ, జగనన్న కాలనీలకు వెళ్లే రోడ్డులో నూతన బ్రిడ్జిలు నిర్మించాలని జడ్పీ సీఈవో బి.చిరంజీవికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో బాపట్ల పార్లమెంట్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు తిరుమలశెట్టి శ్రీను, సొసైటీ డైరెక్టర్ మసిముక్కు భాస్కరరావు, బెల్లం శ్రీనివాసరావు, కత్తి నాగార్జున, అయ్యప్ప పాల్గొన్నారు.



విద్యార్థులకు సామగ్రిని అందజేస్తున్న గంగాధరరావు

విద్యాసామగ్రి పంపిణీ

చీమకుర్తి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి) : చీమకుర్తి పట్టణంలోని గాంధీనగర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారం విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. మాజీ వైస్ చైర్మన్ కందిమళ్ల గంగాధరరావు తన తండ్రి వెంకటేశ్వర్లు జ్ఞాపకార్థం విద్యార్థులకు నోటుపుస్తకాలు, పెన్సిళ్లను ఆయన అందజేశారు. కార్యక్రమంలో కమిషనర్ రామకృష్ణయ్య, కౌన్సిలర్ సోమా శేషాద్రి, మాజీ చైర్మన్ కొత్రపు రాఘవరావు, గొల్లపూడి కోటేశ్వరరావు, మద్ది వెంకట్రావు, హెచ్‌ఎం చాట్ల శ్రీనివాసరావు, వీరారెడ్డి, గోరంట్ల చెన్నయ్య, కందిమళ్ల నాగేశ్వరరావు, మర్రి లక్ష్మీనారాయణ, ఎస్.ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఓపెన్ లైబ్రరీలు



ఓపెన్ లైబ్రరీలను ప్రారంభిస్తున్న డాక్టర్ జవహర్

చీమకుర్తి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): చీమకుర్తి పట్టణంలో పలు చోట్ల లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం ఓపెన్ లైబ్రరీలను ఏర్పాటు చేశారు. క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ బి.జవహర్ చేతులమీదుగా వీటిని ప్రారంభించారు. పట్టణంలోని కొత్త, పాతబస్టాండ్, బాలికల వసతిగృహంల సమీపంలో ఓపెన్ లైబ్రరీలను ఏర్పాటు చేశారు. బస్సుల కోసం వేచిఉన్న వాళ్ల లైబ్రరీలో ఉన్న పుస్తకాలను చదువుకునేలా అందుబాటులో ఉంచామని, పుస్తకపఠనం పట్ల ఆసక్తిని పెంపొందించటానికి వీటిని ఏర్పాటు చేశామని జవహర్ తెలిపారు. కార్యక్రమంలో చలువాది బదరినారాయణ, విజయ్‌కుమార్‌రెడ్డి, ఆర్.లక్ష్మీనారాయణ, చలువాది పార్థసారథి, ఏడుకొండలు, హేమసుందర్, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అరుణకు పురస్కారం ప్రదానం



పురస్కారం అందుకున్న అరుణ

ఒంగోలు కల్చరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణను గుత్తికొండ రామరత్నం జీవనసాఫల్య పురస్కారంతో ఘనంగా సత్కరించారు. ఆదివారం రాత్రి మచిలీపట్నం గుత్తికొండ రామరత్నం ఆడిటోరియంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో శాసనమండలి సభ్యులు డాక్టర్ మండలి బుద్ధప్రసాద్, డాక్టర్ జీవీ.పూర్ణచంద్‌లు ఆమెకు పురస్కారాన్ని, జ్ఞాపికను, ప్రశంసాపత్రాన్ని అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలు సాహిత్యరంగంలో పురోగమించటానికి అరుణ చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. పురస్కార ప్రదాత, కృష్ణాజిల్లా రచయిత్రుల సంఘ అధ్యక్షులు గుత్తికొండ సుబ్బారావు మాట్లాడుతూ తన సతీమణి పేరిట పురస్కారాన్ని సాహిత్యరంగంలో ప్రముఖులకు అందజేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా అరుణను నాగభైరవ సాహిత్యపీఠం అధ్యక్షుడు నాగభైరవ ఆదినారాయణ, నరసం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సింహాద్రి జ్యోతిర్మయి, కళామిత్ర మండలి అధ్యక్షులు డాక్టర్ నూనె అంకమ్మరావు, మారేపల్లి సూర్యకుమారి, బీరం అరుణ, వి.ఝాన్సీదుర్గ, డాక్టర్ మున్నంగి రాజకుమారి, నాళం నరసమ్మ తదితరులు అభినందనలు తెలిపారు.

రేపు మాగుంట సుబ్బరామిరెడ్డి జయంతి

● హాజరుకానున్న ఎంపీ శ్రీనివాసులురెడ్డి

ఒంగోలు కల్చరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): స్వర్గీయ మాగుంట సుబ్బరామిరెడ్డి 78వ జయంతి కార్యక్రమం బుధవారం నిర్వహిస్తున్నట్లు ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి కార్యాలయం సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ సందర్భంగా ఒంగోలులోని పలు ప్రదేశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమాలలో ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి పాల్గొంటారు. ఉదయం 10 గంటలకు రాంనగర్ 2వ లైనులో కార్యాలయంలో సుబ్బరామిరెడ్డి చిత్రపటానికి ఎంపీ మాగుంట పూలమాల వేస్తారు. అనంతరం అభిలాష్ హోటల్ సెంటర్, రైల్వేస్టేషన్ రోడ్, అద్దంకి బస్టాండ్ సెంటర్లలో ఉన్న మాగుంట సుబ్బరామిరెడ్డి విగ్రహాలకు ఎంపీ పూలమాల వేసి నివాళులర్పిస్తారు. మాగుంట అభిమానులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

మాతృమరణాలను పూర్తిగా నివారించాలి

● డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వర్లు

ఒంగోలు(రూరల్), నవంబరు24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మాతృమరణాలు నివారణే లక్ష్యంగా వైద్యులు, సిబ్బంది పనిచేయాలని డీఎంహెచ్‌వో టి.వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. సోమవారం ఒంగోలులోని జిల్లావైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైరిస్క్ గర్భిణుల ఆరోగ్య స్థితిని ఎప్పటికప్పుడు పరిశీలన చేస్తూ ఉండాలన్నారు. అత్యవసర సమయంలో 108 వాహనాలను, ప్రైవేటు అంబులెన్స్‌లను ఉపయోగించుకోవాలని చెప్పారు. జిల్లాలో మాతృమరణాలు లేకుండా చేయాలని, అవసరమైతే ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో సృజన, డీఐవో కమలశ్రీ, డాక్టర్ చలపతి, డాక్టర్ కమల, డాక్టర్ పి.హేమంత్ తదతరులు పాల్గొన్నారు.

హింసలేని సమాజం కోసం ఉద్యమించాలి

ఒంగోలు(రూరల్), నవంబరు24(ఆంధ్రజ్యోతి): హింసలేని సమాజం కోసం మహిళలు ఉద్యమించాలని బేతూన్ నర్సింగ్ హోమ్ వైద్యశాల డాక్టర్ ఎన్.ఉదయిని పిలుపునిచ్చారు. సోమవారం ఒంగోలులోని బేతూన్‌నర్సింగ్ హోమ్‌లో ఆమె హింసావ్యతిరేక ఉద్యమ కరపత్రాన్ని ఐద్వా నాయకులతో కలిసి ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉదయిని మాట్లాడుతూ మహిళలు, చిన్నారులుపై పెరుగుతున్న హింసను ప్రభుత్వాలు అరికట్టాలన్నారు. మానవ హక్కులను శాంతయుత ఉద్యమాలతో కాపాడుకోవాలని చెప్పారు. కార్యక్రమాలలో నాయకులు కంకణాల రమాదేవి, జి.ఆదిలక్ష్మి, బి.రాజ్యలక్ష్మి, కె.రాజేశ్వరి, పి.నాగేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

స్త్రీనిధి ద్వారా డ్వాక్రా మహిళలకు రుణాలు



మాట్లాడుతున్న ఏపీఎం విజయకుమారి

ఒంగోలు(రూరల్), నవంబరు24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని స్వయం సహాయక సంఘాల గ్రూపు మహిళలకు 2025-2026 సంవత్సరానికి స్త్రీనిధి ద్వారా రూ.10కోట్ల రుణాలు మంజూరుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఏపీఎం కె.విజయకుమారి తెలిపారు. సోమవారం ఒంగోలు మండల వెలుగు కార్యాలయంలో వీవోఏలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ రుణాలు చెల్లించినప్పడు తప్పక రసీదు పొందాలన్నారు. అదేవిధంగా దేవరంపాడు దళితవాడకు సంబంధించిన వెలుగు నిధులు అవకతవకలపై కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామంలో విచారణ చేపడతామన్నారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు ప్రియాంక పాల్గొన్నారు.

పీఎంఈజీపీ స్కీం ద్వారా కారు మంజూరు

మద్దిపాడు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): అన్నంగి గ్రామానికి చెందిన పార శ్రీనివాసరావు పీఎంఈజీపీ స్కీం కింద మద్దిపాడు కెనరా బ్యాంక్ శాఖ ఆధ్వర్యంలో కారు సబ్సిడీతో రుణం మంజూరు చేశారు. ఈమేరకు సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ రాజాబాబు చేతుల మీదుగా కారు తాళాన్ని శ్రీనివాసరావుకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిరుద్యోగ యువకులు, వ్యాపారులు పీఎంఈజీపీ కింద రుణాలను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఔత్సాహికులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నారాయణ, మద్దిపాడు ఏపీఎం కాకుమాను సుబ్బారావు, డీపీఎం దానం రజనీకాంత్, లక్ష్మీరెడ్డి, అంబేడ్కర్, వెంకటసుబ్బయ్య, ప్రేమానందం, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో జ్యోతి

మద్దిపాడు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం పనులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో జ్యోతి అన్నారు. సోమవారం మల్లవరం గ్రామంలో ఉపాధి హామీ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ వనరులు, సోషల్ మ్యాప్, సీజనల్ మ్యాప్‌ల ద్వారా పనులను గుర్తించి వివరించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రతి గ్రామంలో లేబర్ బడ్జెట్ లక్ష్యం పూర్తికావాలన్నారు. కాలువలు, కుంటలు పూడిక పనులు, నీటిసంరక్షణ, కొత్తకుంటలు, ఇంకుడు గుంతలు, రూఫ్ వాటర్, హార్వెస్టింగ్ పనులు జరగాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సుబ్బారెడ్డి, ఎంపీటీసీ బోయపాటి వీరాంజనేయులు, ఉపాధి ఇంజనీర్ కిషోర్, ఎఫ్‌ఏ నాగరాజు పాల్గొన్నారు.

చర్చి ప్రారంభం



చర్చిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బీఎన్

మద్దిపాడు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): దొడ్డవరప్పాడులోని దళితవాడలో నూతనంగా నిర్మించిన చర్చిని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏసుప్రభు కీర్తనలు అజరామరమని అన్నారు. కార్యక్రమంలో నాయకులు గోరంట్ల చిరంజీవి, దుగ్గినేని నరసింహారావు, ముప్పా రవి, పాస్టర్లు పాల్గొన్నారు.

రేపు ఎస్సీ యువతకు అవగాహన సదస్సు

ఒంగోలు నగరం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): వ్యాపారవేత్తలుగా ఎదగాలనుకునే జిల్లాలోని ఎస్సీ యువతకు అవగాహన సదస్సును నిర్వహిస్తున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్‌నాయక్ సోమవారం తెలిపారు. ఈ నెల 26వ తేదీన సాయంత్రం మూడు గంటలకు స్థానిక ప్రకాశంభవనంలోని పీజీఆర్‌ఎస్ సమావేశం హాలులో ఈ అవగాహన సదస్సు జరుగుతుందన్నారు. వ్యాపారరంగం, మౌలికఅంశాలు, బ్యాంకు రుణం, డీపీఆర్ తయారీ విధానం, ప్రభుత్వాల పథకాలపై అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు.

బాలీవుడ్ నటుడు ధర్మేంద్ర మృతికి సంతాపం

ఒంగోలు కల్చరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రఖ్యాత బాలీవుడ్ నటుడు ధర్మేంద్ర మృతికి జిల్లాకు చెందిన పలువురు కళాకారులు తీవ్ర సంతాపాన్ని తెలియజేశారు. ఆ రోజుల్లో ధర్మేంద్ర నటించిన షోలే చిత్రం ఒంగోలు శ్రీనివాస థియేటర్‌లో వంద రోజులు ప్రదర్శితమైన ఏకైక హిందీ చిత్రంగా నిలిచిందన్నారు. ధర్మేంద్ర మరణం హిందీ సినీరంగానికి తీరనిలోటని పేర్కొన్నారు. సంతాపం ప్రకటించిన వారిలో గాయకులు సాయిమాస్టర్, అన్నమయ్య మురళి, లక్ష్మీతులసి, మనోహర్, సుహాసిని, పి.శ్రావ్య, సంగీత సమాఖ్య ప్రతినిధులు ఎస్.సుకుమార్, ఎస్కే.బాబు, ఎస్‌డీ.ఇస్మాయిల్ ఉన్నారు.

విజ్ఞాన పురోగతితోనే సుస్థిర అభివృద్ధి



కోటేశ్వరరావును సత్కరిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

మద్దిపాడు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): విజ్ఞానశాస్త్రం పురోగతితోనే సుస్థిర అభివృద్ధికి బాటలు వేయగలమని విశ్రాంత ఎంఈవో పీవీ.రాఘవరావు తెలిపారు. సోమవారం మద్దిపాడులోని నటరాజ కళాకేంద్రంలో విశ్రాంత ఉద్యోగి అన్నమనేని కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కనపర్తి సుబ్బారావు, గంగిశెట్టి నరసింహారావు, కటకం వెంకటేశ్వర్లు, షేక్ కలాం, గంటా కోటేశ్వరరావు, నేలటూరి సత్యనారాయణ, ఆరి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా ప్రజా ప్రభుత్వం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి



రైతులకు కరపత్రాలను అందజేస్తున్న ఎరిక్షన్‌బాబు



సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఏడీఏ బాలాజీనాయక్

'రైతన్నా మీకోసం'లో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

కంభం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : సాగు భూమి కలిగి ఉన్న భూ యజమాని రైతు కుటుంబాలకు అన్నదాత సుఖీభవ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం రూ.14వేలు, పీఎం కిసాన్ పథకం కింద ప్రభుత్వం రూ.6వేలు మొత్తం సంవత్సరానికి రూ.20వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తామన్నారు. సోమవారం కంభం మండలం జంగంగుంట్ల గ్రామంలో రైతన్నా మీకోసం కార్యక్రమంలో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి రైతులను కలుసుకున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు మంజూరు చేసిన అన్నదాత సుఖీభవ పథకం, వ్యవసాయంలో పంచ సూత్రాలు, వాటి ఆవశ్యకతను వివరించారు. నీటి భద్రతతో సమర్థవంతమైన నీటి నిర్వహణ బిందు సేద్యానికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. మార్కెట్‌లో దేనికి డిమాండ్ ఉందో, ఏ పంట వేస్తే ఎక్కువ ధర వస్తుందో ఆ పంటల సాగుకు ప్రోత్సాహం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, భూసార పరీక్షల ద్వారా సాగులో విప్లవం, పండించిన పంటకు అదనపు విలువలు జోడించి లాభాలను పెంచడం, అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ వంటి పంచ సూత్రాలను రైతులకు వివరించారు. రైతులకు సబ్సిడీ ద్వారా వ్యవసాయ పరికరాలను అందించడం 2025-26లో రూ.164.158 కోట్ల రాయితీ నిధులతో రైతులకు పరికరాలను పంపిణీ చేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 2024 ఖరీఫ్‌లో 36లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 6లక్షల మంది రైతుల నుంచి రూ.8,282కోట్లతో కొనుగోలు చేశామని 24గంటల్లోనే రైతులకు చెల్లింపులు చేశామన్నారు. రబీ 24-25లో 20లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రెండు లక్షల మంది రైతుల నుంచి కొనుగోలు చేసి రూ.4,575కోట్లు చెల్లించామన్నారు. కార్యక్రమంలో ఏవో నాయక్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

గిద్దలూరు : మండలంలో రైతన్నా మీ కోసం కార్యక్రమాన్ని రైతు సేవా కేంద్రాల పరిధిలో నిర్వహించారు. రైతుల ఇళ్ల వద్దకు వెళ్లి 3, 4 కుటుంబాలను క్లస్టర్లుగా చేసి ప్రభుత్వ సబ్సిడీ పథకాలు, మేలైన యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. రసాయనిక ఎరువులు తగ్గించాలని పేర్కొంటూ సేంద్రియ వ్యవసాయంపై వ్యవసాయాధికారి విజయభాస్కర్‌రెడ్డి అవగాహన కల్పించారు. కౌలు కార్డుల ఉపయోగాలు, పచ్చిరొట్ట పైర్ల ప్రాముఖ్యత, పంటల బీమాపై వివరణ ఇచ్చారు. ప్రధానమంత్రి సూర్యఘర్ పథకంపై కూడా అవగాహన కల్పించారు. కొత్తకోట, కొమ్మునూరు, సంజీవరాయునిపేట, గడికోట, ఉయ్యాలవాడలో జరిగిన కార్యక్రమాలలో వ్యవసాయాధికారి పాల్గొన్నారు. వ్యవసాయ విస్తరణాధికారులు శ్రీనివాసరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, ఉద్యాన, పట్టుపరిశ్రమ, రెవిన్యూ, వెటర్నరీ శాఖల సిబ్బంది పాల్గొని పలు అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు.

మార్కాపురం రూరల్ : రైతన్నకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని తహసీల్దార్ చిరంజీవి తెలిపారు. మండలంలోని దరిమడుగు గ్రామంలో సోమవారం రైతన్నా మీకోసం కార్యక్రమంలో తహసీల్దార్ రంజీవి, ఎంపీడీవో బాలచెన్నయ్య, ఏవో బుజ్జిబాయి పాల్గొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు కార్యదర్శి కోటేశ్వరరావు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

తర్లుపాడు : రైతన్నా మీకోసం కార్యక్రమంలో భాగంగా అన్ని రైతు సేవా కేంద్రల్లో రైతన్నా మీకోసం క్లస్టర్ క్యాంపెయిన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ బాలాజీనాయక్ మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో పెనుమార్పులు తీసుకొచ్చేందుకు తద్వారా పంట సాగును లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపట్టిందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారిని జోష్ణదేవి, ఏఈవో దేవేంద్ర గౌడ్, వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

కంభం : రైతుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని మార్కాపురం ఏడీఏ బాలాజీ నాయక్ తెలిపారు. కంభం మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని కంభం, పెద్దనల్లగాల్వ, ఎర్రబాలెం గ్రామాలలో ఏర్పాటు చేసిన రైతన్నా మీకోసం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి మహమ్మద్, రైతులు పాల్గొన్నారు.

రైతును రాజును చేయడమే లక్ష్యం : ఎరిక్షన్‌బాబు

పెద్ద దోర్నాల : రైతును రాజుగా చూడడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు పేర్కొన్నారు. మండలంలోని చిన్నదోర్నాలలో సోమవారం రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ రైతులు ఎదుర్కొంటున్న సంక్షోభాలను అధిగమించి ఆర్థిక బలోపేతం చేసేందుకు ప్రభుత్వం పంచ సూత్రాలను అవలంబిస్తోందన్నారు.ప్రధానంగా ఉన్న నీటిని సద్వి నియోగం చేసుకునేందుకు బిందు తుంపర సేద్యం చేపట్టడం అందుకు అవసరమైన డ్రిప్‌ను ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా, మిగిలిన వర్గాలకు 90శాతం రాయితీతో అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దారు అశోక్ కుమార్‌రెడ్డి, ఎంపీడీవో ప్రసూనదేవి, ఏడీఏ వెంకటరమణ, వ్యవసాయాధికారి జవహర్‌లాల్‌నాయక్, వీఆర్వో నాగేశ్వరరావు, టీడీపీ నాయకులు ఐనేని నాగ మల్లికార్జున, దొడ్డా బాబు, పాలంకయ్య పాల్గొన్నారు.

రాచర్ల : రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని అధికారులు విజయవంతం చేయాలని ఎంపీడీవో ఎస్.వెంకటరామిరెడ్డి అన్నారు. కార్యాలయంలో ఏవో షేక్ మహబూబ్‌బాషా అధ్యక్షతన సంబంధిత అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, వాటి విధివిధానాలను ఎంపీడీవో వివరించారు. కార్యక్రమంలో సంబంధిత విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

త్రిపురాంతకం : రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి మంచి దిగుబడులు రాబట్టవచ్చని వ్యవసాయాధికారి సంగమేశ్వరరెడ్డి వివరించారు. ప్రభుత్వం నూతనంగా చేపట్టిన రైతన్నా మీకోసం కారక్రమంలో భాగంగా మండలంలోని చెర్లోపల్లిలో రైతులతో మాట్లాడారు. సేంద్రియ వ్యవసాయం రైతులకు ఎంతో మేలని వివరించారు. పలు చోట్ల సచివాలయ సిబ్బంది కూడా రైతులతో కలిసి దాని ఉద్దేశాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణమోహన్, ఎంపీడీవో రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం రూరల్ : మండలంలోని అమానిగుడిపాడులో ఏవో నీరజ ఆధ్వర్యంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా టీడీపీ మండల అధ్యక్షుడుచిట్యాళ వెంగళరెడ్డి నేరుగా రైతుల ఇళ్లకు వెళ్లి వ్యవసాయ పథకాలను వివరించారు. బ్రోచర్లను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ దివ్య కోటేశ్వరరావు, సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

పెద్దారవీడు : రైతుల సర్వతోముఖాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీడీవో జాన్‌సుందరం అన్నారు. పెద్దారవీడులోని శ్రీ కోదండ రామస్వామి దేవాలయం రచ్చబండ వద్ద ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని అధికారులు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతుల అభ్యున్నతికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను, నిర్దేశించుకున్న లక్ష్యాలను చదివి వినిపించారు. ఎంపీడీవో జాన్ సుందరం మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల అభ్యున్నతికి వ్యవసాయరంగంలో సాంకేతికను ప్రోత్సహిస్తుందని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ దిలీప్ కుమార్, ఏవో ఎన్.లక్ష్మీనారాయణ, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి గొట్టం శ్రీనివాసులరెడ్డి, నాయకులు రామనారాయణరెడ్డి, రామకృష్ణారెడ్డి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రమేష్‌రెడ్డి

ఉయ్యాలవాడకు భారతరత్న ఇవ్వాలి

గిద్దలూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రథమ స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి భారతరత్న అవార్డు ఇవ్వాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పిడతల రమేష్‌రెడ్డి కోరారు. మండలంలోని ఎన్‌బయనపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జయంతి ఉత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా రమేష్‌రెడ్డి మాట్లాడుతూ తెల్లవారిపై తిరగబడి ప్రాణాలు కోల్పోయిన నరసింహారెడ్డికి భారతరత్న అవార్డు ఇవ్వాలని ప్రభుత్వాలను కోరారు. ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా గురూజీ నారాయణరెడ్డి, పాఠశాల హెచ్‌ఎం శివప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొని ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి నివాళులర్పించారు.

ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ కోటేశ్వరరావు మృతి



పొదిలి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పొదిలి మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ ఆవులూరి కోటేశ్వరరావు గుండె పోటుతో సోమవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పొదిలి మండలం కంభాలపాడు గ్రామానికి చెందిన కోటేశ్వరరావు టీడీపీలో సీనియర్ నాయకుడిగా, కంభాలపాడు గ్రామానికి సర్పంచ్‌గా గతంలో పనిచేశారు. అంతేకాకుండా ఉత్తమ రైతుగా అవార్డు పొందారు. కోటేశ్వరరావు మృతదేహాన్ని పొదిలి, కొనకనమిట్ల మండలాలకు చెందిన పలువురు టీడీపీ నాయకులు సందర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కోటేశ్వరరావుతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేశారు.

విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు మార్క్ మృతి



మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం పట్టణానికి చెందిన యూటీఎఫ్ సీనియర్ నాయకుడు, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు దేవరకొండ మార్క్ సోమవారం ఆయన నివాసంలో మృతిచెందారు. ఈయన తర్లుపాడు ఎంఈవో దేవరకొండ సుజాత తండ్రి. మార్క్ పార్థివ దేహాన్ని యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు ఓవీ వీరారెడ్డి, తాటిపర్తి సత్యనారాయణరెడ్డి, రవికుమార్, ఫణీంద్ర, విఠల్, విజయభారతి, విజయలక్ష్మి సందర్శించి, నివాళులు అర్పించారు.

రాజేష్ కుటుంబానికి అండగా ఉంటాం



రాజేష్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న కృష్ణకిషోర్‌రెడ్డి

రాచర్ల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : రాజేష్ కుటుంబానికి అండగా ఉంటామని టీడీపీ నాయకుడు ముత్తుముల కృష్ణకిషోర్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఆకవీడు గ్రామానికి చెందిన కొదమల రాజేష్ ఆదివారం విద్యుత్ షాక్‌తో మృతిచెందగా రాచర్ల ఎస్సై కోటేశ్వరరావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న ఆయన సోమవారం గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు వెళ్ళి రాజేష్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. రాజేష్ కుటుంబానికి అండగా ఉంటామని ప్రభుత్వ పరంగా పూర్తి స్థాయిలో సహకారం అందిస్తామని కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. కార్యక్రమంలో వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ షేక్ ఆదాం, టీడీపీ నాయకులు వై లక్ష్మీరెడ్డి, పట్టణ అధ్యక్షులు షహన్ షావలి, రమేష్, కిషోర్, చంటి, రమణ తదితరులు పాల్గొన్నారు. రాజేష్ మృతదేహానికి నివాళులర్పించిన విద్యాశాఖ అధికారులు మండల విద్యాశాఖ అధికారులు షేక్ మొయినుద్దీన్, వీ గిరిధరశర్మ రాజేష్ మృతదేహానికి ఘన నివాళులర్పించారు. రాజేష్ పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్‌గా కొనసాగుతున్నారని, చిన్న వయసులో మృతిచెందడం బాధాకరమన్నారు.

ముగ్గురు మందుబాబులకు జైలు

గిద్దలూరు, బేస్తవారపేట మండలాలలో మద్యం తాగి ద్విచక్ర వాహనాలు నడిపిన ముగ్గురికి అడిషనల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి భరత్‌చంద్ర జైలు శిక్ష, జరిమానా విధించారు గిద్దలూరు మండలంలో మద్యం తాగి ద్విచక్ర వాహనాలు నడిపిన ఇద్దరికి ఒక్కొక్కరికి రూ.10వేల జరిమానా విధించగా, ఒకరికి 25 రోజుల జైలు శిక్ష, మరొకరికి 28 రోజుల జైలు శిక్షను విధించారు. అలాగే బేస్తవారపేట మండలంలో మద్యం తాగి ద్విచక్ర వాహనం నడిపిన వ్యక్తికి 32 రోజులపాటు జైలు శిక్ష, రూ.10వేల జరిమానా విధించారు.

జూదరులకు జైలు

గిద్దలూరు టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇటీవల పేకాట ఆడుతూ పోలీసులకు చిక్కిన ఆరుగురు జూదరులకు జైలు శిక్ష పడింది. జూదరులను అర్బన్ సీఐ కె.సురేష్ సోమవారం కోర్టులో హాజరుపరచగా అడిషనల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి భరత్ చంద్ర రెండు రోజులు జైలు శిక్ష విధించారు. పేకాట ఆడుతున్న సమయంలో వారి వద్ద దొరికిన రూ.1.35లక్షల నగదును, సమాచారం ఇచ్చిన వ్యక్తికి అందులో సగభాగం రూ.67,500 బహుమతిగా ఇవ్వాలని కోర్టు ఆదేశించింది.



బాధితులతో మాట్లాడుతున్న డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసులు

నీటి సమస్యను త్వరలో పరిష్కరిస్తాం

పెద్దారవీడు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పెద్దారవీడులోని మట్టమరుగు వద్ద నీటి సమస్యను త్వరలో పరిష్కరిస్తామని డిప్యూటీ ఎంపీడీవో వి.శ్రీనివాసులు అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం డిప్యూటీ తహసీల్దార్ రామకృష్ణ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం కార్యక్రమం నిర్వహించారు. పెద్దారవీడులోని మట్టమరుగు ప్రాంతానికి చెందిన ప్రజలు నీటిసమస్యపై అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ట్యాంకర్‌కు నీటిని పంపింగ్ చేసే బోరు మూడు రోజుల కిందట కాలిపోయిందని, దీంతో నీటి సమస్య తలెత్తిందని వారు తెలిపారు. స్పందించిన డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసులు పంచాయతీ కార్యదర్శి గోవిందరెడ్డిని ఫోన్‌చేసి పిలిపించారు. సమస్య పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశారు. దీంతో రెండు రోజుల్లో నీటి సరఫరాను పునరుద్ధరిస్తామని పంచాయతీ కార్యదర్శి హామీ ఇచ్చాడు.

ఆక్రమించుకున్న స్థలాన్ని ఇప్పించండి

తహసీల్దార్‌కు బాధితుల విజ్ఞప్తి

కంభం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కంభం అర్బన్ కాలనీలో షేక్ సికిందర్ అనే వ్యక్తి అదే కాలనీలో ఉంటున్న షేక్ ఖాదర్ బీకి చెందిన స్థలాన్ని అక్రమంగా ఆక్రమించుకొని దౌర్జన్యం చేస్తున్నాడని దయచేసి నా స్థలాన్ని నాకు ఇప్పించాలని కోరుతూ షేక్ ఖాదర్ బీ కుటుంబ సభ్యులు సోమవారం స్పందనలో కంభం తహశిల్దార్ కిరణ్‌కు, ఎస్సై నరసింహారావుకు వినతిపత్రాలు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా బాధితురాలు ఖాదర్‌బీ మాట్లాడుతూ 1985 సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి ఎన్‌టి రామారావు పరిపాలనలో తనకు కంభం అర్బన్ కాలనీలో స్థలం ఇచ్చారన్నారు. అయితే షేక్ సికిందర్ అనే వ్యక్తి దౌర్జన్యంగా నా స్థలాన్ని ఆక్రమించుకొని కొంత భాగం వరకు రేకుల షెడ్డు వేసుకున్నాడని తెలిపారు. తాను కోర్టులో కేసు వేయగా కోర్టు నాకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందన్నారు. తాను వెళ్లి కోర్టు ఉత్తర్వులు చూపించినా ఖాళీ చేయకపోవడమే కాకుండా నాపై దౌర్జన్యం చేస్తున్నాడని కావున ఆక్రమణదారుడి నుంచి నా స్థలాన్ని నాకు ఇప్పించాలని తహశిల్దార్ కిరణ్‌కు, ఎస్సై నరసిహారావుకు వినతిపత్రాలు ఇచ్చినట్లు తెలిపారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ

పొదిలి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : 12వ నేషనల్ కరాటే అండ్ కుంగ్‌ఫు చాంపియన్ షిప్ పోటీలు బోధి ధర్మ కరాటే స్కూల్ ఆఫ్ ఇండియా తరపున ఒంగోలు అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం జరిగిన పోటీలలో పొదిలి పట్టణంలోని రాజు కరాటే సెంటర్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఎల్లో బెల్ట్ విభాగంలో నరేందర్‌రెడ్డి, లిషితారెడ్డి, హర్షితారెడ్డి, దర్మతేజ, రోహిత్, నిత్య, యశ్వంత్, ఆరెంజ్ బెల్టులో ధర్మతేజ, భరత్, అర్షద్, గ్రీన్ బెల్ట్‌లో చేతన్, ఆద్య, మహ్మద్‌జైన్, బ్లూబెల్ట్‌లో వాజితారెడ్డి, బ్రౌన్‌బెల్ట్‌లో శశివర్ధన్, బ్లాక్‌బెల్ట్‌లో షజియా, మొహత, సుహన, రోహన్, మన్విత్‌రాజ్‌దీప్ గోల్డ్‌మెడల్ సాధించారు. ఈసందర్భంగా జరిగిన సభలో వైద్యాధికారి రఫీ మాట్లాడుతూ కరాటేతో ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. హబిబుల్లా ఫౌండేషన్ చైర్మన్ కరిముల్లా బేగ్ కరాటే మానసిక ధైర్యం వస్తుందని తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు పలువురు కరాటే మాస్టర్ చినరాజును, విద్యార్థులను అభినందించారు.



కరాటేలో గెలుపొందిన విద్యార్థులు



ప్రతిష్ఠకు సిద్ధమైన స్వామి విగ్రహం

నేడు అభయాంజనేయుని విగ్రహ ప్రతిష్ఠ

రాచర్ల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జేపీచెరువు గ్రామంలో మంగళవారం జరగబోయే శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి హాజరు కానున్నారని, కార్యక్రమ ఆహ్వానకర్త నంది అవార్డు గ్రహీత పత్తి ఓబులయ్య సోమవారం తెలిపారు. బుధవారం (రేపు) ఉదయం 9.30నిమిషాలకు విగ్రహ ప్రతిష్ఠ జరుగుతుందని, ఈ మహోత్సవానికి ఎమ్మెల్యే అశోక్‌రెడ్డితోపాటు శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, రాష్ట్ర కాపునాడు అధ్యక్షుడు అర్జా రామకృష్ణ హాజరవుతారని ఆయన తెలిపారు. గ్రామ, పరిసర గ్రామాల ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

అర్హులకు నివేశన స్థలాలు ఇవ్వాలి

బేస్తవారపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అర్హులైన పేదలకు నివేశ స్థలాలు కేటాయించాలని గిద్దలూరు ఏరియా రైతు సంఘం కార్యదర్శి డీ పుల్లయ్య, సీపీఐ నాయకులు యు, జోసఫ్ సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. వీఆర్వోల ద్వారా అర్హులను గుర్తించి వారందరికీ నివేశ గృహాలు మంజూరు చేస్తామని తహసీల్దార్ ఎ.జితేంద్రకుమార్ తెలిపారు.

ఎంటీఎస్ ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలి

పెద్దదోర్నాల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : 1998 - 2008 డీఎస్సీ ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలని ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కే ఎర్రయ్య ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని పెద్ద బొమ్మలాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆ శాఖ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగులో ఉన్నా మెడికల్ బిల్లులు పరిష్కరించాలని, ఇన్ సర్వీసులోని వారికి టెట్ మినహాయింపు ఇవ్వాలని, డీఏ బకాయిలు చెల్లించాలని తదితర సమస్యలు పరిష్కరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆశాఖ మండల అధ్యక్షుడు నీరూడి కాశయ్య, ఉపా ధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.



వ్యవసాయాధికారికి ఫిర్యాదు చేస్తున్న రైతులు

వ్యవసాయ సహాయకునిపై చర్యలు తీసుకోండి

త్రిపురాంతకం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ముడివేముల గ్రామ సచివాలయ పరిధిలో ఉన్న గ్రామ వ్యవసాయ సహాయకుడు ముటుకూరి బాదుల్లాపై చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల రైతులు వ్యవసాయాధికారి సంగమేశ్వరరెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు. అధికారులు అందుబాటులో ఉండడం లేదని, కనీసం ఫోన్ చేసినా స్పందన లేదని పేర్కొన్నారు. ప్రభుత్వం రైతులకు ఏదైనా రాయితీ ఇచ్చినా ఇతర సమాచారాలేవీ తెలియక నష్టపోతన్నామని, తమ గ్రామాల్లో ఈ-క్రాప్ కూడా సరిగా చేయని కారణంగా గత తుఫాన్ నష్టపరిహారంలో తమకు నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేస్తూ బాదుల్లాపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్‌ను అందిస్తున్న ఫాతిమా సేవా సంస్థ సభ్యులు

గిద్దలూరు టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఫాతిమా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న 30 మంది విద్యార్థినులకు హిందీ మోడల్ ప్రాక్టికల్ మెటీరియల్‌ను ఎంఇఒ-2 పి.నాగభూషన్‌రెడ్డి చేతుల మీదుగా సంస్థ అధ్యక్షుడు ఎం.ఖాశింవలి అందించారు. మండలంలోని ఉయ్యాలవాడ, సంజీవరాయునిపేట, ముండ్లపాడు, కెఎస్‌పల్లె, పొదలకొండపల్లె, కంభం మండలం తురిమెళ్ల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న మెరిట్ విద్యార్థులకు 100 మందికి మెటీరియల్స్‌ను అందించడం జరిగిందన్నారు. బాగా చదువుకుని మంచి మార్కులు సంపాదించాలని సంస్థ అధ్యక్షులు ఖాశింవలి తెలిపారు. ప్రతి ఒక్కరూ పోటీతత్వంతో మంచి మార్కులతో పాస్ కావాలన్నారు. ఆయా కార్యక్రమాలలో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మట్టి ఖర్చులకు రూ.10వేలు సాయం

రాచర్ల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆకవీడు గ్రామానికి చెందిన గ్రామ రెవెన్యూ సహాయకుడు మీనిగె పాపయ్య (64) అనారోగ్యంతో మృతిచెందడంతో మట్టి ఖర్చుల నిమిత్తం రెవెన్యూ సిబ్బంది రూ.10వేల ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. తహశిల్దార్ ఎల్ వెంకటేశ్వర్లు ఆంజనేయ స్వామి దీక్షలో ఉండడంతో వారి సిబ్బంది ఆయన ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు ఏ శివారెడ్డి, బీ కిషోర్ కుమార్, డి యోనా, విఆర్ఏలు ఎస్ అల్లూరయ్య, జి క్రాంతి దీపక్, ఎస్ సోమ సుందర్ రెడ్డి, సుభాని పాల్గొన్నారు.

జర్నలిస్టు ఖాదర్‌బాబాకు నివాళి

బేస్తవారపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : సీనియర్ జర్నలిస్టు షేక్ ఖాదర్‌బాబా మృతి తీరని లోటని పలువురు అన్నారు. గుండెపోటుకు గురై మృతి చెందిన ఖాదర్‌బాబా మృతదేహానికి టీడీపీ నాయకులు ముత్తుముల కృష్ణ కిషోర్, కంభం మార్కెట్ యార్డ్ చైర్మన్ పూ నూరు భూపాల్‌రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు సోరెడ్డి మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అన్నారాంబాబు, రైతు సంఘ నాయకుడు పుల్లయ్య, సీపీఐ నాయకుడు జోసఫ్, నియోజకవర్గ జర్నలిస్టులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మధ్యాహ్నం ఖాదర్‌బాబా అంత్యక్రియలు పూర్తయ్యాయి.

నేడు విద్యుత్ సరఫరా కట్

మార్కాపురం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాయవరం, వేములకోట, కొట్టాలపల్లి గ్రామాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని రూరల్ ఏఈ యేర్వ నాగేంద్ర రెడ్డి తెలిపారు. ఉదయం 8.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు విద్యుత్ సరఫరా మూడు గ్రామాల్లో నిలిపివేయనున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో మెయింటెనెన్స్ పనుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు

నారాయణస్వామి హుండీ ఆదాయం రూ.లక్షా 55వేలు

సీఎస్‌పురం(పామూరు), నవంబరు 24(ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలంలోని మిట్టపాలెం శ్రీ నారాయణ స్వామి దేవస్థానంలో ఆదివారం భక్తులు సమర్పించిన కానుకల హుండీ ఆదాయం రూ.లక్షా 55 వేల 460 వచ్చినట్లు ఈవో శ్రీగిరిరాజు నరసింహబాబు తెలిపారు. టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ. 66,550, లడ్డూ ప్రసాదం అమ్మకం ద్వారా రూ.22,830, శాశ్వత అన్నదాన పథకానికి రూ.54,967 వచ్చినట్టు చెప్పారు. శాశ్వత అన్నదాన పథకానికి సీఎస్‌పురం గ్రామానికి చెందిన గుర్రం పెదమస్తాన్, మౌనిక దంపతుల కుమార్తె హేమశ్రీ, కుమారుడు దేవాన్ష్ రూ.10,116 అందజేశారు. కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ కొమ్మినేని చినఆదినారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

లేబర్‌కోడ్‌లకు వ్యతిరేకంగా సీఐటీయూ నిరసన

దొనకొండ, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): లేబర్‌కోడ్‌లకు వ్యతిరేకంగా సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం సివిల్ సప్లయిస్ గోడౌన్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆసంఘం మండల కన్వీనర్ చిరుపల్లి అంజయ్య మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కుందుర్తి చిన్ననర్సింహులు, గుడిమెట్ల ఆదాము, పి.వెంకటేశ్వర్లు, రామయ్య, పి.కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు ప్రింటర్ అందజేత

పామూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లక్ష్మీనరసాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు అరియారం రాము తన మిత్రుడు స్వర్గీయ నటుకుల వినోద్‌కుమార్ జ్ఞాపకార్థం రూ.25 వేలు విలువకలిగిన కలర్ ప్రింటర్, టేబుల్‌ను సోమవారం అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పేటా తిరుపతయ్య, ఉపాధ్యాయులు ఖాజాహుస్సేన్, ఖాదర్‌వలి, రిటైర్డ్ హెచ్‌ఎం ఇసాక్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కురిచేడు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆవులమంద కొత్తూరు గ్రామ చెరువు వద్ద సోమవారం జరిగిన ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. త్రిపురాంతకం మండలం ముడివేముల గ్రామానికి చెందిన కె.వెంకటేశ్వర్లు కురిచేడు నుంచి స్వగ్రామానికి బైకుపై వెళుతుండగా అదుపుతప్పి కిందపడటంతో గాయాలయ్యాయి. 108 అంబులెన్స్‌లో కురిచేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకు వచ్చి ప్రాథమిక చికిత్స చేయించారు. మెరుగైన వైద్యం కోసం వినుకొండకు తరలించారు.

సమాజ సేవలో పాల్గొనాలి

పామూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): దైవ మార్గంలో నడిచి ప్రజాసేవలో పాల్గొనాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. సోమవారం రాత్రి పట్టణంలో హుస్సేనీ మజీద్, హుస్సేనియా మదరాసలకు భూమి పూజ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రవక్త బోధనలు నేటి సమాజానికి ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో సయ్యద్ మౌలాన షరీఫ్, హుస్సేనీ, షేక్ షంషూర్, షేక్ గౌస్‌బాషా, ముబినా మౌలాలి, తదితరులు పాల్గొన్నారు.

స్వామిత్వ సర్వేతో సర్వహక్కులు

పామూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్వామిత్వ సర్వేతో ఆస్తులు, భూములపై సర్వహక్కులతో కూడిన కార్డులను అందజేస్తున్నట్టు ఎంపీడీవో ఎల్.బ్రహ్మయ్య అన్నారు. మండలంలోని బొట్లగూడూరు పంచాయతీ పరిధిలోని పాబోలువారిపల్లిలో సోమవారం జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. గ్రామాలలో మెరుగైన సాంకేతికతో కూడిన సర్వే, మ్యాపింగ్ కోసం ఈపథకాన్ని ప్రవేశపెట్టినట్టు చెప్పారు. కార్యక్రమంలో అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, పంచాయతీ కార్యదర్శి కె.కృష్ణమూర్తి, సర్పంచ్ బాల, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

పామూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): వినోద్ జ్యుయలరీ అధినేత్రి నటుకుల లక్ష్మీచైతన్య వినోద్ చారిట్రబుల్‌ట్రస్ట్ ద్వారా 200 మంది పంచాయతీ పారిశుధ్య, స్వచ్ఛ భారత్ కార్మికులకు సోమవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు కేవీ రమణయ్య, టీడీపీ నాయకులు పందిటి హరీష్, నెల్లూరి సుభద్ర, తదితరులు పాల్గొన్నారు.

దడపుట్టిస్తున్న వీధి సింహాలు

- కనిగిరిలో స్వైర విహారం
- పలువురికి గాయాలు

కనిగిరి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కనిగిరి శునకాలు స్వైరవిహారం చేస్తున్నాయి. వీధుల్లో జనం వెంటపడుతున్నాయి. వీటిబారినపడి పలువురు గాయపడ్డారు. పట్టణంలో ఇవి విపరీతం పెరిగిపోయాయి. ఇటీవల మున్సిపల్ అధికారులు కనిగిరి మున్సిపాల్టీ పరిధిలో వెయ్యి కుక్కలను పట్టినట్లు చెబుతున్నారు. కుక్కలను పట్టినందుకు సుమారు రూ.4 లక్షలకు పైగా ఖర్చు చేసినట్లు మున్సిపల్ అధికారులు పేర్కొన్నారు. అయితే, గతంలో పట్టుకెళ్లిన కెళ్లిన కుక్కలు తిరిగి రెండు రోజులకు నగరంలో దర్శనమిస్తున్నాయి. గత రెండు రోజులుగా నగరంలో పిచ్చికుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. వాహనాల వెంటబడుతున్నాయి. వాహనచోదకులపైకి దూకి దాడి చేస్తున్నాయి. పాదచారులపై వెంటపడుతుండటంతో పరుగులుదీసే సందర్భంలో పలువురు కిందపడి గాయపడుతున్నారు. రెండు రోజులుగా పిచ్చికుక్కల దాడిలో పలువురు గాయపడ్డారు. డిపో సమీపంలోని కేశిరెడ్డినగర్‌కు చెందిన గాయం వెంకటరెడ్డిని కుక్క తీవ్రంగా కరచింది. అక్కడి నుంచి పరుగులు పెడుతూ రోడ్డు వెంట నిల్చొనిఉన్న బేల్దారి మేస్త్రి కోటయ్యను గాయపరిచింది. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో వారు చికిత్స పొందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శునకాల బెడద నుంచి కాపాడాలని పట్టణవాసులు కోరుతున్నారు.


కనిగిరిలో స్వైర విహారం చేస్తున్న శునకాలు

ప్రజావినతులను త్వరితగతిన పరిష్కరిస్తాం

- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రజలు పలు సమస్యలపై అందచేసిన వినతులను త్వరితగతిన పరిష్కరిస్తామని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో సోమవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు అందజేసిన వినతులను పరిశీలిస్తామన్నారు. వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేసి సంబంధిత అధికారులకు పంపిస్తామని చెప్పారు. నిర్ణీత గడువులో అర్జీల సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజాదర్బార్‌లో 172అర్జీలు రాగా, వాటిలో ఎక్కువ శాతం ఇంటి నివేశ స్థలాలు కోసం వచ్చినట్లు తెలిపారు.


అర్జీలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి మండలం నుంచి 30 అర్జీలు, పామూరు నుంచి 9, పీసీపల్లి నుంచి 31, సీఎస్‌పురం నుంచి 21, వెలిగండ్ల నుంచి 14, హెచ్‌ఎంపాడు మండలం నుంచి 30 అర్జీలు వచ్చాయని డాక్టర్ ఉగ్ర తెలిపారు. కనిగిరి మున్సిపాల్టీ నుంచి 37 అర్జీలు వచ్చినట్టు చెప్పారు.

కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్

ముండ్లమూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు మెరుగైన విద్యుత్‌ను అందజేస్తున్నట్టు ఏపీసీపీడీసీఎల్ ప్రాజెక్టు డైరెక్టర్ టీవీఎస్ఎస్ మూర్తి అన్నారు. సోమవారం సాయంత్రం ఆయన మండలంలోని మారెళ్లలో విద్యుత్ సబ్‌స్టేషన్‌ను, సోలార్ ప్రాజెక్టును, శంకరాపురంలోని సోలార్ ఏర్పాటుచేసే కుసుంను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో వినియోగదారులకు మేలు చేసే విధంగా రాష్ట్రంలో అనేకచోట్ల సోలార్ ప్రాజెక్టులను ఏర్పాటుచేస్తున్నట్టు చెప్పారు. సోలార్ ప్రాజెక్టుల ద్వారా ఉత్పత్తి అయ్యే నాణ్యమైన విద్యుత్‌ను సబ్ స్టేషన్‌లకు అందజేసి తద్వారా రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించటం జరుగుతుందన్నారు. పీఎం కుసుము ప్రాజెక్టు కింద అనువైన ప్రదేశాలను గుర్తిస్తున్నట్టు చెప్పారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ వినియోగ దారులకు అందించేందుకు మండలాల్లో రెండు మూడు పీఎం కిసుం ప్రాజెక్టులు మంజూరు చేస్తున్నట్టు చెప్పారు. సూర్యఘర్ పథకం కింద గృహ వినియోగదారులకు సోలార్‌లు ఏర్పాటు చేయటం జరుగుతుందన్నారు. బ్యాంకులు కూడా రుణాలు ఇవ్వటానికి సంసిద్ధత వ్యక్తం చేస్తున్నాయన్నారు.

కార్యక్రమంలో ఈఈ పి.శ్రీనివాసులు, ఏడీఈ పి.రవికుమార్, ఏఈ టి.చినఅంకబాబు, తదితరులు పాల్గొన్నారు.

సోలార్ పవర్ ప్లాంట్‌కు స్థల పరిశీలన

దర్శి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలో సోలార్ విద్యుత్ పవర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసేందుకు అధికారులు సోమవారం స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏపీసీపీడీసీఎల్ ప్రాజెక్టు, హెచ్‌ఆర్‌డీ డైరెక్టర్ టీవీఎస్ఎన్ మూర్తి రాజంపల్లి, బొడ్లపాలెం గ్రామాల్లో సబ్ స్టేషన్‌ల వద్ద స్థలాన్ని పరిశీలించారు. దేశవ్యాప్తంగా సోలార్ విద్యుత్ వాడకాన్ని వినియోగంలోకి తెచ్చే కార్యక్రమంలో భాగంగా సోలార్ పవర్ ప్లాంట్ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు విద్యుత్ శాఖ అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్టు మూర్తి చెప్పారు. ప్లాంట్ల ఏర్పాటుకు అనువైన స్థలాలను త్వరలో ఖరారు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఈఈ పి.శ్రీనివాసులు, పి.రవికుమార్, ఏఈలు సచిన్‌కుమార్, వేణుగోపాల్ పాల్గొన్నారు.


మారెళ్లలో సబ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఏపీసీపీడీసీఎల్ ప్రాజెక్టు డైరెక్టర్ మూర్తి

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

సీఎస్‌పురం(పామూరు), నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. సీఎస్‌పురం మండలంలోని కంభాంపాడు, ఉప్పలపాడు గ్రామాల్లో రైతన్న మీ కోసం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రజాప్రభుత్వం కృషిచేస్తుందన్నారు. రైతును రాజును చేసేందుకు ఐదు విధానాలతో కార్యాచరణను అమలుచేయనున్నట్టు చెప్పారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం రైతన్న మీ కోసం పథకాన్ని రూపొందించిందని చెప్పారు. ఈసందర్భంగా ముఖ్యమంత్రి రైతులకు రాసిన లేఖలను రైతులకు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బొబ్బూరి రమేష్, పామూరు, సీఎస్‌పురం సింగిల్‌విండో చైర్మన్‌లు ఉప్పలపాటి హరిబాబు, సీహెచ్ వెంకటరెడ్డి, సర్పంచ్ శ్రీరాం పద్మావతి, ఎన్‌సీ మాలకొండయ్య, ఏడీఏ జైనాలుద్దీన్, ఏవో సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం సీఎస్‌పురంలోని శివాలయంలో వీధిలో జరిగిన కార్యక్రమంలో ఎన్టీఆర్ రైతు భరోసా, ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరించారు.

పామూరు: రైతు సంక్షే మమే ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ నాయకుడు యారవ శ్రీనివాసులు అన్నారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పడమటకట్టకిందపల్లి గ్రామంలో అన్న దాత-సుఖీభవ, పీఎం కిసాన్ పథకం నగదు పడిన లబ్ధిదారుల రైతన్న మీకోసం యాప్‌లో నమోదుచేసే కార్యక్రమంలో యారవ పాల్గొన్నారు. ఈసందర్భంగా రైతులకు కరపత్రాలు అందజేసి మాట్లాడారు. వ్యవసా యాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రజాప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సురేష్, వీఆర్వో శివశంకర్, వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు. బొట్లగూడూరులో జరిగిన కార్యక్రమంలో టీడీపీ నాయకుడు అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, సర్పంచ్ వై.బాల, నీటి సంఘం చైర్మన్ కమ్మ ప్రసాద్, వీఆర్వో షేక్ గరీబా, రైతులు పాల్గొన్నారు.

వెలిగండ్ల: వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే ఏకైక లక్ష్యంగా రైతన్న మీకోసం అనే కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని టీడీపీ మండల అధ్యక్షుడు కేలం ఇంద్రభూపాల్ రెడ్డి అన్నారు. మండలంలోని మరపగుంట్ల గ్రామంలో సోమవారం ఈకార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఇంటింటికీ తిరిగి ప్రజాప్రభుత్వం రైతుల కోసం చేపడుతున్న అభివృద్ధి పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి టి.శిల్ప, అక్రమ్, ముత్తిరెడ్డి వెంకటరెడ్డి, కోండు భాస్కర్‌రెడ్డి, కర్నాటి భాస్కర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పీసీపల్లి: రైతు సంక్షేమమే ప్రజాప్రభుత్వ లక్ష్యమని టీడీపీ మండల నాయకుడు వేమూరి రామయ్య అన్నారు. రైతన్నా.. మీకోసం కార్యక్రమంలో భాగంగా సోమవారం పీసీపల్లిలో వ్యవసాయ అధికారి ఎన్.రంగాకృష్ణతో కలిసి అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకంలో లబ్ధిపొందిన రైతులకు ప్రభుత్వ సందేశ కరపత్రాలను పంపిణీచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అండగా నిలిచేది ప్రజాప్రభుత్వమేనని అన్నారు.

కార్యక్రమంలో ఏఈవో షబాన, వీపీఏ శ్రావణి, నాయకులు ప్రతాప్‌రెడ్డి, వెంగయ్య, రమేష్, నాగేంద్ర బాబు, సత్తిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


రైతన్నా మీకోసం కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

దూబగుంటలోనే ట్రిపుల్‌ఐటీ ఏర్పాటుచేయాలి

పామూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని దూబగుంట ప్రాంతంలోనే ట్రిపుల్‌ఐటీ నిర్మించాలని కోరుతూ సీపీఐ శ్రేణులు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డీటీ శివరామకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆపార్టీ నాయకుడు మౌలాలి మాట్లాడుతూ గతంలో టీడీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ట్రిపుల్‌ఐటీ నిర్మాణం కోసం దూబగుంటలో భూమిపూజ చేశారన్నారు. వైసీపీ ప్రభుత్వం దాని నిర్మాణం గురించి పట్టించుకోకుండా కనిగిరికి తరలించిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా కనిగిరిలోనే నిర్మించేందుకు ఆసక్తి చూపుతుందన్నారు. గతంలో శంకుస్థాపనచేసిన చోటే నిర్మాణపనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ప్రభాకర్, వి.సుబ్బారావు, ఆర్.సూనిబాబు, మస్తాన్‌రావు, వెంకటరెడ్డి, ప్రసాద్, దేవా కుమార్, మాలకొండయ్య, తదితరులు పాల్గొన్నారు.


డీటీకి వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

సైన్స్ ఫెస్టివల్‌కు వేముల ఉపాధ్యాయురాలు ఎంపిక

ముండ్లమూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో భౌతికశాస్త్ర ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న కాకి స్వర్ణలత ఇండియా, ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌కు ఎంపికయ్యారు. వచ్చేనెల డిసెంబరు 5 నుంచి 10 వరకు ఎడ్యుకేటర్ అండ్ టీచర్స్ వర్క్‌షాపు నిమిత్తం పంజాబ్ రాష్ట్రం చండీఘర్‌లో జరగనున్న ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌కు ఆమె హాజరు కానున్నారు. ఈసందర్భంగా స్వర్ణలతను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి.టాన్య, ఉపాధ్యాయులు అభినందించారు. ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌కు ఎంపిక కావటంతో స్వర్ణలతను డీఈవో కిరణ్ కుమార్, డిప్యూటీ ఈవో చంద్రమౌళీశ్వర్, ఎంఈవో షేక్ కాలేషావలి అభినందించారు. ఈసందర్భంగా స్వర్ణలత ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌కు ఎంపిక కావటం చాలా సంతోషంగా ఉందన్నారు.


స్వర్ణలత

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ముండ్లమూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈదర సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా మంగళవారం ఉదయం 6 నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈ టి.చినఅంకబాబు తెలిపారు. వినియోగదారులు ఈమార్పును గమనించి సహకరించాలని కోరారు.

చట్టప్రకారం విధులు నిర్వహించాలి


మాట్లాడుతున్న అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సురేష్‌బాబు

దర్శి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు రాజకీయ రంగు పులుముకోకుండా చట్టప్రకారం విధులు నిర్వహించాలని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి సురేష్‌బాబు సూచించారు. జిల్లా పర్యటనలో భాగంగా సోమవారం ఆయన దర్శికి వచ్చారు. ఈసందర్భంగా ఎస్సీ ఎస్టీ ఉద్యోగులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు రాజకీయ ముద్రపడితే ప్రభుత్వాలు మారినప్పుడు ఇబ్బంది పడాల్సి వస్తుందన్నారు. గత సంఘటనలను ఉద్యోగులు గుర్తించి నిబంధనల ప్రకారం నడుచుకుంటే ఉద్యోగోన్నతుల్లో కూడా ఇబ్బందిలేకుండా ఉంటుందన్నారు. ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీల పదోన్నతుల్లో స్పష్టమైన విధానాన్ని అవలంభించాలని సూచించారు. రిజర్వేషన్ల అమల్లో పారదర్శకంగా వ్యవహరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చెన్నకేశవులు, రవికుమార్, శాంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి

సీఎస్‌పురం(పామూరు), నవంబరు 24(ఆంధ్రజ్యోతి): పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరుచేయాలని సీపీఎం నాయకుడు సయ్యద్ హనీఫ్ డిమాండ్ చేశారు. సోమవారం సీఎస్‌పురం తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం నివాసయోగ్యం కాని ప్రాంతాల్లో సెంటున్నర జగనన్న కాలనీ పేరుతో ఇంటి స్థలాలు మంజూరుచేయగా ఎవరూ అసక్తి చూపలేదన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు వంతున పేదలకు ఇళ్లస్థలాలు మంజూరు చేసి కాలనీలు మంజూరు చేస్తామని చెప్పారన్నారు. అనంతరం ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఆర్.వాసుదేవరావుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఊసా వెంకటేశ్వర్లు, కె.మాల్యాద్రి, రాజ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీల్లో రాణించాలి

పీసీపల్లి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపికైన ఉపాధ్యాయుడు స్వర్ణ రమణయ్యను ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి అభినందించారు. వెంగళాయపల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న స్వర్ణ వెంకటరమణయ్య ఇటీవల విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటాడు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. శుక్రవారం ఉపాధ్యాయుడు రమణయ్య కనిగిరిలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డిని కలిశారు.

ఈసందర్భంగా రమణయ్యను అభినందించి జాతీయస్థాయిలో కూడా రాణించి కనిగిరి ప్రాంతానికి మంచిపేరు తీసుకురావాలన్నారు. త్వరలోనే వెంగళాయపల్లి పాఠశాలను సందర్శిస్తానని చెప్పారు. ఎమ్మెల్యే ఉగ్రను కలిసిన వారిలో టీడీపీ నాయకుడు పులి ప్రతాప్ రెడ్డి, వీరపనేని పెద్దన్న, ఆర్‌ఎంపీ గంజి రామయ్య, కిరణ్ తదితరులు ఉన్నారు.


ఉపాధ్యాయుడు రమణయ్యను అభినందిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి

సాంకేతిక పద్ధతులు అవలంబించాలి

దర్శి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రైతులు లాభాలబాటలో నడిచేందుకు సాంకేతిక పద్ధతులు అవలంభించాలని మండల వ్యవసాయాధికారి కె.రాధ అన్నారు. సోమవారం మండలంలోని తూర్పువీరాయపాలెంలో జరిగిన రైతన్న మీకోసం కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. డిమాండ్ ఆధారిత పంటలను సాగుచేసుకోవాలన్నారు. నీటి వనరులను పెంపొందించుకోవాలన్నారు. నీటి భద్రతపై దృష్టి సారించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సబ్సిడీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు మండలంలోని అన్నీ రైతు సేవా కేంద్రాల్లో రైతన్న మీకోసం కార్యక్రమాలు నిర్వహించి ప్రభుత్వం నిర్దేశించిన ఐదు విధానాలను ప్రజలకు వివరించారు.

దొనకొండలో..

దొనకొండ, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలం లోని ప్రతి గ్రామ సచివాలయంలో సోమవారం రైతన్న మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వ్యవసాయాధికారి బాలకృష్ణానాయక్ రైతన్న మీకోసం కార్యక్రమంపై ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పిన పంచసూత్రాల గురించి వివరించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి జమ్మలమూడి అరుణకుమార్, వ్యవ సాయ విస్తరణాధికారి ఎస్.వెంకటరావు, బహుళార్ధ ప్రయోజన విస్తరణాధికారి విన్నీబాబు, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ముండ్లమూరులో..

ముండ్లమూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని దర్శి డివిజన్ వ్యవసాయ ఉపసంచాలకులు కె.బాలాజీ నాయక్ అన్నారు. సోమవారం ముండ్లమూరులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు ప్రభుత్వం కల్పిస్తున్న పథకాల గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో దర్శి కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ రమేష్, తహసీల్దార్ ఎల్.లక్ష్మీనారాయణ, ఎంపీడీవో ఎం.శ్రీదేవి, మండల వ్యవసాయ అధికారి ఏ.తిరుమలరావు, తదితరులు పాల్గొన్నారు. మండలంలోని 14 రైతు సేవా కేంద్రాల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు.

స్వామిత్వ సర్వేను సక్రమంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న జడ్పీటీసీ మారం వెంకటరెడ్డి

తాళ్లూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్వామిత్వ సర్వేను సక్రమంగా నిర్వహించాలని జడ్పీటీసీ మారం వెంకటరెడ్డి అన్నారు. సోమవారం తాళ్లూరు-1 గ్రామసచివాలయం వద్ద జరిగిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు. స్వామిత్వ సర్వే తప్పులతడకగా జరిగితే అందుకు బాధ్యత పంచాయతీకార్యదర్శి, గ్రామ సర్వేలు వహించాల్సి వస్తుందన్నారు. కొత్తపాలెం గ్రామానికి చెందిన కైపు రామకోటిరెడ్డి మాట్లాడుతూ తమ గ్రామంలో స్వామిత్వ సక్రంగా జరగలేదన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.అజిత, సర్పంచ్ చార్లెస్ వేస్లీ, వైస్‌ఎంపీపీ ఐ.వెంకటేశ్వరరెడ్డి, ఐ.శ్రీనివాస రెడ్డి, వ్యవసాయాధికారి బి.ప్రసాదరావు, పంచాయతీ కార్యదర్శి షేక్ షహనాజ్‌బేగం, తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

ముండ్లమూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంంలోని పసుపుగల్లు గ్రామంలో ఇటీవల ప్రతిష్ఠించిన సీతలాంబ నాభిశిల 41వ రోజైన సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం మహిళలు ఇంటి విద్ద పొంగళ్ళు చేసుకొని ఊరేగింపుగా నైవేద్యాన్ని తీసుకొచ్చి సీతలాంబకు సమర్పించారు. శివాలయంలో గోకల్యాణం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం శివాలయంలో పెద్ద ఎత్తున పూజా కార్యక్రమాలు జరిగాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మూడువేల మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలకు ఊరేగింపు నిర్వహించారు.


రోడ్లపై పోసిన ధాన్యం రాశులు

కొనుగోళ్లు.. కష్టం

- సాఫ్ట్‌వేర్ లోపంతో జాప్యం
- ధాన్యం అమ్ముకోవడంలో అన్నదాతల ఇక్కట్లు
- రైతులను భయపెడుతున్న వాతావరణ హెచ్చరికలు
- దళారులను ఆశ్రయించి బస్తాకు రూ.377 నష్టపోతున్న వైనం

(బాపట్ల, కొల్లూరు - ఆంధ్రజ్యోతి)

ఒకవైపు వాతావరణశాఖ తుఫాన్ హెచ్చరికలు.. దక్కినంత చాలు అని నూర్పిళ్లు చేసుకుని అమ్ముకునేందుకు రైతులు ఆత్రుత పడుతున్నారు. అయితే అధికారుల అలసత్వం అన్నదాతలకు శాపంగా మారింది. జిల్లాలోని 117 కేంద్రాల్లో ధాన్యం సేకరణ ప్రారంభించినట్లు అధికారుల ప్రకటించి వారం దాటింది. రేపల్లె, వేమూరు మండలాల పరిధిలో నూర్పిళ్లు జరిగి ధాన్యం అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయి. అయితే సాఫ్ట్‌వేర్‌లో సమస్య తలెత్తడంతో ఈ-పంట వివరాలు కనిపించకపోవడంతో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయడంలేదు. సాంకేతిక సమస్యల గురించి ఉన్నతాధికారులకు వ్యవసాయ శాఖాధికారులు వివరించినప్పటికీ సాఫ్ట్‌వేర్ లోపం సరిదిద్దడంలో జాప్యం జరుగుతోంది. మరోవైపు వాతావరణశాఖ హెచ్చరికలతో రైతులు ఆందోళనలో ఉన్నారు. ఇదేఅదనుగా దళారులు రంగప్రవేశం చేసి రైతులను నిలువునా దోచేయడానికి తెరతీశారు. మద్దతు ధరకు ధాన్యం కొనుగోళ్ల అంశాన్ని పాలకులు అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని దాదాపు నెల రోజుల ముందు నుంచే యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. తుఫాన్ దోబూచులాడుతుండడంతో నూర్పిడి అయిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించేలా చూడాలన్నారు. ప్రభుత్వ ఆదేశాలు ఇలా ఉంటే క్షేత్రస్థాయిలో సిబ్బంది అలసత్వం వీడటంలేదు. ఈ-పంట నమోదును ఈ దఫా పక్కాగా నమోదు చేశామని వ్యవసాయశాఖ ఘనంగా ప్రకటించింది. కానీ ఆచరణలోకి వచ్చేసరికి అనేక సాంకేతిక అంశాలు రైతులకు శాపంగా మారాయి. ధాన్యం సేకరణలో సదరు రైతు ఆధార్ నంబరు ఎంటర్ చేయగానే ఈ-క్రాప్ డిస్‌ప్లేతో స్లాట్ బుక్ అవుతుంది. కానీ చాలామంది రైతులకు ఈ-క్రాప్ అయినట్లు చూపించడంలేదు. చెరుకుపల్లి, కొల్లూరు మండలాల పరిధిలోని పలువురు రైతులకు ఆర్‌ఎస్‌కేల వద్ద సోమవారం ఈ-క్రాప్‌కు సంబంధించిన ప్రతిబంధకం ఎదురైంది. గన్నీ సంచులు పుష్కలంగా ఉన్నప్పటికీ వాటిని అన్నదాతలకు పంపిణీ చేయడంలో యంత్రాంగం అలసత్వం మూలంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయి. రైతులు గన్నీ సంచుల కొరకు సిబ్బందిని సంప్రదించగా, తాము మీటింగ్‌లలో బిజీగా ఉన్నామని, మరుసటి రోజు గన్నీ సంచులు ఇస్తామనే సమాధానం రావడం రైతులను విస్మయపరిచేదిలా ఉంది. ధాన్యం నూర్పిడులు చేసి కల్లాల్లో ఉండగా, వర్షపు హెచ్చరికలు భయపెడుతుంటే యంత్రాంగం ఇంత ఉదాసీనంగా సమాధానం ఇవ్వడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇవన్నీ ఒక ఎత్తయితే మిల్లర్లు బ్యాంకు గ్యారెంటీలు ఇచ్చే ప్రక్రియ కూడా ఇంకా ఓ కొలిక్కి రాలేదు. దీంతో ధాన్యం కొనుగోళ్లు కష్టంగా మారాయి. టార్పాలిన్ పట్టాల కోసం రైతులు ఎదురు చూస్తున్నా ఎవరూ పట్టించుకోవడంలేదు. సివిల్ సప్లయిస్‌తో పాటు వ్యవసాయశాఖ, మార్కెటింగ్ శాఖల మధ్య సమన్వయం లోపించడంతో ఆరంభంలోనే కొనుగోళ్ల గాడి తప్పుతున్నట్లు అర్థమవుతోంది. జిల్లా వ్యాప్తంగా 117 కేంద్రాల్లో రెండు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు ప్రభుత్వం అనుమతి ఇచ్చినా అధికారుల మధ్య సమన్వయ లోపం కారణంగా అన్నదాతలకు ఇక్కట్లు తప్పడం లేదు. జిల్లాలో ప్రథమంగా కొల్లూరులో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించినా ఇప్పటి వరకు ఒక్క గింజ కూడా కొనుగోలు జరగలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ధాన్యం సేకరణకు సంబంధించి ఇచ్చిన టోల్ ఫ్రీ నంబర్లు సైతం మూగబోయినట్లు రైతులు చెబుతున్నారు. ఒక వేళ ఫోన్ కలిసినా దాదాపు అరంగట పాటు లైన్‌లో ఉండాల్సిన పరిస్థితి ఉందని అన్నదాతలు వాపోతున్నారు. క్షేత్రస్థాయిలో రైతాంగం ఎదుర్కొంటున్న ఇబ్బందులపై సివిల్ సప్లయిస్ విభాగం అధికారుల వివరణ కోసం ప్రయత్నించినా వారి ఫోన్లు కూడా స్విచ్‌ఆఫ్‌లో ఉండడం గమనార్హం. వాతావరణ శాఖ హెచ్చరికలతో రైతులు పొలాల్లో యంత్రాల ద్వారా కోత కోయగా వచ్చిన ధాన్యాన్ని రోడ్లపై ఆరబోసుకుని తేమ శాతం తగ్గించే ప్రయత్నాల్లో ఉన్నారు. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువెళ్లి తేమశాతం పరీక్షించుకుని స్లాట్ నమోదు చేయాలని కోరుతుండగా సిబ్బంది మాత్రం సమయం పడుతుందని రైతులకు చెప్తున్నారు. కొనుగోళ్ల జాప్యం కావడం, మరోవైపు వాతావరణ శాఖ హెచ్చరికలతో అన్నదాతలు గందరగోళానికి లోనై వచ్చిన కాడికి ధాన్యాన్ని అమ్ముకునేందుకు సిద్ధమయ్యారు. దీంతో దళారులు 75 కేజీల ధాన్యం బస్తా రూ.1350 నుంచి రూ.1400 తేమశాతం, నాణ్యతను బట్టి అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో బస్తాకు సుమారు రూ.377 నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

మ్యుటేషన్ల ప్రక్రియ మారింది

- ఆర్‌డీవో స్థాయిలోనే తుది నిర్ణయం
- ఇకపై జేసీ వద్దకు ఫైలు వెళ్లాల్సిన పని లేదు
- ప్రభుత్వ నిర్ణయంతో భూ యజమానులకు తప్పిన తిప్పలు

బాపట్ల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): భూము ల మ్యుటేషన్లకు నూతన కార్య ప్రక్రియని రాష్ట్ర భూ పరిపాలన ముఖ్య కమిషనర్ కార్యాలయం విడుదల చేసింది. వెబ్‌ల్యాండ్‌లోని కొన్ని సర్వే నంబర్లలో పట్టాదారు పేర్లను ఇతరులు/మిగులు భూములు /క్లెయిమ్ చేయని భూమిగా పేర్కొంటూ ఎంట్రీలు చేశారు. దీనిపై రైతులకు అవగాహన లేకపోవడంతో వెబ్ ల్యాండ్‌లో సవరణలు



చేయించుకోలేకపోయారు. ఎప్పు డైతే భూములను విక్రయించడానికి వస్తారో అప్పుడు సమస్యలు ఉత్పన్నమౌతున్నాయి. దీనిని సరి చేసుకోవడానికి గ్రామ/వార్డు సచివా లయం మొదలుకుని జాయింట్ కలెక్టర్ స్థాయి వరకు అర్జీ వెళ్లాలి. చివరికి జాయింట్ కలెక్టర్ దానిని పరిశీలించి ఆమోదం తెలి పాక అప్పు డు తహసీల్దార్ లాగిన్‌లో నుంచి వెబ్ ల్యాండ్‌లో కరెక్షన్ చేస్తున్నారు. జాయింట్ కలెక్టర్లు వేర్వేరు పనుల్లో బిజీగా ఉంటుండటంతో వీటిని చాలా సందర్భాల్లో పట్టించుకోవడం లేదు. దీని వలన నెలల తరబడి జాప్యం జరుగుతున్నది.

వెబ్‌ల్యాండ్‌లో ఇతరములు అని ఉన్న ఒక సర్వే నంబర్‌లోని సబ్ డివిజన్ నంబర్లు ఉండటాన్ని రైతు క్లెయిమ్ చేయకపోయినా ఉండాలి/ పట్టాదారు డిని గుర్తించకపోయినా ఉండాలని భావిస్తున్నారు. ప్రస్తుతం వీటి పరిష్కారానికి గ్రామ/వార్డు సచి వాలయంలో అర్జీ పెట్టిస్తున్నారు. అది తహసీల్దార్ లాగిన్‌కి వస్తుంది. ఇలాంటి అర్జీలను పరిశీలించి రీ మార్కులు పొందుపరచాల్సిందిగా వీఆర్‌వోకి తహసీల్దా రు పంపుతున్నారు. ఆ తర్వాత ఆర్‌ఐ పరిశీలన చేస్తున్నారు. అక్కడి నుంచి తిరిగి తహసీల్దార్‌కు వస్తుంది. అనంతరం ఆర్‌డీవో, జాయింట్ కలెక్టర్ వద్దకు ఫైలు వెళుతుంది. జేసీ ఆమోదంతో వెబ్‌ల్యాండ్ ఎంట్రీ లలో కరెక్షన్లు చేస్తున్నారు. ఇక నుంచి ఈ ప్రక్రియ ఆర్‌డీవో స్థాయిలోనే జరుగుతుంది. దరఖాస్తు దారుడు జీఎస్‌డబ్ల్యూఎస్(సచివాలయం)లో మ్యుటేష న్ ఫర్ ట్రాన్సాక్షన్ సర్వీసు కింద అర్జీ పెడతారు. దీనిని వీఆర్ వోకి సమాచారం ఇస్తారు. ఆ అర్జీని, డాక్యు మెంట్లను వీఆర్‌వో పరిశీ లించి తహసీల్దార్‌కు పంపుతారు. దీని ఆధారంగా తహసీల్దార్ ఫారం- 8 నోటీసుని రూపొందించి తిరిగి వీఆర్‌వో లాగిన్‌కి పంపుతారు. వీఆర్‌వో ఆ తర్వాత ఎంక్వయిరీ రిపోర్టు, సంబంధిత ఆర్‌వోఆర్ డాక్యుమెంట్స్, ఫారం-8, రిజిష్టర్ డాక్యుమెంట్‌లు, పాత అడంగల్స్, ఎంజాయిమెంట్ సర్వే రిపోర్టు, వాటర్ ట్యాక్స్ పేమెంట్ రశీదు, పక్క భూముల రైతుల ఎంజాయి మెంట్ స్టేట్‌మెంట్‌ని సేకరించి అన్ని పరిశీలన చేసి ఆర్‌ఐకి పంపుతారు. ఆర్‌ఐ చెక్‌లిస్టు ప్రకారం అన్ని ఉన్నాయా, లేదా అని పరిశీ లించి తహసీల్దార్‌కు రీమార్కులు రాసి నివేది స్తారు. తహసీల్దారు వీఆర్‌వో, ఆర్‌ఐ రీమార్కులు, డాక్యుమెంట్లను పరిశీలించి సబ్ కలెక్టర్ /ఆర్‌డీవో లాగిన్‌కు పంపుతారు. ఆర్‌డీవో తన వద్దకు వచ్చిన వీఆర్‌వో, ఆర్‌ఐ చెక్‌లిస్టులు, డాక్యుమెంట్‌లు, తహసీల్దార్ సిఫార్సులను పరిశీలించి వెబ్‌ల్యాండ్‌లో కరెక్షన్స్‌కి అనుమతిస్తూ తిరిగి తహసీల్దార్‌కు పంపి స్తారు. దీంతో జాయింట్ కలెక్టర్లపై పనిభారం తగ్గడం తో పాటు అర్జీలు కూడా త్వరితగతిన పరిష్కార మౌతాయని భూపరిపాలన ముఖ్య కమిషనర్ జయలక్ష్మి స్పష్టం చేశారు.

పదోన్నతుల పండుగ

పంచాయతీ కార్యదర్శులకు ప్రమోషన్లు



- డిప్యూటీ ఎంపీడీవోలుగా 86 మందికి అవకాశం
- స్పెషల్ గ్రేడ్ పంచాయతీలకు కేటాయింపు

(రేపల్లె, ఆంధ్రజ్యోతి)

పంచాయతీల పాలనలో ప్రభుత్వం సమూల మార్పులు తీసుకొచ్చింది. పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేసే దిశగా చర్యలు చేపట్టింది. పల్లె వాసులకు మేరుగైన సేవలు అందించేందుకు క్లస్టర్ల స్థానంలో పంచాయతీలకు గ్రేడ్‌లను అమలులోకి తీసుకొచ్చింది. పంచాయతీల్లో కార్యదర్శులు.. సిబ్బంది క్యాడర్‌లో మార్పులు చేసింది. కార్యదర్శులను పంచాయతీ అభివృద్ధి అధికా రులుగా మార్పు చేసింది. ఆదాయం.. జనాభా ఆధారంగా పంచాయతీలకు కేటాయించిన గ్రేడ్‌ల ప్రకారం అధికార సిబ్బందిని కేటాయిస్తోంది. స్పెషల్ గ్రేడ్ పంచాయతీలకు డిప్యూటి ఎంపీడీవోలను నియమించనుంది. కార్యదర్శులకే డిప్యూటీ ఎంపీడీవోలుగా పదోన్నతులు కల్పించింది. ఈ మేరకు ప్రమోషన్ పొందిన కార్యదర్శుల జాబితాను పంచాయతీ రాజ్ శాఖ విడుదల చేసింది. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో 86 మంది కార్యదర్శులకు డిప్యూటీ ఎంపీడీవోలుగా పదోన్నతులు లభించాయి.

గ్రేడ్‌లు అమల్లోకి వచ్చిన వెంటనే..

గుంటూరు జిల్లాలో అత్యధికంగా కార్యదర్శులకు డిప్యూటీ ఎంపీడీవోల పదోన్నతులు కల్పించారు. 43 మంది కార్యదర్శులకు డీవై ఎంపీడీవోలుగా నియమితులయ్యారు. వీరిలో కొందరిని బాపట్ల, పల్నాడు జిల్లాల్లో నియమించారు. బాపట్ల జిల్లాలో 30 మంది, పల్నాడు జిల్లాలో 13 మంది కార్య దర్శులు డీవై ఎంపీడీవోలుగా నియమితులయ్యారు. పంచాయతీల్లో గ్రేడ్‌ల పాలన అమల్లోకి వచ్చిన వెంటనే పదోన్నతులు పొందిన వారిని పంచాయతీలకు నియమించనున్నారు. పంచాయతీల్లోని జూనియర్ అసిస్టెంట్లు, బిల్ కలెక్టర్లలో కొందరిని సీనియర్ అసిస్టెంట్లుగా అప్‌గ్రేడ్ చేశారు. సచివాలయాల్లోని డిజిటల్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లను గ్రామ ప్రణాళిక సహాయకులుగా నియమించనున్నారు. పంచాయతీల్లో ఐటీ విభాగం ఏర్పాటు చేసి రికార్డుల డిజిటలైజేషన్ చేసే దిశగా పంచాయతీరాజ్ శాఖ చర్యలు చేపట్టింది. 2025-26 ప్యానెల్ సంవత్సరానికి ఉన్న ఖాళీలన్నీ భర్తీ చేయాలని నిర్ణయించింది. మొత్తం మీద పంచాయతీల్లో పాలనా మార్పులు త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి.

యోగాలో చందలూరు బాలికలు భళా


అండర్ 14, 17 ట్రెడిషనల్ పోటీలలో గెలుపొందిన జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన బాలబాలికలు



రాష్ట్రస్థాయి యోగా అండర్ -14 ఆర్టిస్టిక్ పెయిర్‌లో విజేతగా నిలిచిన చందలూరు విద్యార్థినులు హెప్సిబ, శ్రుతి

పంగులూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చందలూరు గ్రామంలో రెండు రోజులుగా జరుగుతున్న రాష్ట్ర స్థాయి యోగా పోటీలలో చందలూరు ఉన్నత పాఠశాల విద్యార్థినులు సత్తాచాటారు. సోమవారం రాత్రి జరిగిన ముగింపు కార్యక్రమంలో విజేతలకు బహుమతులు అందజేశారు. ఆయా విభా గాల్లో ప్రథమస్థానంలో నిలిచిన బాల బాలికలు త్రిపురలోని అగర్తలలో జరిగే జాతీయ స్థాయి యోగా పోటీలో పాల్గొం టారని రాష్ట్ర యోగా పోటీల పరిశీల కులు పూర్ణచంద్రరావు, రాజ్‌కుమార్ తెలిపారు. అండర్ 14 ట్రెడిషనల్ విభాగంలో విజేతగా నాయపాము శ్రుతి, ఆర్టి స్టిక్ ఫెయిర్ విభాగంలో నాయపాము శ్రుతి, కుంచాల హెప్సిబ ప్రథమస్థానంలో నిలిచారు. అండర్ 17 ట్రెడిషనల్ బాలికల విభాగంలో పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన అర్మిత భవానీచౌదరి, బాలుర విభాగంలో తూర్పు గోదావరి జల్లాకు చెందిన కార్తీక్‌రామ్ జాతీ యస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్ -17 రిథమిక్ పెయిర్ బాలికల విభాగంలో విశాఖకు చెందిన వైష్ణవి, కౌశల్య, బాలుర విభాగంలో కర్నూల్‌కు చెందిన తులశిసాయి, షేక్ షాహిద్‌అత్రద్ విజేతలుగా నిలిచారు. ట్రెడిషనల్ అండర్-14 బాలుర విభాగంలో కృష్ణా జిల్లాకు చెందిన సురేంద్ర విజేతగా నిలిచాడు. బహుమతుల ప్రధానోత్స వంలో ప్రధానోపాధ్యాయురాలు చందలూరి గిరిజ, కె.వి.సుబ్బారావు, తహసీల్దార్ సింగా రావు, ఎం.పీ.డీ.ఓ స్వరూపారాణి, ఎం.ఇ.ఓ. వీరాంజనే యులు, ఎస్.ఐ.వినోద్‌బాబు, కుర్రా హనుమం తరావు, పి.డి.ప్రతిమ, మధుమూర్తి, వడ్డవల్లి వీరనారాయణ, పెంట్యాల రామలింగ స్వామి, నార్నె తాతయ్య, అడ్డగడ సుబ్బయ్య, మురకొండ సుబ్బారావు, ఊర్మిళాదేవి, ఝూన్సీ, ఉదయకుమారి, శ్రీధర్ పాల్గొన్నారు.

ధాన్యం సేకరణలో రైతులకు ఇబ్బందులు రాకూడదు

- అమృతలూరు ఆర్‌ఎస్‌కే-2 సందర్శనలో కలెక్టర్ వినోద్‌కుమార్

అమృతలూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా జిల్లాలో ధాన్యం సేకరణ జరగాలని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక రైతు సేవా కేంద్రం-2ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్‌ఎస్‌కే ద్వారా కొనుగోళ్లను పరిశీలించారు. ధాన్యం సేకరణలో రైతులకు ఇబ్బందులు లేకుండా అత్యంత పారదర్శకతతో కొనుగోలు ప్రక్రియ చేయాలన్నారు. 7337359375 అనే నెంబరుకు వాట్సాప్‌లో హాయ్ అని మెసేజ్ పెడితే స్లాట్ బుక్ అవుతుందన్నారు. బ్యాంకు గ్యారెంటీ చెల్లించకపోవడంతో మిల్లర్లతో మాట్లాడారు. 24 గంటల్లోగా బ్యాంకు గ్యారెంటీ చెల్లించాలని ఆదేశించారు. అనంతరం క్షేత్రస్థాయిలో దిగుబడులను పరిశీలించారు. రైతు వెంకటేశ్వరరావుతో ప్రత్యేకంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రామలక్ష్మి, పౌరసరఫరాల డీఎం శివపార్వతి, తహసీల్దార్ కూచిపూడి నెహ్రూబాబు, వ్యవసాయశాఖ ఏడీఏ ధనరాజ్, వేమూరు మార్కెట్ యార్డు ఛైర్‌పర్సన్ గొట్టిపాటి పూర్ణకుమారి, అమృతలూరు పీఏసీఎస్ ఛైర్మన్ కొత్తపల్లి రవీంద్రబాబు ఎంపీడీవో మారుతీశేషమాంబ, ఏవో భరత్‌కుమార్, ఏఈవో మణికంఠ, తదితరులు పాల్గొన్నారు.


ఆర్‌ఎస్‌కే కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్


రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

యూరియా దుకాణాలపై దాడులు

- ఆంధ్రజ్యోతి కథనానికి స్పందించిన అధికారులు

చీరాల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): యూరియా బస్తా.. రూ.500 అంటూ ఆంధ్రజ్యోతిలో శనివారం ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. సోమవారం చీరాల రెవెన్యూ డివిజన్ పరిధిలోని పలు దుకాణాలపై అధికారులు దాడులు చేసి తనిఖీలు చేపట్టారు. వీఆర్వోలతో కూడిన బృందాలు ఆయా దుకాణాల్లో రికార్డులను పరిశీలించాయి. ఈ సందర్భంగా ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన ధరల్లోనే యూరియా విక్రయాలు జరపాలని, భిన్నంగా వ్యవహరిస్తే చర్యలు కఠినంగా ఉంటాయన్నారు.

అన్ని గ్రామాలకు విద్యుత్ లైన్లు

నాగులపాడులో మంత్రి గొట్టిపాటి రవికుమార్

అద్దంకిటౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరఫరాలో సమస్యలు తలెత్తకుండా అన్ని గ్రామాల్లో కొత్తగా విద్యుత్ లైన్లు ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. మండలంలోని నాగులపాడు గ్రామంలో సోమవారం మంత్రి పర్యటించారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 37 మంది విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశారు. ఎస్సీ కాలనీలో కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యుత్ సమస్యలు రాకుండా కొత్తగా విద్యుత్ సబ్‌స్టేషన్లు, స్తంభాలు, లైన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. నియోజకవర్గంలో 1900 వ్యవసాయ కనెక్షన్లు మంజూరు చేశామన్నారు. నాగులపాడు ఎస్సీ కాలనీలో రూ.40లక్షలతో కమ్యూనిటీ భవనం నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. అనారోగ్యంతో చికిత్స పొందిన గ్రామానికి చెందిన కొప్పుల కోటయ్య, జ్యోతి సుబ్బులు, మాజీ ఎంపీటీసీ పచ్చా సింగయ్య, మంగమూరి బ్రహ్మయ్య, మంగమూరి అరుణ, వేమూరి వసంతరావు తల్లి తదితరులను మంత్రి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాజేశ్వరి, వ్యవసాయమిషన్ డైరెక్టర్ నాగినేని రామకృష్ణ, టీడీపీ నాయకులు కరి పరమేష్, పెంట్యాల రామాంజనేయులు, టీడీపీ మండల, పట్టణ, గ్రామ అధ్యక్షులు మానం మురళీమోహన్‌దాస్, అరిగల నాగరాజు, రామారావు, స్వచ్ఛాంధ్ర మిషన్ డైరెక్టర్ చిన్ని లక్ష్మీశ్రీనివాసరావు, సింగరకొండ దేవస్థానం ఛైర్మన్ చుండూరి మురళి సుధాకరరావు, ఈఈ మస్తాన్‌రావు, తహసీల్దార్ శ్రీచరణ్, ఎంపీడీవో వరూధిని పాల్గొన్నారు.


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

రైతును రాజును చేయడమే లక్ష్యం

రైతన్నా మీ కోసంలో ఎమ్మెల్యే ఆనందబాబు

అమృతలూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రైతును రాజును చేయడమే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని, ఆ దిశగా పనిచేస్తున్నట్లు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తెలిపారు. మండలంలోని కూచిపూడిలో సోమవారం జరిగిన రైతన్నా మీ కోసం.. కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని రైతులకు కరపత్రాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ఏడాది పంటలు దెబ్బతింటే రికార్డుస్థాయిలో ఇన్‌పుట్ సబ్సిడీ అందించామన్నారు. విచ్చలవిడిగా ఎరువుల వాడకం తగ్గించాలన్నారు. అన్ని అంశాల్లో రైతులకు అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో వేమూరు మార్కెట్ యార్డు ఛైర్‌పర్సన్ గొట్టిపాటి పూర్ణకుమారి, పార్టీ మండల అధ్యక్షుడు కొత్తపల్లి రవీంద్రబాబు, యలవర్తి బ్రహ్మానందం, తుమ్మల భుజంగరావు, మట్లపూడి జయపాల్, తుమ్మల కిషోర్, యలమంచిలి బాజీ, కమలాకర్, వెంకటేష్, ఎం ఆనంద్, నాగరాజు, కృష్ణమూర్తి, జగదీష్, యలవర్తి రఘుబాబు పాల్గొన్నారు.


రైతులకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

అభివృద్ధి పనులకు విఘాతం కలిగిస్తున్న వైసీపీ సర్పంచ్

● టీడీపీ నేత శ్రీనివాసరావు ఆవేదన



డ్రైనేజీకాలువలో తీసిన పూడిక

సంతనూతలపాడు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఎం.వేములపాడులో చేపట్టే అభివృద్ధి పనులకు వైసీపీకి చెందిన సర్పంచ్ విఘాతం కలిగిస్తున్నారని టీడీపీ గ్రామ అధ్యక్షుడు మారెళ్ల శ్రీనివాసరావు ఆరోపించారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ గ్రామంలో రూ.లక్షలు వెచ్చించి పారిశుధ్య పనులను చేశామని, అయితే అందుకు సంబంధించిన బిల్లుల పై సర్పంచ్ సంతకం చేయకుండా ఇబ్బందిపెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో పనులు పూర్తిచేసిన వెంటనే బిల్లులు మంజూరైతే మిగతా పనులు చేసేందుకు అడుగు ముందుకు పడుతుందని తెలిపారు. కానీ వైసీపీకి చెందిన సర్పంచ్ మాత్రం అభివృద్ధి పనులు జరగకుండా విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. సంబంధిత బిల్లుపై పంచాయతీ కార్యదర్శి, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు సంతకాలు చేసినా గ్రామ సర్పంచ్ ఇంతవరకు సంతకం చేయలేదని ఆయన వాపోయారు. ఈ విషయంపై ఒంగోలు కలెక్టరేట్‌లో జరిగిన స్పందనలో ఫిర్యాదు చేసినట్లు ఆయన వెల్లడించారు. దీనిపై గ్రామ సర్పంచ్‌ని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా గ్రామంలోని ఎస్టీకాలనీలో కొందరు పారిశుధ్యపనులు పూర్తిగా చేసి బిల్లులు పెట్టుకోగా అవి మంజూరైనట్లు తెలిపారు.

యామినీశర్మకు సత్కారం



యామినీశర్మను సత్కరిస్తున్న నాయకులు

ఒంగోలు(రూరల్), నవంబరు24(ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని బీజేపీ సోమవారం ఆ పార్టీ రాష్ట్ర నాయకురాలు యామినీశర్మను ఓబీసీ మోర్చా మాజీ కార్యదర్శి రావులపల్లి నాగేంద్ర యాదవ్ సన్మానించారు. నెల్లూరులో జరుగుతున్న రాష్ట్ర బీజేపీ శిక్షణ కార్యక్రమాలకు వెళుతూ యామినీశర్మ ఒంగోలులోని పార్టీ కార్యాలయానికి విచ్చేశారు. ఈ సందర్భంగా నాయకులు ఆమెను కలిసి సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు రాష్ట్ర కార్యదర్శి బొడ్డు నాగలక్ష్మి, అధికార ప్రతినిధి గాయిత్రి గోగులు మల్లేశ్వరి, శారద తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌లో మూడు అర్జీలు

మద్దిపాడు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మద్దిపాడు తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో మూడు అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ వేమూరి ఆదిలక్ష్మి తెలిపారు. రెండు అర్జీలు కొలతలు, ఒకటి మ్యూటేషన్ కోసం దరఖాస్తులు వచ్చాయని, వాటిని వెంటనే పరిష్కరించాలని వీఆర్వోలను ఆదేశించినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ అజయ్‌కుమార్‌రెడ్డి, ఆర్‌ఐ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రాబ్యాంక్ విశ్రాంత ఉద్యోగుల వితరణ



నిత్యావసర సరుకులను అందజేస్తున్న సిబ్బంది

ఒంగోలు కల్చరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఆంధ్రాబ్యాంక్ విశ్రాంత ఉద్యోగుల సంఘం సభ్యులు సోమవారం స్థానిక హౌసింగ్‌బోర్డులోని మహిళాశ్రయం శక్తిసదన్‌కు నిత్యావసర సరుకులను అందజేశారు. ఆంధ్రాబ్యాంక్ వ్యవస్థాపకులు, స్వాతంత్ర్య సమరయోధుడు భోగరాజు పట్టాభి సీతారామయ్య 146వ జయంతి సందర్భంగా వీటిని వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రా బ్యాంక్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పి.కె.రాజేశ్వరరావు అధ్యక్షతన పట్టాభి సీతారామయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మహిళాభ్యుదయ సమితి రాష్ట్ర అధ్యక్షురాలు తేళ్ల అరుణ, ఆంధ్రా బ్యాంక్ విశ్రాంత ఉద్యోగుల సంఘం డిప్యూటీ జనరల్ సెక్రటరీ సబీ.రావు, రీజనల్ సెక్రటరీ వి.పార్థసారథి, ఎగ్జిక్యూటివ్ సభ్యులు యూవీ.రత్నం, జీవీ.శేషగిరిరావు, సీహెచ్.త్యాగరాజు, స్వామి, డి.బ్రహ్మయ్య, కవయిత్రులు నాళం నరసమ్మ, సింహాద్రి జ్యోతిర్మయి, బీరం అరుణ తదితరులు పాల్గొన్నారు.

యరజర్లలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రత్యేక శిబిరం



మాట్లాడుతున్న ప్రిన్స్‌పాల్ హనుమంతరావు

ఒంగోలు(విద్య), నవంబరు24(ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని క్విజ్ ఇంజినీరింగ్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం, డాక్టర్ ఎన్‌ఎస్‌కేసీ వికసిత్ భారత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం ఒంగోలు మండలం యరజర్ల గ్రామంలో ఏడు రోజుల ప్రత్యేక శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా క్విజ్ విద్యాసంస్థల చైర్మన్ ఎన్. సూర్యకళ్యాణచక్రవర్తి మాట్లాడుతూ దేశ అభివృద్ధిలో యువత కీలకపాత్ర పోషించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్స్‌పాల్ వై.హనుమంతరావు, ఎన్‌ఎస్‌ఎస్ జిల్లా నోడల్ ఆఫీసర్ వాసుబాబు, డీన్ నవనీతకృష్ణన్, పంచాయతీ కార్యదర్శి రామ కృష్ణ, వైస్ సర్పంచ్ హరిబాబు, ఎంపీటీసీ జి.శ్రీనివాసులు, టీడీపీ నాయకుడు శ్రీనివాసరావు పాల్గొన్నారు. విద్యార్థులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.



అండర్ -19 యోగా ట్రెడిషనల్ పోటీలలో తలపడుతున్న వివిధ జిల్లాల బాలికలు

రసవత్తరంగా యోగా పోటీలు

పంగులూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని చందలూరు గ్రామంలో రాష్ట్రస్థాయి 69వ ఎస్‌జీఎఫ్ యోగా పోటీలు సోమవారం రసవత్తరంగా సాగాయి. అండర్ - 14, అండర్ -17 విభాగాలలో ట్రెడిషనల్, ఆర్టిస్టిక్, రిథమిక్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. అండర్-19 ట్రెడిషనల్ విభాగంలో కృష్ణ, కడప, నెల్లూరు, చిత్తూరు, కర్నూల్, తూర్పు గోదావరి, అనంతపురం, గుంటూరు, శ్రీకాకుళం జిల్లా క్రీడాకారులు న్యాయనిర్ణేతలు నిర్దేశించిన ఆసనాలతో పాటు వారు ఎంచుకున్న ఆసనాలు ప్రదర్శించారు. యోగా క్రీడలో వివిధ జిల్లాల బాల, బాలికలు క్రీడానైపుణ్యం చాటిన తీరు వీక్షకులకు కనువిందు చేసింది. రాష్ట్రం నలుమూలల నుంచి చందలూరు చేరుకున్న యోగా క్రీడాకారులకు ఆర్గనైజింగ్ కమిటీ ఆధ్వర్యంలో గ్రామస్థులు తగు వసతి కల్పించారు. అండర్-19 ఆర్టిస్టిక్, రిథమిక్ పోటీలు మంగళవారంతో ముగియనుండగా, ఈ పోటీలను పరిశీలకులు డాక్టర్ శ్రీనివాసరెడ్డితో పాటు పూర్ణచందరరావు, రాజ్‌కుమార్‌లు పర్యవేక్షిస్తున్నారు. ఎన్‌ఐఎస్ అధికారులు న్యాయనిర్ణేతలుగా వ్యవహరిస్తున్నారు.

ప్రజావేదికకు వినతుల వెల్లువ

సమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్యే దామచర్ల ఆదేశం



ప్రజల సమస్యలను ఆలకిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యల పరిష్కార వేదికగా ఒంగోలులో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ నిర్వహించిన ప్రజావేదికకు వినతులు వెల్లువెత్తాయి. సోమవారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావేదికలో పలువురు విచ్చేసి తమ సమస్యలను ఎమ్మెల్యే దామచర్ల ఎదుట విన్నవించారు. అర్జీదారుల సమస్యలను సానుకూలంగా ఆలకించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులకు ఫోన్ చేసి ఆయా సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే ప్రజలు కూడా నగరంలో ఏర్పాటు చేసిన ప్రజా వేదిక ఫిర్యాదుల బాక్సుల ద్వారా తమ సమస్యలను తెలియజేవచ్చని తెలిపారు. ఆ సమస్యలను తమ కార్యాయల సిబ్బంది ఫోన్ చేసి, అర్జీదారులతో మాట్లాడటంతోపాటు, అధికారుల దృష్టికి తీసుకెళతారని చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే దామచర్ల మీడియాతో మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారం కోసం తాను ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని చెప్పారు. ఆయా సమస్యలను బట్టి, పరిష్కారానికి కొంత సమయం పడుతుందని, ప్రజలు ఎవరూ నిరుత్సాహపడవద్దని, తప్పనిసరిగా అర్జీదారుల న్యాయం జరిగేలా తాను ముందు ఉంటానని తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ఒంగోలు నియోజకవర్గ పరిధిలోని పలువురికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే దామచర్ల పంపిణీ చేశారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో 20 మంది లబ్ధిదారులకు రూ.12.33లక్షల విలువైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి సహాయనిధి లక్ష్యం అన్నారు. అనారోగ్య సమయంలో చికిత్స పొందిన వారికి భరోసా కల్పిస్తుందని తెలిపారు.

ప్లాస్టిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి

● జనవిజ్ఞాన వేదిక ప్రతినిధుల వినతి



కమిషనర్ వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నగరంలో ప్లాస్టిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుని ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చి దిద్దాలని జన విజ్ఞాన వేదిక నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం నగర కమిషనర్ కె.వెంకటేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకంపై అవగాహన కార్యక్రమాలు వివిధ విద్యా సంస్థలలో నిర్వహించాలన్నారు. ప్రత్యామ్నాయంగా నేత సంచులు వినియోగంపై అవగాహన కల్పించాలని చెప్పారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ అమ్మకంపై దాడులు నిర్వహించి చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక గౌరవ అధ్యక్షుడు డాక్టర్ కొల్లా నాగేశ్వరరావు, రాష్ట్ర బాధ్యులు కొల్లా మధు, కంచర్ల వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు చిన్నాజీ, చిట్టెం వెంకటేశ్వర్లు, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

బీపీఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి - కమిషనర్

అక్రమ కట్టడాల క్రమబద్ధీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలులోకి తీసుకొచ్చిందని, బిల్డింగ్ పీనలైజేషన్ స్కీమ్ (బీపీఎస్)ను సద్వినియోగం చేసుకోవాలని నగర కమిషనర్ వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ అక్రమ కట్టడాల క్రమబద్ధీకరించుకోవడం ద్వారా బ్యాంకుల నుంచి రుణ సదుపాయం, పన్ను సౌకర్యాన్ని పొందవచ్చని తెలిపారు. అలాగే క్రమబద్ధీకరణకు ప్రభుత్వం చివరి అవకాశం కల్పించిందని చెప్పారు. 120 రోజులలోపు ప్లాను లేకుండా, అనధికారకంగా నిర్మించిన భవనాల క్రమబద్ధీకరించుకోవాలని, 2026 మార్చిలోపు అలా చేయని పక్షంలో ఆయా నిర్మాణాలను కచ్చితంగా తొలస్తామని స్పష్టం చేశారు.

'రైతన్నా మీకోసం' వారోత్సవాలను విజయవంతం చేయాలి

● తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్



నాగులుప్పలపాడులో జరిగిన సమావేశంలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది

నాగులుప్పలపాడు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతన్నా మీకోసం వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని తహసీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్ కోరారు. సోమవారం నాగులుప్పలపాడు మండలపరిషత్ కార్యాలయంలో ఏవో వెంకట్రావు అధ్యక్షతన అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రైతు సేవా కేంద్రం ఇన్‌చార్జ్‌గా ఉన్న వ్యక్తి టీమ్ లీడర్‌గా, ఏడు మందితో ఒక బృందంగా ప్రతి రోజు మూడు గృహాలను సందర్శించాలని తెలిపారు. ప్రతి రైతుకు వ్యవసాయం, విత్తనాలు, ఎరువులు, పంటల ఎంపిక, దిగుబడి, క్రిమి సంహారక మందులు వాడకం, పరికరాలు, మార్కెటింగ్, పథకాలను సవివరంగా తెలపాలని చెప్పారు. ముఖ్యమంత్రి సందేశ పత్రాన్ని అందజేయాలని సూచించారు. ఈ నెల 29 వరకు వారోత్సవాలను నిర్వహించాలన్నారు. ఎంపీడీవో తేళ్ల రవికుమార్ మాట్లాడుతూ రైతన్నా మీకోసం బృంద సభ్యులు కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి అవగాహన కల్పించాలని చెప్పారు. రైతుల సమస్యలు నమోదు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పొన్నలూరు మండలంలో..

పొన్నలూరు: మండలంలోని అన్ని గ్రామాల రైతు సేవా కేంద్రంలో రైతన్న మీకోసం కార్యక్రమాన్ని సోమవారం వ్యవసాయ అధికారి వి.రాము ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సింగరాయకొండ వ్యవసాయ సహాయకులు డాక్టర్ నిర్మలకుమారి మాట్లాడుతూ అన్నదాతలకు రానున్నకాలంలో వ్యవసాయ శాఖ, అనుబంధ శాఖల ద్వారా రైతులకు మేలు చేయాలని సూచించారు. నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్. ఫుడ్ ప్రాసెసింగ్ ద్వారా మేలైన యాజమాన్య పద్ధతిలో అధిక ఉత్పాదకత సాధించాలని ఆమె కోరారు. వ్యవసాయ అధికారి రాము మాట్లాడుతూ 24వ తేదీ నుంచి డిసెంబర్ 3వ తేదీ వరకు అన్ని రైతు సేవా కేంద్రాల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తారని తెలిపారు.

కొత్తపట్నం మండలంలో ..

కొత్తపట్నం: రాష్ట్ర ప్రభుత్వం సోమవారం నుంచి తలపెట్టిన రైతన్న మీకోసం కార్యక్రమాన్ని మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రారంభమైంది. కొత్తపట్నం తదితర గ్రామాల్లో ఏవో కిషోర్‌బాబు రైతులతో మాట్లాడారు. సాగులో రైతులకు సరైన సూచనలు చేస దిగుబడులు పెంచటం ద్వారా వ్యవసాయాన్ని లాభసాటిగా చేయటమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ వారోత్సవాలను నిర్వహిస్తుందన్నారు.

వంతెన నిర్మాణం కోసం వినతి



ఈఈకి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

నాగులుప్పలపాడు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పుగుండూరు నుంచి మట్టిగుంట గ్రామానికి వెళ్లే రోడ్డులో హిందూ స్మశానవాటిక వద్ద మురుగుకాలువపై హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలంటూ టీడీపీ గ్రామ అధ్యక్షుడు కనగాల శ్రీనివాసరావు కోరారు. ఈమేరకు సోమవారం ఒంగోలులోని రోడ్లు భవనాలశాఖ ఈఈ గోపీనాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో ఆ మార్గంలోని లోలెవల్ బ్రిడ్జిపైకి వరదనీరు చేరి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని, అందువల్ల హైలెవల్ వంతెన నిర్మాణానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామంలోని మాలకుంట వద్ద ఉన్న ఎస్టీ కాలనీ, జగనన్న కాలనీలకు వెళ్లే రోడ్డులో నూతన బ్రిడ్జిలు నిర్మించాలని జడ్పీ సీఈవో బి. చిరంజీవికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో బాపట్ల పార్లమెంట్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు తిరుమలశెట్టి శ్రీను, సొసైటీ డైరెక్టర్ మసిముక్కు భాస్కరరావు, బెల్లం శ్రీనివాసరావు, కత్తి నాగార్జున, అయ్యప్ప పాల్గొన్నారు.

ఇంటిని మరిపించిన ప్రేమ, ఆప్యాయతలు

రాష్ట్రస్థాయి యోగా పోటీల నిర్వహణ బాగు బాగు

పంగులూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): 'గ్రామీణ ప్రాంతమైన చందలూరులో రాష్ట్రస్థాయి పోటీల నిర్వహణ బాగుంది. గ్రామస్థులు చూపిన ప్రేమ, ఆప్యాయతలు మరువలేని అనుభూతిని మిగిల్చాయి. నగరాలు, పట్టణాలలో జరిగే రాష్ట్ర, జాతీయస్థాయి యోగా పోటీలు ఓ గ్రామీణ ప్రాంతంలో ఇంత అద్భుతంగా నిర్వహించడం సంతృప్తినిచ్చింది.' అని పలువురు క్రీడాకారులు 'ఆంధ్రజ్యోతి'తో తమ అభిప్రాయాలు పంచుకున్నారు. పంగులూరు మండలం చందలూరులో రాష్ట్రస్థాయిలో 69వ ఎస్‌జీఎఫ్ యోగా పోటీలు నిర్వహించిన సంగతి తెలిసిందే. చందలూరు గ్రామంలో రెండురోజుల క్రీడా పోటీలలో పాల్గొన్న పరిశీలకులు, కోచ్‌లు, మేనేజర్లు, క్రీడాకారులు వసతుల ఏర్పాటు, భోజన సదుపాయం, క్రీడా పోటీల నిర్వహణ పట్ల పూర్తి సంతృప్తిని వ్యక్తం చేశారు.

మరువలేని అనుభూతి



17 ఏళ్లుగా యోగా పోటీలకు వెళుతున్నా. పట్టణాలు, నగరాలలో జరిగే రాష్ట్ర, జాతీయ స్థాయి యోగా పోటీలు నిర్వహిస్తారు. అయితే మారుమూల గ్రామంలో ఇంత అద్భుతంగా నిర్వహించడం గొప్ప విషయం. మేము ఎక్కడ పోటీలకు వెళ్లినా, పాఠశాల భవనాల్లో వసతి కల్పించేవారు. కామన్ టాయిలెట్లతో మేము ఇబ్బంది పడిన సందర్భాలు అనేకం ఉన్నాయి. అయితే ఇక్కడ గ్రామీణ ప్రాంతమైనా చక్కని వసతులు కల్పించారు.

- పి.సుజాత, కోచ్, తూర్పు గోదావరి జిల్లా.

గ్రామస్తులు సొంత బిడ్డలా చూసుకున్నారు



యోగా పోటీలకు వచ్చిన తమకు నివాస గృహాలలో వసతి కల్పించారు. మాకు ఎలాంటి ఇబ్బంది లేకుండా గ్రామస్థులు తమ సొంత బిడ్డలా చూసుకున్నారు. సెలవురోజుల్లో అమ్మమ్మ, నానమ్మల ఇంటికి వచ్చిన అనుభూతి కలిగింది. ఇంటి యజమానులు మా పట్ల చూపిన అభిమానం మరువలేనిది.

- క్రీడాకారిని అమృత, చిత్తూరు.

గ్రామీణ ప్రాంతమనే భావనే కలగలేదు



రాష్ట్ర స్థాయి యోగా పోటీలలో పాల్గొన్న మాకు అధికారులు, గ్రామస్థులు చక్కని వసతి, భోజనం అందించారు. గ్రామీణ ప్రాంతమేనే భావనే మాకు కలగ లేదు. నిత్యం మా పాఠశాలల్లో ఇళ్ల వద్ద సాధన చేసిన మాదిరిగానే ఇక్కడ పోటీలలో పాల్గొన్నాం.

- కోయ చరణ్, పశ్చిమ గోదావరి క్రీడాకారుడు.

బాలికలకు నివాస గృహాల్లో వసతి



యోగా పోటీలలో పాల్గొన్న వివిధ జిల్లాల బాలికలకు నివాస గృహాల్లో వసతి కల్పిచడం సంతోషంగా ఉంది. గ్రామస్థులు ఆదరించిన తీరు, కల్పించిన వసతులు బాగున్నాయి. గ్రామీణ ప్రాంతంలో క్రీడాకారులు, క్రీడల పట్ల ఉన్న ముక్కువను గ్రామస్థుల ఆతిథ్యం చెప్పకనే చెబుతోంది.

- నరేంద్ర జట్టు మేనేజర్, కృష్ణాజిల్లా

రేపు మాగుంట సుబ్బరామిరెడ్డి జయంతి

● హాజరుకానున్న ఎంపీ శ్రీనివాసులురెడ్డి

ఒంగోలు కల్చరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): స్వర్గీయ మాగుంట సుబ్బరామిరెడ్డి 78వ జయంతి కార్యక్రమం బుధవారం నిర్వహిస్తున్నట్లు ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి కార్యాలయం సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ సందర్భంగా ఒంగోలులోని పలు ప్రదేశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమాలలో ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి పాల్గొంటారు. ఉదయం 10 గంటలకు రాంనగర్ 2వ లైనులో కార్యాలయంలో సుబ్బరామిరెడ్డి చిత్రపటానికి ఎంపీ మాగుంట పూలమాల వేస్తారు. అనంతరం అభిలాష్ హోటల్ సెంటర్, రైల్వేస్టేషన్ రోడ్, అద్దంకి బస్టాండ్ సెంటర్లలో ఉన్న మాగుంట సుబ్బరామిరెడ్డి విగ్రహాలకు ఎంపీ పూలమాల వేసి నివాళులర్పిస్తారు. మాగుంట అభిమానులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

మాతృమరణాలను పూర్తిగా నివారించాలి

● డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వర్లు

ఒంగోలు(రూరల్), నవంబరు24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మాతృమరణాలు నివారణే లక్ష్యంగా వైద్యులు, సిబ్బంది పనిచేయాలని డీఎంహెచ్‌వో టి.వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. సోమవారం ఒంగోలులోని జిల్లావైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైరిస్క్ గర్భిణుల ఆరోగ్య స్థితిని ఎప్పటికప్పుడు పరిశీలన చేస్తూ ఉండాలన్నారు. అత్యవసర సమయంలో 108 వాహనాలను, ప్రైవేటు అంబులెన్స్‌లను ఉపయోగించుకోవాలని చెప్పారు. జిల్లాలో మాతృమరణాలు లేకుండా చేయాలని, అవసరమైతే ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో సృజన, డీఐవో కమలశ్రీ, డాక్టర్ చలపతి, డాక్టర్ కమల, డాక్టర్ పి.హేమంత్ తదతరులు పాల్గొన్నారు.

హింసలేని సమాజం కోసం ఉద్యమించాలి

ఒంగోలు(రూరల్), నవంబరు24(ఆంధ్రజ్యోతి): హింసలేని సమాజం కోసం మహిళలు ఉద్యమించాలని బేతూన్ నర్సింగ్ హోమ్ వైద్యశాల డాక్టర్ ఎన్.ఉదయిని పిలుపునిచ్చారు. సోమవారం ఒంగోలులోని బేతూన్‌నర్సింగ్ హోమ్‌లో ఆమె హింసావ్యతిరేక ఉద్యమ కరపత్రాన్ని ఐద్వా నాయకులతో కలిసి ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉదయిని మాట్లాడుతూ మహిళలు, చిన్నారులుపై పెరుగుతున్న హింసను ప్రభుత్వాలు అరికట్టాలన్నారు. మానవ హక్కులను శాంతయుత ఉద్యమాలతో కాపాడుకోవాలని చెప్పారు. కార్యక్రమాలలో నాయకులు కంకణాల రమాదేవి, జి.ఆదిలక్ష్మి, బి.రాజ్యలక్ష్మి, కె.రాజేశ్వరి, పి.నాగేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

స్త్రీనిధి ద్వారా డ్వాక్రా మహిళలకు రుణాలు



మాట్లాడుతున్న ఏపీఎం విజయకుమారి

ఒంగోలు(రూరల్), నవంబరు24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని స్వయం సహాయక సంఘాల గ్రూపు మహిళకు 2025-2026 సంవత్సరానికి స్త్రీనిధి ద్వారా రూ.10కోట్ల రుణాలు మంజూరుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఏపీఎం కె.విజయకుమారి తెలిపారు. సోమవారం ఒంగోలు మండల వెలుగు కార్యాలయంలో వీవోఏలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ రుణాలు చెల్లించినప్పుడు తప్పక రసీదు పొందాలన్నారు. అదేవిధంగా దేవరంపాడు దళితవాడకు సంబంధించిన వెలుగు నిధులు అవకతవకలపై కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామంలో విచారణ చేపడతామన్నారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు ప్రియాంక పాల్గొన్నారు.

పీఎంఈజీపీ స్కీం ద్వారా కారు మంజూరు

మద్దిపాడు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): అన్నంగి గ్రామానికి చెందిన పార శ్రీనివాసరావు పీఎంఈజీపీ స్కీం కింద మద్దిపాడు కెనరా బ్యాంక్ శాఖ ఆధ్వర్యంలో కారు సబ్సిడీతో రుణం మంజూరు చేశారు. ఈమేరకు సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ రాజాబాబు చేతుల మీదుగా కారు తాళాన్ని శ్రీనివాసరావుకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిరుద్యోగ యువకులు, వ్యాపారులు పీఎంఈజీపీ కింద రుణాలను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఔత్సాహికులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నారాయణ, మద్దిపాడు ఏపీఎం కాకుమాను సుబ్బారావు, డీపీఎం దానం రజనీకాంత్, లక్ష్మీరెడ్డి, అంబేడ్కర్, వెంకటసుబ్బయ్య, ప్రేమానందం, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.


ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో జ్యోతి

మద్దిపాడు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం పనులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో జ్యోతి అన్నారు. సోమవారం మల్లవరం గ్రామంలో ఉపాధి హామీ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ వనరులు, సోషల్ మ్యాప్, సీజనల్ మ్యాప్‌ల ద్వారా పనులను గుర్తించి వివరించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రతి గ్రామంలో లేబర్ బడ్జెట్ లక్ష్యం పూర్తికావాలన్నారు. కాలువలు, కుంటలు పూడిక పనులు, నీటిసంరక్షణ, కొత్తకుంటలు, ఇంకుడు గుంతలు, రూఫ్ వాటర్, హార్వెస్టింగ్ పనులు జరగాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సుబ్బారెడ్డి, ఎంపీటీసీ బోయపాటి వీరాంజనేయులు, ఉపాధి ఇంజనీర్ కిషోర్, ఎఫ్‌ఏ నాగరాజు పాల్గొన్నారు.

చర్చి ప్రారంభం



చర్చిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బీఎన్

మద్దిపాడు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): దొడ్డవరప్పాడులోని దళితవాడలో నూతనంగా నిర్మించిన చర్చిని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏసుప్రభు కీర్తనలు అజరామరమని అన్నారు. కార్యక్రమంలో నాయకులు గోరంట్ల చిరంజీవి, దుగ్గినేని నరసింహారావు, ముప్పా రవి, పాస్టర్లు పాల్గొన్నారు.

రేపు ఎస్సీ యువతకు అవగాహన సదస్సు

ఒంగోలు నగరం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): వ్యాపారవేత్తలుగా ఎదగాలనుకునే జిల్లాలోని ఎస్సీ యువతకు అవగాహన సదస్సును నిర్వహిస్తున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్‌నాయక్ సోమవారం తెలిపారు. ఈ నెల 26వ తేదీన సాయంత్రం మూడు గంటలకు స్థానిక ప్రకాశంభవనంలోని పీజీఆర్‌ఎస్ సమావేశం హాలులో ఈ అవగాహన సదస్సు జరుగుతుందన్నారు. వ్యాపారరంగం, మౌలికఅంశాలు, బ్యాంకు రుణం, డీపీఆర్ తయారీ విధానం, ప్రభుత్వాల పథకాలపై అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు.

బాలీవుడ్ నటుడు ధర్మేంద్ర మృతికి సంతాపం

ఒంగోలు కల్చరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రఖ్యాత బాలీవుడ్ నటుడు ధర్మేంద్ర మృతికి జిల్లాకు చెందిన పలువురు కళాకారులు తీవ్ర సంతాపాన్ని తెలియజేశారు. ఆ రోజుల్లో ధర్మేంద్ర నటించిన షోలే చిత్రం ఒంగోలు శ్రీనివాస థియేటర్‌లో వంద రోజులు ప్రదర్శితమైన ఏకైక హిందీ చిత్రంగా నిలిచిందన్నారు. ధర్మేంద్ర మరణం హిందీ సినీరంగానికి తీరనిలోటని పేర్కొన్నారు. సంతాపం ప్రకటించిన వారిలో గాయకులు సాయిమాస్టర్, అన్నమయ్య మురళి, లక్ష్మీతులసి, మనోహర్, సుహాసిని, పి.శ్రావ్య, సంగీత సమాఖ్య ప్రతినిధులు ఎస్.సుకుమార్, ఎస్కే.బాబు, ఎస్‌డీ.ఇస్మాయిల్ ఉన్నారు.

విజ్ఞాన పురోగతితోనే సుస్థిర అభివృద్ధి



కోటేశ్వరరావును సత్కరిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

మద్దిపాడు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): విజ్ఞానశాస్త్రం పురోగతితోనే సుస్థిర అభివృద్ధికి బాటలు వేయగలమని విశ్రాంత ఎంఈవో పీవీ.రాఘవరావు తెలిపారు. సోమవారం మద్దిపాడులోని నటరాజ కళాకేంద్రంలో విశ్రాంత ఉద్యోగి అన్నమనేని కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కనపర్తి సుబ్బారావు, గంగిశెట్టి నరసింహారావు, కటకం వెంకటేశ్వర్లు, షేక్ కలాం, గంటా కోటేశ్వరరావు, నేలటూరి సత్యనారాయణ, ఆరి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయరంగ అభివృద్ధికి కృషి

● 'రైతన్నా మీకోసం' సభలో మంత్రి గొట్టిపాటి రవికుమార్ ● అగ్రహారం భూముల సమస్యను పరిష్కరిస్తాం



మాట్లాడుతున్న మంత్రి రవికుమార్

సంతమాగులూరు సెప్టెంబర్ 24(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని, రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ అన్నారు. సంతమాగులూరు మండలం కొమ్మాలపాడు గ్రామంలో రైతన్నా మీకోసం' కార్య క్రమంలో ముఖ్య అతిథిగా మంత్రి గొట్టిపాటి పాల్గొ న్నారు. ఈ సందర్భంగా మంత్రి రవికుమార్ మాట్లాడు తూ వ్యవసాయ రంగ అభివృద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎంతగానో కృషి చేస్తున్నా రన్నారు. వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా తీర్చిదిం దేందుకు పంటమార్పిడి పైకి అవగాహన కల్పించేందు కు రైతన్న మీకోసం' కార్యక్రమాన్ని చేపట్టినట్లు రవికుమార్ తెలిపారు. వ్యవసాయ అధికారులు సిబ్బంది ప్రతి రైతును కలిసి వ్యవసాయం లాభ సాటిగా మార్చుకునేందుకు ఐదు అంశాలతో కూడిన ప్రాధాన్యతలను తెలియజేస్తు న్నారన్నారు.

అన్నదాత సుఖీభవ కింద అద్దంకి నియోజకవర్గంలో 40228 మంది రైతులకు ప్రయోజనం చేకూరిందని, సంతమాగులూరు మండలంలో 8871 మంది రైతులు లబ్ధి పొందారన్నారు. కొమ్మలపాడు అగ్రహారం భూములలో 1373 మంది రైతులు ఉండగా 966 మంది రైతుల ఖాతాల్లో అన్నదాత సుఖీభవ నగదు జమైనట్లు తెలిపారు. అన్నదాత సుఖీభవ జమ కాని రైతుల సాంకేతిక సమస్యలు ఉన్న 377 మంది రైతులకు కూడా నగదు జమయ్యేలా చూస్తామన్నారు.

గత పాలకుడు జగన్ జమానాలో ఐదేళ్లలో వ్యవసాయ రంగం పూర్తిగా కుదేలైందన్నారు. రైతుల వద్ద నుంచి ధాన్యం సేకరించిన రైతులకు 1870 కోట్లు జగన్ జమానాలో చెల్లించకుండా బాకీలు ఉన్నట్లు తెలిపారు. రైతుశ్రేయస్సు ముఖ్యంగా పరిపాలిస్తున్న కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పాత బకా యిలు రూ.1870 కోట్లను రైతుల ఖాతాలో జమ చేశామన్నారు. పొగాకు రైతులను సంక్షోభం నుండి కాపాడేందుకు దేశంలో మరే రాష్ట్ర ప్రభుత్వం చేయని విధంగా రూ.270 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం భరించి పొగాకు కొనుగోలు చేసిందన్నారు. చిత్తూరు జిల్లాలో మామిడి రైతులకు కూడా రాష్ట్ర ప్రభుత్వం ఆదుకున్న విషయాన్ని మంత్రి రవికుమార్ గుర్తు చేశారు. రైతులకు ఎరువుల సమస్యను కూడా పరిష్కరించినట్లు తెలిపారు. రైతులు అధికారులకు సహకరించి పంటమార్పిడి విధానాన్ని అనుసరించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలన్నారు. కార్యక్రమంలో మార్టూరు ఏడీఏ వ్యవసాయ అధికారి షేక్ సైదా, ఉద్యానవనశాఖ అధికారి హనుమంతనాయక్, తహసీల్దార్ రవిబాబు, సంతమాగులూరు ఏఎంసీ చైర్మన్ తేలప్రోలు రమేష్, టీడీపీ మండల అధ్యక్షుడు చేవూరి వాసురెడ్డి, గ్రామ టీడీపీ కార్యదర్శి కొష్టాల మస్తాన్‌వలి, నాయకులు మోతాదు భాషా, అబ్దుల్ హఫీజ్, బుజ్జి గారి ఖాదర్ మస్తాన్ పాల్గొన్నారు.

రైతులకు అండగా ప్రభుత్వం

అద్దంకిటౌన్ : ప్రభుత్వం రైతుల కొరకు విత్తనం దగ్గర నుంచి పంట అమ్ముకునే వరకు ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. సోమవారం మండలంలోని నాగులపాడు గ్రామంలో పర్యటించిన ఆయన రైతన్న.. మీ కోసం' కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ అధికారులు, సిబ్బందితో కలిసి రైతుల ఇంటి వద్దకు వెళ్లి ముఖ్యమంత్రి సందేశాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా సంబంధిత యాప్‌లో రైతుల వివరాల నమోదును మంత్రి పరిశీలించారు. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం ద్వారా రూ.14 వేలను రైతుల ఖాతాలల్లో జమ చేసినట్లు తెలిపారు. జనవరిలో మరో 6 వేల రూపాయలు అందిస్తామని అధికారులు తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి రవికుమార్ మాట్లాడుతూ వ్యవసాయ సిబ్బంది ప్రతి రైతు ఇంటికి వెళ్లి సాగుకు మంచి చేసే ముఖ్యమంత్రి 5 సూత్రాలను రైతులకు తెలియజేయాలన్నారు. రసాయన ఎరువుల వినియోగం తగ్గించి సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం చేసే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. అర్హులై ఉండి అన్నదాత సుఖీభవ రాని రైతులను సర్వే ద్వారా సేకరించి వారికి పథకం వర్తింప జేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఏవో కె. అన్నపూర్ణ, ఏడీఏ బి. ఎఫ్రాయిమ్, ఏవో కొర్రపాటి వెంకటకృష్ణ, ఉద్యానశాఖ అధికారిణి ఎస్. దీప్తి, బాపట్ల శాస్త్రవేత ఏడుకొండలు, గ్రామ వ్యవసాయ సహాయకులు చాందిని, వీఆర్‌వో అనంతలక్ష్మి, వెటనరీ అసిస్టెంట్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

చీరాలలో వరస దొంగతనాలు

● 35 గ్రాముల బంగారం, రూ.1.25 లక్షల నగదు అపహరణ

చీరాల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : వన్‌టౌన్ స్టేషన్ పరిధిలో సోమ వారం ఒకే రోజు మూడు దొంగతనాలు చోటుచేసుకున్నాయి. అందిన వివ రాల ప్రకారం విఠల్‌నగర్‌కు చెందిన బుర్రి లక్ష్మీ ఇంట్లో రూ.70 వేల నగదు, సుమారు 20 గ్రాముల బంగారం, అలాగే సమీపంలోని బోస్ నగర్‌కు చెందిన రాజు ఇంట్లో రూ.20 వేల నగదు, అంతేకాకుండా హౌసింగ్ కాలనీకు చెందిన వెంకటేశ్వర్లు ఇంట్లో సుమారు రూ.30 వేల నగదుతో పాటు 15 గ్రాములు బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయి. యజమానులు ఇళ్లల్లో లేని సమయంలో ఇంటి తాళాలు పగలకొట్టి ఘటనకు పాల్పడ్డారు. ఈ నివాసాలన్నీ రైల్వే ట్రాక్‌కు సమీపంలో ఉండటంతో పాటు వరుసగా దొంగతనాలకు పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు సీసీ కెమెరాలతో ఆధారాలు సేకరించే పనిలో పడ్డారు.

రేపు మార్టూరులో రైతుల నిరసన

మార్టూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయరంగాన్ని కాపాడు కోవాలని, రైతాంగాన్ని రక్షించుకోవాలని, సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు బుధవారం మార్టూరులో రైతులతో నిరసన కార్యక్రమం చేపట్టినట్లు సోమవారం మార్టూరులో రైతుసంఘం నాయకులు, సీఐటీయూ నాయ కులు ఒక ప్రకటనలో పిలుపు నిచ్చారు. ఈ మేరకు ప్రధాన కూడలిలో కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమానికి మండలంలోని రైతులందరూ తరలిరావాలని వారు కోరారు. కార్యక్రమంలో వీరవల్లి కృష్ణమూర్తి, బత్తుల హనుమంతరావు, సూరిబాబు, శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మయూర వాహన ప్రతిష్ఠ



స్వామివార్ల పూజాకార్యక్రమంలో భక్తులు

పర్చూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కారంచేడు మండలం యర్రంవారిపాలెం గ్రామంలో వేంచేసిన శ్రీ జంట నాగేంద్ర స్వామి వారి దేవస్థానంలో నెమలి వాహన ప్రతిష్ఠ కార్యక్రమాన్ని సోమ వారం అత్యంత ఘనంగా నిర్వహించారు. స్వామివార్ల నెమలి వాహనాన్ని గ్రామానికి చెందిన మువ్వల సంజీవరావు, జయశ్రీ అందజేశారు. అనంతరం శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి వారి కల్యాణ కార్యక్రమాన్ని టీటీడీ వ్యాఖ్యాత ఆలూరు శివకోటేశ్వరరావు మంత్రోచ్చారణ మధ్య అత్యంత వైభవంగా నిర్వహించారు. కల్యాణ కార్యక్రమం అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఆయా గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామివార్ల భక్తిని చాటుకున్నారు.

వైఏ కళాశాలలో వెబ్ డెవలపర్లకు శిక్షణ

చీరాల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : స్థానిక వైఏ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో వెబ్ డెవలపర్ కోర్సులో ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి మాధవీ, కళాశాల ప్రిన్సిపల్ మురళీ తెలిపారు. ఇంటర్, డిగ్రీ పూర్తిచేసిన యువత అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు 7981441777 నంబరును సంప్రదించాలన్నారు.

ఇంకొల్లులో షాపింగ్ కాంప్లెక్సుకు భూమిపూజ



భూమిపూజలో పాల్గొన్న నాయకులు

ఇంకొల్లు, నవంబరు 24,(ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు పంచాయితీ పరిధిలో షాపింగ్ కాంప్లెక్సు నిర్మాణానికి సోమవారం భూమిపూజ చేశారు. స్థానిక స్థూపం కూడలిలో రోడ్డుకు దక్షిణం వైపు ఉన్న ఖాళీ స్థలంలో పంచాయితీ 15వ ఆర్థికసంఘం నిధులతో దుకాణాల సముదాయం గదులు నిర్మాణం చేపట్టనున్నారు. ఒక్కొక గది 12 అడుగుల వెడల్పు, 15 అడుగుల పొడవు ఉండేలా 7 గదులను నిర్మించనున్నట్లు పంచాయితీ కార్యదర్శి అడ్డగడ్డ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ గదుల నిర్మాణానికి సుమారు రూ.25లక్షలు కేటాయించినట్లు తెలిపారు. త్వరలో పనులు పూర్తి చేసిన అనంతరం గదులను అద్దెకు ఇవ్వనున్నట్లు తెలిపారు. టీడీపీ మండల అధ్యక్షుడు నాయుడు హనుమంతరావు సోమవారం భూమిపూజ చేసి నిర్మాణ పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఏజర్ల ప్రసన్న, పీఆర్ జేఈ ఆనంద్, ఎంపీడీవో శ్రీనివాసరావు, కిరణ్, రామసుబ్బారెడ్డి, స్థానిక టీడీపీ నాయకులు కరి శ్రీనివాసరావు, పాలేరు రామకృష్ణ, వలేరు మార్క్, హనుమయ్య, మాబాషా, రఫీ, మీరావలి, శివయ్య, మండవ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ మాసం ప్రారంభం

● వేడుకలకు సిద్ధమవుతున్న చర్చిలు



సెయింట్ మార్క్స్ లూథరన్ చర్చ్ (ఫైల్)

చీరాల, నవంబరు 24 (ఆంధ్ర జ్యోతి) : క్రైస్తవులు అత్యంత ప్రీతిపాత్రంగా భావించే క్రిస్మస్ మాసం మంగళ వారం నుంచి ప్రారం భం కానుంది. అందుకు సంబంధించి ఇప్పటికే క్రైస్తవ ప్రార్థనా మంది రాల వద్ద కోలాహలం నెలకొంది. క్రీస్తు పుట్టుకను సూచిస్తూ, స్టార్ల ఏర్పాటుకు భక్తులు సిద్ధ మయ్యాయరు. వివిధ చర్చిల వద్ద విద్యుత్ దీపాల ఏర్పాటు చేస్తున్నారు.

అధిక బరువుతో రహదారులు ఛిద్రం

దుమ్ముతో ఇబ్బంది పడుతున్న ద్విచక్రవాహనదారులు



కంకరలోడుతో వెళుతున్న టిప్పర్

మేదరమెట్ల, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిలో ప్రయాణిస్తున్న రవా ణా వాహనాలు భద్రత నియమాలను, రహదారి నియమాలను పాటించడం లేదు. మేదరమెట్లలోని కొండ వద్ద ఉన్న కంకర మిల్లుల నుంచి రవాణా వాహనాలు పరిమితి కి మించిన లోడుతో ప్రయాణిస్తున్నాయి. కంకర మిల్లుల వద్ద నుంచి డస్ట్, కంకరతో వెళుతున్న వాహనాలు పైన పట్ట కట్టుకో కపోవడంతో జాతీయ రహదారిలో ప్రయా ణించే ద్విచక్రవాహనదారులు డంపర్ పైన నుంచి వచ్చే దుమ్ము వలన ఇబ్బంది పడుతు న్నారు. గాలి కొట్టినప్పుడు దుమ్ము లేచి ద్విచక్రవాహదారుల కళ్లలో పడుతోంది. వారు అప్రమత్తంగా లేకపోతే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. పరిమితికి మించిన బరువుతో ఈ వాహనాలు ప్రమాణించడం వలన రోడ్లు అన్నీ చిధ్రం అవుతున్నాయి. దాదాపు 60 టన్నులకు పైన ఉన్న వాహనాలు ప్రయాణిస్తుండంతో అనమన మూరు రోడ్డు పూర్తిగా దెబ్బతింది. నూత నంగా నిర్మిస్తున్న ముప్పవరం, కోడికొండ (బెంగుళూరు రహదారి) రహదారి నిర్మాణా నికి ఇక్కడ నుంచే కంకర, ఇతర సామగ్రి తరలి వెళుతోంది. నిత్యం కంకర మిల్లుల నుంచి వందల సంఖ్యలో మెటిరిల్ రవాణా అవుతోంది. రవాణాశాఖ అధికారులు, స్థానిక పోలీసులు వెంటనే స్పందించి అధిక బరువు, పట్టలు కట్టుకోకుండా వెళుతున్న ఈ వాహనాలను నియంత్రించాలని ద్విచక్ర వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

ప్రతి వ్యాపార సముదాయం పన్ను చెల్లింపు పరిధిలో ఉండాలి

ఆదాయపన్ను శాఖ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు



అవగాహన కల్పిస్తున్న అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు

చీరాల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రతి వ్యాపార సంస్థ, వారి వ్యాపార భాగస్వాములు అలాగే రూ.15 వేలకు మించి జీత భత్యాలు అందిస్తున్న సిబ్బందికి సంబం. దించి పన్నులు విధిగా ఈనెల 30వ తేదీ లోగా చెల్లించాలని ఆదాయపన్ను శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఆర్.శ్రీనివాసరావు చెప్పారు. సోమవారం పట్టణంలోని ఆయన కార్యాలయంలో వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ వృత్తి, వ్యాపారం చేస్తున్న వారు నిబంధనలు అనుసరించి పన్ను చెల్లింపులు చేయా లన్నారు. ఏడాదిలో రూ.10 లక్షలకు మించి వ్యాపారా లు నిర్వహిస్తున్న వారు ఏడాదికి ఒక్కసారి మాత్ర మే పన్ను చెల్లించా ల్సి ఉంటుందన్నారు. నెల వారీ చెల్లింపుల్లో ఫారం-1 అనుసరించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్లు మల్లికార్జున, లక్ష్మీకుమార్, గూడ్స్ అండ్ సర్వీస్ టాక్స్ అధికారి జమీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

భూమి ఆక్రమణపై గ్రామస్థుల ఆందోళన



ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

దేవాంగపురి (చీరాల), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : గ్రామానికి చెందిన భూమిని కొందరు ఆక్రమణలకు పాల్పడుతున్నట్లు దేవాంగపురి పంచాయతీ వినాయకపురం గ్రామస్థులు ఆందోళనకు దిగారు. గ్రామస్థులు వివరాల మేరకు... సుమారు 35 సంవత్సరాల క్రితం గ్రామ శివారులోని 1.75 ఎకరాలు భూమిని ఇతరుల నుండి స్వాధీనం అగ్రి మెంట్‌తో కొనుగోలు చేశారు. అయితే అప్పటి నుంచి ఆ భూమికి కొందరు కాపలాగా ఉంటున్నారు. అయితే వాటిని కొద్ది రోజులు గా ఆ భూమి పర్యవేక్షణదారులు చిల్లచెట్లు నరికించి, నేలను చదును చేస్తున్నారు. ఈ క్రమంలో చిన్నగా విషయం గ్రహించ గా, భూమిని ప్లాట్లు గా చేసి విక్రయించనున్నట్లు తెలుసు కున్న గ్రామస్థులు సోమ వారం రోడ్డెక్కారు. పనులను ఉన్నపళంగా నిలిపి వేశారు. ఈక్రమంలో గ్రామస్థులకు పర్యవేక్షణ దారులకు మధ్య వాగ్వా వాదం చోటుచేసుకుంది. అయితే విషయంపై అప్పటి సాక్షులు, పెద్దల సమక్షంలో గురువారం పంచాయతీ చేయనున్నట్లు గ్రామస్థులు చెప్పారు.

అన్నదాత సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి



రైతులకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న అధికారులు

నాగులపాలెం(పర్చూరు), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : అన్నదాతల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని, అందు లో భాగంగా రైతుల సమస్యలను తెలుసు కోవడంతోపాటు, సాగు పరిస్థితిని పరిశీలిం చేందుకు ప్రభుత్వం 'రైతన్న మీకోసం' కార్యక్రమాన్ని తీసుకొచ్చిందని ఏడీఏ ప్రవీణ అన్నారు. అందులో భాగంగా సోమవారం పర్చూరు మండలం నాగులపాలెం గ్రామం లో రైతుల వివరాలు, పంటల సాగు తదితర అంశాలకు సంబంధించిన వివరాలు సేకరిం చి యాప్‌లో నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో ఏవో కె.భాస్కర్‌రావు, రైతులు పాల్గొన్నారు.

'రైతన్నా మీకోసం' ప్రారంభం

చీరాల : అన్నదాతలకు అండగా ఉండి, ప్రతీ ఎకరాకు సాగు నీరు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు ఏడీఏ రత్నకుమారి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రైతన్నా మీకోసం కార్యక్రమం సోమవారం నియో జకవర్గంలో ప్రారంభమైంది. ఈ సందర్భంగా చీరాల మండలంలో ఏవో నిర్మలాదేవీ, వేటపాలెంలో ఏవో సరిత ఆధ్వర్యంలో అధి కారులు ప్రతి ఇంటికి వెళ్లీ ప్రభుత్వం ఇస్తు న్నా భరోసాకు సంబంధించిన కరపత్రాలను రైతులకు అందజేశారు. ప్రభుత్వం నుంచి అందుతున్న పథకాలతో పాటు, సాగు పద్ధతిపై సూచన చేశారు. కార్యక్రమంలో ఆయా ప్రాంతాల కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నాగరాజుపల్లె మాజీ సర్పంచి మృతి

మార్టూరు, నవంబరు24(ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నాయకులు మండలంలోని నాగరాజుపల్లి గ్రామ మాజీ సర్పంచ్ మిన్నెకంటి ఆదెయ్య(75) అనారోగ్యకారణంగా ఆదివారం రాత్రి స్వగృహంలో మృతి చెందారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. గతంలోనే భార్య ఇద్దరు కుమారులు మృతిచెందారు. సోమవారం పార్టీనాయకులు ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు తాటి నాగేశ్వరరావు, కామేపల్లి హరిబాబు, బండి నాగేశ్వరరావు, ముద్దన హనుమంతరావు, షేక్ రజాక్, కామినేని జనార్దన్, కమ్మ శివనాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావిజ్ఞప్తులకు రెండు అర్జీలు అందజేత

ఇంకొల్లు, నవంబరు 24, (ఆంధ్రజ్యోతి) : స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావిజ్ఞప్తులకు రెండు అర్జీలు అందినట్లు తహసీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు. నాగులచెరువు కట్టకు ఉత్తరపు వైపున వర్షపునీరు పోవడం లేదని రైతులు అర్జీలు అందజేశారు. ఇంకొల్లులో ఆర్టీసీ డిపో ఏర్పాటు చేయాలని ఇంకొల్లు మండల ప్రయాణీకుల సంఘం అధ్యక్షులు మోహనకృష్ణ మరో అర్జీ అందజేశారు.

ప్రాంగణ ఎంపికలతో విద్యార్థులకు ప్రయోజనం

● సెయింట్ ఆన్స్ కళాశాల కార్యదర్శి రామకృష్ణారావు

చీరాల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రాంగణ ఎంపికలతో విద్యార్థులకు ఆర్థిక భరోసాతో పాటు నాణ్యమైన అనుభవం ఉంటుందని సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు పేర్కొన్నారు. సోమవారం కళాశాలలో ముంబయి ప్రధాన కేంద్రంగా ఉన్న అలింబిక్ ఫార్మాసూటికల్స్ లిమిటెడ్ కంపెనీ సౌజన్యంతో ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ఈక్రమంలో కళాశాలకు చెందిన బీ ఫార్మసీ విద్యార్థులు 100 మంది, ఎంబీఏకు చెందిన 50 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. వారిని ప్రతినిధులు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డా.జగదీష్, ఎంపికల అధికారి పూర్ణ చంద్రరావు పాల్గొన్నారు.

కమిటీల ప్రతినిధులు పార్టీని బలోపేతం చేయండి

● కేడర్‌తో ఎమ్మెల్యే కొండయ్య సమీక్ష



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : నియో జకవర్గంలో నూతనంగా ఏర్పడిన కమిటీలు పార్టీ బలోపేతంకు ముందుకు సాగాలని ఎమ్మెల్యే కొండయ్య చెప్పారు. సోమవారం నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో క్యాడర్‌తో సమీక్ష నిర్వహించారు. ఇటీవల ఏర్పడిన కమిటీల గురించి మాట్లాడారు. అలాగే వివిధ విభాగాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న కమిటీలపై చర్చించారు. విభేదాలు తలెత్తకుండా గ్రామాల్లో పనిచేయాలని సూచించారు. ఎమ్మెల్యే వెంట పలువురు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

కూటమి ప్రభుత్వంలో దగాపడిన విద్యార్థులు

● వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్



సంతకాలను సేకరిస్తున్న వెంకటేష్

పాతచీరాల (చీరాల), నవంబరు 24 (ఆంధ్ర జ్యోతి) : రాష్ట్రంలో కూట మి ప్రభుత్వం అధికారంలో నికి రావడంతో విద్యార్థులు అన్నివిధాలుగా దగా పడ్డా రని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని పాత చీరాల్లో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ క్రమంలోనే మెడికల్ కళాశాల విధానాలపై వైసీపీ చేపట్టిన ప్రజల నుండి కోటి సంతకాల నిర్వహణ చేశారు. అంతకుముందు వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళులు అర్పించారు. ఆయన వెంట ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

గుండ్లకమ్మ రిజర్వాయర్‌ను సందర్శించిన పాఠశాల విద్యార్థులు



గుండ్లకమ్మ ప్రాజెక్టు వద్ద విద్యార్థులు

చినగంజాం, నవంబరు 24,(ఆంధ్రజ్యోతి) : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు కందుల ఓబుల్‌రెడ్డి గుండ్లకమ్మ రిజర్వాయర్‌ను సోమవారం సందర్శించినట్లు పాఠశాల హెచ్‌ఎం. కొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు భౌగోళిక, పర్యాటక ప్రాంతాల గురించి తెలియజేయటానికి విద్యార్థులను విహారయాత్రకు తీసుకెళ్లామన్నారు. గుండ్లకమ్మ రిజర్వాయర్ ప్రాజెక్టు, పర్యాటక ప్రాంతాన్ని గురించి విద్యార్థులకు వివరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పి.శ్రీలక్ష్మి, సీ.హెచ్.కుమార్, గంటా అంకమ్మ, కృష్ణారావు, చినగంజాం క్లస్టర్ సీఆర్పీ సీ.హెచ్.సురేంద్రకుమార్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పట్టుబడిన మూడు ఇసుక ట్రాక్టర్‌లు

వేటపాలెం(చీరాల), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం పోలీసులకు మూడు అక్రమ రవాణా ఇసుక ట్రాక్టర్లు పట్టుబడ్డాయి. పందిళ్లపల్లి వైపు నుంచి చీరాల వైపుకు జాతీయ రహదారిలో వెళుతుండగా సమాచారం అందుకున్న పోలీసులు వాటిని పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. అలాగే డ్రైవర్‌లను అదుపులోకి తీసుకున్నారు. రవాణాపై ఆరా తీస్తున్నారు.

ఊపందుకున్న మిర్చి సాగు



నూతలపాడులో మిర్చి మొక్కలు నాటుతున్న కూలీలు

పర్చూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : గత రెండు సీజన్లు మిర్చి రైతులకు నష్టాలు మిగిల్చినప్పటికీ, మరో ఏడాది రైతులు సాగుకు ఉత్సాహం చూపుతున్నారు. వచ్చే సీజన్‌కు ధర ఆశాజనకంగా ఉండవచ్చన్న చిన్న దింపుడుకల్లం ఆశ రైతులను ఆ దిశగా ముందుకు నెడు తోంది. మరోవైపు పొగాకు, పత్తి, శనగ వంటి పంటలు సాగు కూడా నష్టాలను మిగిలస్తుండడంతో అని వార్యంగా రైతులు మిరపవైపు మొగ్గ చూపుతు న్నారు.

స్వల్పంగా పెరిగిన ధర

రెండు నెలల క్రిందట క్వింటా రూ.10 నుండి 12వేలకే పరిమితమైన మిర్చి ధర ప్రస్తుతం ఒకింత చురుగ్గా ఉంది. ప్రస్తుతం రూ.15 వేల వరకు ధర పలుకుతోంది. గతంలో పండించిన పంట శీతల గిడ్డంగుల్లో ముగ్గుతున్న ఈ ఏడాది కర్ణాటకలో సైతం మిరప సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. దీంతో భవిష్యత్‌లో ధర వస్తుందన్న ఆశతో రైతులు సాగుకు సన్నద్ధం అవుతున్నారు. మొంథా తుఫాను నాటికి మిరప మొక్క రూ.1కి మించి లేకపోవడంతో పాటు, కొనేదిక్కుకూడా లేకుండా పోయింది. ప్రస్తుతం రైతులు మిర్చి సాగుకు ఆసక్తి చూపుతుండడంతో ప్రస్తుతం మిర్చి మొక్క రూ.2.50 ధర పలుకుతోంది. అయితే ధర ఎంత అయినా సకాలంలో నాటుకునేందుకు రైతులు నారుకోసం పోటీపడుతు న్నారు. గతంలో పండించిన శనగ పంటను కొనేపరిస్థితి లేకపోవటం, నల్లబర్లీ సాగుచేసుకున్న రైతులు కొనేదిక్కులేక నష్టాల ఊబిలో చిక్కుకు పోవటం, ఈఏడాది నల్లబర్లీ పొగాకు సాగును ప్రభుత్వం నిషేధించటంతో రైతులు ప్రత్యామ్నాయం వైపు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఇలాంటి పరిస్థితుల్లో బహిరంగ మార్కెట్‌లో ధర పెరుగుతుండడంతో మిర్చి సాగువైపు రైతులు మొగ్గేలా ప్రస్తుత పరిస్థితి ఉంది. సాగుకు అధిక వ్యయం వెచ్చించాల్సి ఉన్నా కనీస దిగుబడి వచ్చినా మంచి ధర లభిస్తుందన్న ఆశతో రైతులు మిర్చిసాగుకు మొగ్గు చూపుతున్నారు. పర్చూరు వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలోని పర్చూరు, యద్దనపూడి, కారంచేడు మండలాల పరిధిలో మిర్చి సాగు జోరుగా సాగుతుంది. వాతావరణ పరిస్థితులు, తెగుళ్ళు, ధర, మిర్చి రైతులను ఏమేరకు ఒడ్డున చేరుస్తాయో వేచిచూడాల్సి ఉంది




మిరపనారు తీసుకుపోతున్న రైతులు

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వార్తలు

మంగళవారం 25 నవంబరు 2025



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న చేనేత కార్మికులు, బీజేపీ నాయకులు

సోమశిలకు కొనసాగుతున్న వరద

అనంతసాగరం నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి వరద కొనసాగుతోంది. సోమవారం 15,573 క్యూసెక్కుల ప్రవాహం వస్తుండగా, డ్యాంలో 74.398 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ ఉత్తర కాలువకు 500, డెల్టాకు 27,300, కండలేరుకు 750 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

● సంగం బ్యారేజీకి పెరిగిన నీటి ప్రవాహం

సంగం (ఆంధ్రజ్యోతి) : సంగం బ్యారేజీకి వస్తున్న నీటి ప్రవాహం సోమవారం పెరిగింది. సోమశిల నుంచి 27వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం వచ్చి చేరుతోంది. దీంతో నీటిమట్టం 11 అడుగులకు స్థిరీకరించి పలు కాలువలకు నీటిని విడుదల చేస్తున్నారు. కనిగిరి రిజర్వాయర్ కాలువకు 700 క్యూసెక్కులు, కావలి



కాలువకు 700, కనుపూరు కాలువకు 410, నెల్లూరు చెరువు కాలువకు 130, దువ్వూరు కాలువకు 30, నెల్లూరు తాగునీటి పథకం ఇన్‌టెక్ వెల్‌కు 40 క్యూసెక్కులు చొప్పున విడుదల చేస్తున్నారు. మిగతా నీటిని 25 గేట్లు ఎత్తి దిగువ నెల్లూరు బ్యారేజీకి వదిలేస్తున్నారు.

మా ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారు!

అధికారుల తీరుపై చేనేతల ఆగ్రహం

కలెక్టరేట్ ఎదుట రాట్నాలతో ఆందోళన

'తుఫాన్ సాయం ఇవ్వకపోగా, బియ్యం కోసం మగ్గం గుంతలు నిర్మించారని అధికారులు తెలపడం దారుణం. మా ఆత్మగౌరవాన్ని వారు దెబ్బ తీశారు.' అంటూ సోమవారం చేనేత కార్మికులు ఆందోళన చేశారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు ప్రకటించిన విధంగా తమకు తుఫాన్ సాయం అందించాలని వారు డిమాండ్ చేశారు.

వివరాలు 8లో..

ఆడపిల్లకి జై!

లింగ నిష్పత్తి (సెక్స్ రేషియో)లో ఎన్నో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. మగ శిశు జననాల కంటే ఆడ శిశు జననాల రేటు గణనీయంగా పెరుగుతోంది. గతంలో ప్రతి వెయ్యి మంది మగ శివులకు 974 మంది ఆడ శిశువులు పుట్టేవారు. అయితే, సమాజంలో వచ్చిన మార్పులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రోత్సా హంతో ఈ నిష్పత్తిలో తేడా వచ్చింది. గత ఏడాది జిల్లాలో నేషనల్ ఫ్యామిలీ హౌసహోల్డ్ సర్వే (ఎన్ఎఫ్‌హెచ్ఎస్) జరగ్గా, ఇందులో 974 ఉన్న ఆడ శిశు జననాలు 1011లకు పెరిగినట్లు తేలింది. ఇది మంచి శుభపరిణామని మేథావులు చెబుతున్నారు.



లింగ నిష్పత్తిలో వినూత్న మార్పులు

మగ శిశువుల కంటే ఆడ శిశు జననాలే ఎక్కువ

నేషనల్ ఫ్యామిలీ హౌస్‌హోల్డ్ సర్వేలో స్పష్టత



ఇంటింటా సర్వే చేస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది (ఫైల్)

నెల్లూరు (వైద్యం), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఆడపిల్లల జననాల సంఖ్య పెరుగుతోంది. గతంలో దేశంలోనే కాకుండా రాష్ట్రస్థాయిలో మగ శిశు జననాల కంటే ఆడశిశు జననాల వ్యత్యాసం చాలా తక్కువగా ఉండేది. ప్రతి వెయ్యి మంది మగ శిశువుల పుడుతుండగా, ఆడ శిశువులు 974 మంది పుడుతున్నారు. గత ఏడాది ఆయా జననాలతో పోలిస్తే ఎన్నో మార్పులు చోటుచేసుకున్నాయి. మగ శిశువుల కంటే ఆడ శిశు జననాలు ఎక్కువగా నమోదయ్యాయి. ఆడ పిల్లల జననాల శాతాన్ని పెంచితే ఎంతో ప్రయోజనం ఉందని, స్త్రీలను పురుషులతో సమానంగా చూడాలని ప్రభుత్వ ఇస్తున్న పిలుపునకు అనుగుణంగా ఆడ శిశు జననాలు అనూహ్యంగా పెరిగాయి. కేరళాలో వెయ్యి మంది మగ శిశువులు పడుతుండగా 1084 మంది ఆడ శిశువులు జన్మిస్తున్నారు. ఇదొక రికార్డుగా సెక్స్ రేషియోపై కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ఇక రెండవ స్థానంలో పుదుచ్చేరి. ఇక్కడ మగశిశువు జననాల కంటే ఎక్కువగా 1038 ఆడ శిశు జననాలు ఉంటున్నాయి. మన రాష్ట్రంలో ప్రతి వెయ్యి మంది మగ శిశువుల జననాల కంటే ఎక్కువగా 1009 మంది ఆడ శిశులతో నాల్గవ స్థానంలో నిలిచినట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఇది నేషనల్ ఫ్యామిలీ హౌస్‌హోల్డ్ సర్వే (ఎన్ఎఫ్‌హెచ్ఎస్) సర్వే స్పష్టం చేసింది. గత ఏడాది ఓ బృందం జిల్లాలో ఇంటింటికి తిరిగి సర్వే చేసింది. ఏడాది కాలంలో ఇంట్లో ఎన్ని జననాలు జరిగాయి. వారిలో మగ శిశువులు ఎంత మంది? ఆడ శిశువులు ఎందరు!? వారి ఆరోగ్య పరిస్థితి ఎలా ఉంది తదితర విషయాలు సేకరించారు. ఈ సర్వే ప్రకారం మగ శిశువుల జననాల కంటే స్త్రీ శిశు జననాలు రేటు ఎక్కువగా నమోదయ్యింది. భ్రూణ హత్యలు నివారించాలన్న ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్న చర్యలకు అనుగుణంగా ఈ ఫలితాలు వచ్చాయి.

● రాష్ట్రంలోనే నాల్గవ స్థానం

రాష్ట్రంలోని శ్రీకాకుళం జిల్లాలో మగ శివువుల జననాల కంటే ఆడ శిశువుల జననాలు ఎక్కువగా ఉన్నాయి. ప్రతి వెయ్యి మంది మగ శిశువులు పడుతుంటే ఆడశిశువుల పుట్టుక 1163 మందికి చేరి మొదటి స్థానంలో నిలిచింది. కృష్ణా జిల్లాలో 1039 మంది, చిత్తూరు జిల్లాలో ఆడ పిల్లల జననాలు 1019లకు చేరి మూడవ స్థానంలో నిలిచింది. ఇక నాల్గవ స్థానం నెల్లూరు జిల్లాకు దక్కింది. ఇక్కడ వెయ్యి మంది మగ శిశువుల జననాల కంటే ఆడ శిశువులు జననాలు 1011లకు పెరిగింది. జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖ చేపట్టిన చర్యల వల్లే ఇది సాధ్యమైంది. జిల్లాలో 197 స్కానింగ్ సెంటర్లు ఉండగా, ఇప్పటి వరకు 87 కేంద్రాలను తనిఖీ చేసి, గర్భస్థ శిశు నిర్ధారణపై గట్టి చర్యలు తీసుకోవటం, ప్రజల్లో వచ్చిన మార్పుల కారణంగా ఈ జననాలు రేటు పెరిగింది.

మంచి శుభపరిణామం



జిల్లాలో ఆడశిశువుల జన నాలు పెరిగాయి. ఇది మం చి శుభ పరిణామం. జిల్లా లో ఉన్న స్కానింగ్ సెంటర్లను తరచూ ఆకస్మిక తని ఖీలు చేయటం, భ్రూణ హత్యలను నివారించటం వల్ల ఈ ఫలితాలు వచ్చాయి. పైగా ప్రభుత్వం కూడా స్త్రీ జననాల రేటును ప్రోత్సహించటం కూడా ఈ మార్పులకు కారణం.

- డాక్టర్ సుజాత, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి



డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఫైళ్లను పరిశీలిస్తున్న ఆడిటింగ్ బృందం

ఏ విభాగానికి ఎంత ఖర్చు చేశారు!?

నెల్లూరు (వైద్యం) నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో సోమవారం ఏపీ స్టేట్ ఆడిటింగ్ బృందం ముమ్మరంగా తనిఖీలు చేపట్టింది. విజయవాడకు చెందిన సీనియర్ ఆడిటింగ్ అధికారి హుస్సేన్ అహ్మద్, అసిస్టెంట్ ఆడిటింగ్ అధికారి ప్రదీప్‌లు డీఎంహెచ్‌వో కార్యాలయానికి చేరుకుని జాతీయ ఆరోగ్య మిషన్‌కు సంబంధించి అన్ని ఖర్చుల వివరాలు సేకరిస్తున్నారు. ఏఏ విభాగానికి ఎంత ఖర్చు చేశారో ఆ వివరాలు సేకరిస్తున్నారు. వారం రోజులపాటు అన్ని ఖర్చులు, బడ్జెట్ వివరాలు పరిశీలించనున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు కూడా వెళ్లి అక్కడ ఖర్చుల వివరాలను సేకరించనున్నారు. వీటి ఆధారంగా వైద్య ఆరోగ్యశాఖపై ఓ రిపోర్టు తయారు చేసి రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులకు నివేదించనున్నారు.

మేయర్‌గా స్రవంతి వద్దు!

- జేసీకి అవిశ్వాస లేఖను అందజేసిన కార్పొరేటర్లు
- స్రవంతి అవినీతిపైనా విచారణ చేయాలని డిమాండ్
- సొంత పార్టీలోనూ దక్కని మద్దతు

నెల్లూరు (సిటీ), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు మేయర్ పోట్లూరి స్రవంతిని ఆ పదవి నుంచి దించేయాలని కోరుతూ అధికార టీడీపీకి చెందిన ఇద్దరు డిప్యూటీ మేయర్లతో పాటు కార్పొరేటర్లు జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లుకు అవిశ్వాస లేఖ అందచేశారు. సోమవారం నెల్లూరురూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డితో తన కార్యాలయంలో భేటీ అయిన 40 మంది కార్పొరేటర్లు అక్కడ నుంచి బృందంగా కలెక్టరేట్‌కు వచ్చారు. ముందుగానే సంతకాలతో సిద్ధం చేసుకున్న లేఖను జేసీకి అందచేశారు. స్రవంతిని మేయర్ పదవి నుంచి తొలగించాలని, అందుకు అవిశ్వాస తీర్మాణం ప్రవేశపెట్టి ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. తమ మద్దతును ఉపసంహరించుకుం టున్నట్లు స్పష్టం చేశారు. అనంతరం బయటకు వచ్చి డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ మీడియాతో మాట్లాడారు. దేశ, రాష్ట్ర రాజకీయాల్లో ఎక్కడ, ఎప్పుడు జరగనంత అవినీతి మేయర్ స్రవంతి దంపతులు చేశారని తెలిపారు. భవన నిర్మాణాల్లో మార్టిగేజ్ విడుదల పత్రాల్లో ఏకంగా ఐఏఎస్ అధికారి సంతకాలనే ఫోర్జరీ చేసే స్థాయికి వారు వెళ్లారని ఆరోపించారు. గిరిజన మహిళ అయివుండి కూడా పారిశుధ్య కార్మికుల్లో గిరిజనులకు వారసత్వ ఉద్యోగాలు ఇవ్వడంలోనూ అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. మరింత కాలం ఆమెను ఆ పదవిలో కొనసాగిస్తే ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని, కార్పొరేటర్లు తమ డివిజన్లలో తలెత్తుకు తిరగలేని దుస్థితి వచ్చిన నేపథ్యంలో



జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్లు

మంత్రి నారాయణ, రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డిలు మేయర్ పదవి నుంచి ఆమెను తొలగించాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఆ మేరకు అవిశ్వాసం కోరుతూ లేఖ అందజేసినట్లు చెప్పారు. అనంతరం మరో డిప్యూటీ మేయర్ తహసీన్, కార్పొరేటర్లు మేయర్ అవినీతి పై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, మాజీ మేయర్ భానుశ్రీ, టీడీపీ నాయకులు విజయ భాస్కర్‌రెడ్డి, పట్టాభిరామిరెడ్డి, జలదంకి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

● వైసీపీలోనూ దక్కని మద్దతు

మేయర్ స్రవంతి తీరు పట్ల వైసీపీ జిల్లా నాయకత్వం మిన్నకుండిపోయింది. ఆమెకు తమ పార్టీ

- మిగతా 8లో..



చిట్రగుంట : బోగోలు మండలం వీఎన్‌ఆర్‌పేటలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

ఊరూరా 'రైతన్నా మీకోసం..'

జిల్లావ్యాప్తంగా రైతన్నా మీకోసం కార్యక్రమం అట్టహాసంగా సోమవారం ప్రారంభమైంది. వెంకటాచలం మండలం కనుపూరులో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఉలవపాడు మండలం పెద్దపట్టపుపాలెం గ్రామంలో ఇంటూరి నాగేశ్వరావు, వింజమూరు మండలం చంద్రపడియలో ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, నెల్లూరు రూరల్ మండలం మొగళ్ళపాళెంలో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కోవూరు మండలం లేగుంటపాడులో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి జిల్లావ్యాప్తంగా అధికారులు, ప్రజాప్రతినిధులు ఇంటింటా తిరుగుతూ రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు.

- వివరాలు లోపలిపేజీల్లో

ఈసారి గోదాముల్లో..!

- ఉదయగిరిలో 200 టన్నుల రేషన్ బియ్యం పక్కదారి
- పూర్తిస్థాయి విచారణకు జాయింట్ కలెక్టర్ ఆదేశాలు
- ఎంత చేసినా ఆగని రేషన్ మాఫియా ఆగడాలు
- పౌరసరఫరాల శాఖలోనూ అంతే!

నెల్లూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పేదల బియ్యానికి రెక్కలు వస్తున్నాయి. ప్రతీ నెలా వేల టన్నుల పీడీఎస్ బియ్యం మాఫియా చేతుల్లోకి వెళతుందన్నది బహిరంగ రహస్యం. ఇందుకు మండల స్థాయి స్టాక్ (ఎంఎల్ఎస్) గోదాములు, రేషన్ షాపులే కేంద్రాలుగా మారుతున్నాయి. ఉదయగిరి ఎంఎల్ఎస్ గోదాములో ఏకంగా 200 టన్నుల వరకూ రేషన్ బియ్యం మాయమవడం సంచలనం కలిగిస్తోంది. గోదాములో పనిచేసే సిబ్బంది ఇలా చేశారా!? లేక రేషన్ అక్రమార్కులు బరి తెగించారా..? అన్నది పక్కన పెడితే పేదల బియ్యం ఎంత దర్జాగా పక్కదారి పడుతోందో స్పష్టమవుతోంది. తిలాపాపం తలా పిడికెడు అన్నట్లుగా పౌరసరఫరాల శాఖ ఉద్యోగులు, రేషన్ మాఫియా కుమ్మక్కై రూ.కోట్ల పేదల బియ్యాన్ని బహిరంగ



సీల్ వేసిన ఉదయగిరి ఎంఎల్ఎస్ గోదాము

మార్కెట్లోకి తరలించి సొమ్ము చేసుకుంటున్నారన్న ఆరోపణలకు ఈ ఘటన బలం చేకూరుస్తోంది. అయితే ఒక్క ఉదయగిరిలోనే ఇన్ని టన్నుల బియ్యం లెక్క తేలడం లేదంటే ఇక జిల్లాలోని మిగిలిన గోదాముల్లో పరిస్థితి ఏమిటన్నది చర్చనీయాంశంగా మారింది. ఉదయగిరి గోదాముకు అధికారులు సీల్ వేశారు. వచ్చే నెలకు అవసరమైన బియ్యం లారీల్లో ఆ గోదాముకు చేరుకోగా ఇప్పుడు అన్‌లోడ్ చేసుకునే పరిస్థితి కనిపించడం లేదు.

● అధికారుల్లో రాని మార్పు

ఇటీవల నెల్లూరులో ఐదు లారీల బియ్యాన్ని పట్టుకున్న అధికారులు అందులో రెండు లారీల్లో రేషన్ బియ్యం ఉన్నట్లు ప్రకటించారు. రాజకీయ ఒత్తిళ్లతో మిగిలిన మూడు లారీల్లో ఉన్న బియ్యం రేషన్ బియ్యం కాదని ప్రకటించారన్న విమర్శలున్నాయి. కూటమి పార్టీల్లోనే ఇది రాజకీయ చర్చకు దారి తీసింది. ఈ ప్రభావం రాష్ట్రస్థాయిలో కనిపించింది. ఏకంగా పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ జోక్యం చేసుకొని అసలు నెల్లూరులో ఏం జరుగుతోందన్నది నివేదిక తెప్పించుకున్నారు. ఈ క్రమంలో అప్పటి జిల్లా

- మిగతా 7లో..

లెక్కల్లో తేడా వచ్చిన మాట వాస్తవమే

ఉదయగిరి ఎంఎల్ఎస్ పాయింట్లో బియ్యం లెక్కలపై విచారణ జరుగుతోంది. ప్రాథమిక నివేదిక ప్రకారం సుమారు 2 వేల బస్తాల వరకూ బియ్యం కనిపించడం లేదని తేలింది. పూర్తిస్థాయి విచారణ చేసి నివేదిక ఇవ్వాలని సివిల్ సప్లయిస్ డీఎంను ఆదేశించాం. ఆ నివేదిక ప్రకారం చర్యలు తీసుకుంటాం. అలానే జిల్లాలోని అన్ని గోదాముల్లో బియ్యం నిల్వలను పరిశీలించాల్సిందిగా ఆదేశాలిచ్చాం.

- ఎం వెంకటేశ్వర్లు, జాయింట్ కలెక్టర్

ఆయిల్ పామ్‌కు రాయితీలు 8

1231 జాబ్‌కార్డుల తొలగింపు

ఉదయగిరి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఉదయగిరి మండలంలోని 17 పంచాయతీల్లో 1,231 జాబ్‌కార్డులు తొలగించినట్లు ఎంపీడీవో బీ శ్రీనివాసు లు సోమవారం తెలిపారు. మండలంలో మొత్తం 14,631 జాబ్‌కార్డులు ఉండగా వాటిలో 9,721 జాబ్‌కార్డలకు ఈకేవైసీ పూర్తవ్వగా ఇంకా 3,679 జాబ్‌కార్డులకు ఈకేవైసీ చేయాల్సి ఉందన్నారు. ఈకేవైసీ విధా నం ద్వారా బినామీ మస్టర్లను పూర్తిగా నిరోధించడం జరుగుతుందన్నా రు. అందులో భాగంగా 1,231 జాబ్‌కార్డులు తొలగించినట్లు తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	115
స్కిన్ చికెన్	210
స్కిన్‌లెస్	234

కోడిగుడ్ల ధర (100): 660

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కందుకూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కందుకూరు పట్టణంలో జరుగుతున్న రోడ్ల విస్తరణ పనుల్లో భాగంగా లైన్‌వర్క్ ఉన్నందున ఓవీ రోడ్డులోని సీటీఆర్ఐ ఫీడర్, పామూరురోడ్డు ఫీడర్లలో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేయను న్నట్లు టౌన్ ఏఈఈ టీవీ నరసింహం ఓ ప్రకటనలో తెలిపారు. సీటీఆర్ఐ ఫీడర్‌లో ఉదయం 9.30 నుంచి, సాయంత్రం 4.30 గంటల వరకు, పామూరు రోడ్డులో ఉదయం నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు. ఈ ఫీడర్ల పరిధిలోని ప్రజలు సహకరించాలని పేర్కొన్నారు.

ఎమ్మెల్యే ఇంటూరిని కలిసిన జడ్పీ సీఈవో

కందుకూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): నెల్లూరు జడ్పీ సీఈవో ఎల్.శ్రీధర్‌రెడ్డి సోమవారం సాయంత్రం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిశారు. జడ్పీ నుంచి కందుకూరు నియోజకవర్గానికి రావాల్సిన నిధులు, అభివృద్ధికి సంబంధించి ఇతర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా జడ్పీ సీఈవోను ఎమ్మెల్యే శాలువాతో సత్కరించారు.



నిండుకుండలా రాళ్లపాడు ప్రాజెక్టు

రాళ్లపాడు ఆయకట్టులో

తగ్గనున్న వరి సాగు!

● వరి పైరుకు పెట్టుబడులు అధికం.. మద్దతు ధర శూన్యం ● 40 శాతం రైతులు పత్తి సాగుపై ఆసక్తి

● ఆశాజనకంగా దిగుబడులు, గిట్టుబాటు ధరే కారణం

లింగసముద్రం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రాళ్లపాడు ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలో ఈ ఏడాది వరి సాగు ఘననీయంగా తగ్గనుంది. దానికి ప్రత్యామ్నాయంగా పత్తి సాగు చేసేందుకు రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. వరి సాగుకు అధిక పెట్టుబడులు పెట్టాల్సి రావడం, మద్దతు ధర అంతంత మాత్రంగానే ఉండడం.. పత్తి సాగులో ఖర్చు తక్కువతో పాటు దిగుబడులు ఆశాజనకంగా ఉండడం, మంచి గిట్టుబాటు ధర లభిస్తుందన్న ఉద్దేశంతో రైతులు వరికి ప్రత్యామ్నాయంగా పత్తిని ఎంచుకున్నట్లు తెలుస్తోంది. దీంతో దాదాపు 40 శాతం మంది రైతులు పత్తిసాగుపై ఆసక్తి చూపుతున్నారు. మొంథా తుపాను ప్రభావంతో రాళ్లపాడు ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 20 అడుగులకు నీరు చేరడంతో నిండుకుండను తలపిస్తోంది. దీంతో ప్రాజెక్టు కుడి ఎడమ కాలువల ఆయకట్టు పరిధిలో రైతులు వ్యవసాయ పనుల్లో పూర్తిగా నిమగ్నమయ్యారు.అయితే ప్రాజెక్టులో అధికారిక ఆయకట్టు 16 వేల ఎకరాలు, అనధికారికంగా మరో తొమ్మిది వేల ఎకరాల్లో రైతులు వరి, పత్తి పైర్లు ప్రతి ఏటా సాగు చేస్తారు. ఈ ఏడాది ప్రాజెక్టులో ఉన్న 20 అడుగుల నీటితో పాటు, అవసరమైతే సోమశిల ప్రాజెక్టు నుంచి ఇంకా నీరు వచ్చే అవకాశం ఉంది. దీంతో రైతులకు సాగునీటికి ఎలాంటి సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం లేదు. అయినా రైతులు దాదాపు 9000 వేల ఎకరాల్లో వరి, 7000 ఎకరాల్లో పత్తి పైరు సాగు చేయనున్నట్లు ప్రాజెక్టు అధికారులు చెబుతున్నారు. ఇందులో లింగసముద్రం మండలంలో ఎక్కువగా ఎడమ కాలువ పరిధిలో 1300 ఎకరాలు, కుడి కాలువ పరిధిలో 7700 ఎకరాలలో లింగసముద్రం, కొండాపురం, గుడ్లూరు మండలాల్లోని పలు గ్రామాల రైతులు వరి సాగు చేయనున్నారు.

● ఖర్చు ఎక్కువైనా తిండికి, పశుగ్రాసం కోసం తప్పదు

వరి పైరు సాగుకు ఖర్చు ఎక్కువైనా, తిండి గింజలు, పశుగ్రాసం కోసం సాగు చేయక తప్పదని రైతులు చెబుతున్నారు. ఒక్కో ఎకరా వరి పైరు సాగుకు రూ.30 వేలకు పైబడి ఖర్చు అవుతుందని, దిగుబడులు, మద్దతు ధర ఆశాజనకంగా లేకపోయినా, తిండి గింజల కోసం, పశుగ్రాసానికి వరి పైరు పండించక తప్పదని రైతులు చెబుతున్నారు. పెద్దగా లాభాలు లేకపోయినా, ఈ రెండు కారణాలతో వరి సాగు చేస్తున్నట్లు చెబుతున్నారు. అందులోనూ ఈ సారి ఎక్కువగా కేఎన్ఎం 1630 రకం కొత్త వరి వంగడాన్ని సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. అయితే ఈ రకం వరి ఎకరాకు 25 క్వింటాళ్ల ధాన్యం దిగుబడి అయ్యే అవకాశం ఉండగా క్వింటా ధర ప్రస్తుతం రూ.2000 కంటే తక్కువ ఉంది. దీంతో ఎకరాకు ఖర్చులు పోను రూ.15 వేల నుంచి రూ.20 వేల కంటే ఎక్కువ లాభాలు రావడం లేదు.

● గుడ్లూరు మండల పరిధిలో అధికంగా పత్తి సాగు

అయితే ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలోని లింగసముద్రం మండలంలోని అన్నెబోయినపల్లిలో సగం, సత్యనారాయణపురం, గుడ్లూరు మండల పరిధిలో సీతారాంపురం, పూరేటిపల్లి తదితర గ్రామాల రైతులు ఎక్కువగా పత్తి పైరు సాగు చేస్తారని అధికారులు తెలిపారు. ఈ భూములు ఎక్కువగా పత్తి పైరు సాగుకు అనుకూలంగా ఉంటాయని, పత్తి దిగుబడులు కూడా బాగుంటాయని అంటున్నారు. ఒక్కో ఎకరా పత్తి సాగుకు రూ.20 వేల నుంచి రూ25 వేలు ఖర్చు అయినప్పటికీ ఎకరాకు 15 నుంచి 20 క్వింటాళ్ల దిగుబడి ఉంటుంది. ప్రస్తుతం పత్తి క్వింటా రూ.7 వేల నుంచి రూ.8 వేల వరకు ఉంది. దీంతో ఎకరాకు ఖర్చులు పోను రూ.కనీసం రూ.50 వేల వరకు లాభాలు వచ్చే అవకాశం ఉంది. దీంతో పత్తి సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. కాగా అధిక శాతం పత్తిసాగుకు రైతులు మొగ్గు చూపుతుండడంతో ఈ ఏడాది వరి సాగు విస్తీర్ణం తగ్గుముఖం పడుతుండడంతో వరికి సాగు నీటి సమస్యలు వచ్చే అవకాశం లేదు.



అన్నెబోయినపల్లి మాగాణి భూముల్లో వరి నారుమడి

ఆంజనేయ స్వామి ఆలయంలో ధర్మ ధ్వజస్తంభం ప్రారంభం



ఆంజనేయస్వామి ఆలయం వద్ద ధర్మధ్వజస్తంభం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దగుమాటి క్రిష్ణారెడ్డి

కావలిరూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని రుద్రకోటలోని అయ్యప్పస్వామి ఆలయ ప్రాగణంలోని ఆంజనేయస్వామి ఆలయానికి భక్తుడు మూలంరెడ్డి కామేశ్వరరెడ్డి విరాళంతో ఏర్పాటు చేసిన ధర్మధ్వజస్తంభాన్ని సోమవారం ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి ప్రారం భించారు. గ్రామానికి చేరుకున్న ఆయన అయ్యప్పస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నూతన గోశాల పనుల నిర్మాణంతో పాటు ఆలయ అభివృద్ధికి ఎమ్మెల్యే ఇచ్చిన రూ.5 లక్షలతో నిర్మిస్తున్న ప్రహరీ నిర్మాణాన్ని, అన్నసంతర్పణ కార్యక్రమాన్ని పరిశీలిం చారు. ఆలయ అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తున్న ఎమ్మెల్యేకు ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు కావలి కాలువకు నీటి విడుదల

జలదంకి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలం అన్నవరం వద్ద చిన్నక్రాక బ్యాలెన్సింగ్ రిజర్వాయరు నుంచి కావలి కాలువ దిగువ ప్రాంతానికి మంగళవారం ఉదయగిరి, కావలి ఎమ్మెల్యేలు కాకర్ల సురేష్, డీవీ.కృష్ణారెడ్డిలు సాగునీరు విడుదల చేయనున్నట్లు సోమశిల ప్రాజెక్టు వైస్‌చైర్మన్ పీ.మధుమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. బ్యాలెన్సింగ్ రిజర్వాయరు ఔట్‌ఫాల్ గేట్లు ఎత్తి బ్రాహ్మణక్రాక, గౌరవరం మేజర్ కాలువలకు సాగునీరు విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి మండలంలోని అన్ని నీటి సంఘాల బాధ్యులు, కూటమి పార్టీ నాయకులు హాజరు కావాలని తెలిపారు.

బస్సు ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన ఉండాలి

● ఆర్టీవో మురళీధర్



ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఆర్టీవో మురళీధర్, అధికారులు

కావలి రూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): బస్ ప్రమాదాల నియంత్రణ పట్ల పాఠశాలలు, కళాశాలల యజమానులు, డ్రైవర్లు అవగాహన కలిగి ఉండాలని ఆర్టీవో మురళీధర్ పేర్కొన్నారు. పట్టణ సమీపంలోని ముసునూరు టోల్‌ప్లాజా వద్ద సోమవారం అగ్నిప్రమాదాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ వాడకంపై వాహనదారులకు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్టీవో మాట్లాడుతూ బస్‌ల్లో అగ్ని ప్రమాదాల నియంత్రణ కిట్లతో పాటు మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచుకోవాలని, ఎమర్జన్సీ డోర్లు పని చేసేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, బస్‌ల్లో ప్రయాణించే విద్యార్థులకు అగ్నిప్రమాదాల నియంత్రణ కిట్ల వాడకం, ప్రమాదాల సమయంలో ఎమర్జనీ డోర్ల వాడకంపై అవగాహన కల్పిస్తుండాలని సూచించారు. పాఠశాలల బస్‌లు తనిఖీ చేసి ప్రభుత్వ నిబంధనలు పాటించకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐలు సుందరరావు, అసిస్టెంట్ ఎంవీఐలు కరుణాకర్, లక్ష్మీభాయ్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో పలు కుటుంబాల చేరిక



ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో టీడీపీలో చేరుతున్న తెట్టు ఎస్టీ కాలనీ వాసులు

కందుకూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): గుడ్లూరు మండలం తెట్టు ఎస్టీ కాలనీకి చెందిన పలు కుటుంబాల వారు వైసీపీని వీడి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో సోమవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. స్థానిక పార్టీ కార్యాలయానికి వచ్చి టీడీపీలో చేరేందుకు సంసిద్ధత వ్యక్తం చేయగా ఎమ్మెల్యే నాగేశ్వరరావు వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొత్తగా పార్టీలో చేరిన వారందరికీ సముచిత స్థానం కల్పిస్తామని, పాత కొత్త నాయకులంతా కలిసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. పార్టీలో చేరిన కన్నెగంటి చిన్నబ్బాయి, చేవూరి చెంచయ్య, పొట్లూరి సుబ్బయ్య, మానికల శివకృష్ణ, కన్నెగంటి శ్రీనివాసులు, చలంచర్ల శివ, యానాది, రమణమ్మ, నరసమ్మ తదితరులు మాట్లాడుతూ రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధికి, పేదప్రజల సంక్షేమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు చేస్తున్న కృషికి ఆకర్షితులమై వైసీపీని వీడి టీడీపీలో చేరాలని నిర్ణయించుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మద్దసాని శ్రీనివాసులు, గొత్తుల వెంకటరావు, గోచిపాతల కోటేశ్వరరావు, మద్దసాని వెంకటేశ్వర్లు, జాలరామయ్య, చిన్నబ్బులు, పెద్దబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

మల్లేశ్వరస్వామి ఆలయ హుండీ లెక్కింపు



హుండీలో కానుకలు లెక్కిస్తున్న భక్తులు

కావలి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాతూరు మల్లేశ్వరస్వామి (శివాలయం) ఆలయం దేవాదాయశాఖలో కలిపిన తర్వాత తొలిసారిగా సోమవారం హుండీ లెక్కింపు జరిగింది. దేవాదాయశాఖ కోవూరు ఇన్‌స్పెక్టర్ కే.నాగమల్లేశ్వరరాజు సమక్షంలో ఆలయ ఈవో అరవ రాధాకృష్ణ, వ్యవస్థాపక ధర్మకర్త కసవరాజు క్రిష్ణమోహన్, ప్రధాన అర్చకులు శశిగురుకుల్, సిబ్బంది, బ్యాంక్ సిబ్బంది, భక్తులు హుండీ లెక్కింపులో పాల్గొన్నారు. ఆలయంలో జూన్ 5న హుండీలు ఏర్పాటు చేశా రు. అప్పటి నుంచి 172 రోజుల తర్వాత హుండీ లెక్కింపు జరుగగా భ క్తులు సమర్పించిన కానుకల ద్వారా రూ.7.90 లక్షలు ఆదాయం వచ్చిం ది. వివిధ సేవలకు ఆన్‌లైన్ ద్వారా రూ.6.13 లక్షలు రాగా మొత్తం ఆలయానికి రూ.14.03 లక్షల ఆదాయం చేకూరిందని ఈవో తెలిపారు.

మాదక ద్రవ్యాలపై అవగాహన



మాట్లాడుతున్న రెండవ పట్టణ ఎస్ఐ గౌస్‌బాషా

కావలి(టౌన్), నవంబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణ పెంకుల ఫ్యాక్టరీ గిరిజన కాలనీలో సోమవారం జేబీ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం, మాదక ద్రవ్యాల వాడకంపై అవగాహన సదస్సు జరిగింది. రెండవ పట్టణ ఎస్ఐ గౌస్‌బాషా మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే నష్టాలు దుష్పరిమాణాల గురించి వివరించారు. డాక్టర్లు వెంకటేశ్వర్లుబాబు, మహేష్, మోహన్, మేఘనాథ్‌లు పాల్గొని కంటి వైద్యం, దంత ఆరోగ్యం, మధుమేహం, రక్తపోటు, సీజనల్ వ్యాధుల గురించి అవగాహన కల్పించి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జేబీ ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం నాయుడు, స్వయం ఉపాధి కోర్సుల సంచాలకులు మాల్యాద్రి, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు నాగేశ్వరరావు, అయూబ్, రామ్‌సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహర్ రెడ్డి, వీడీ ప్రసాద్ రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

● కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

ఉలవపాడు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. సోమవారం పెద్దపట్టపుపాలెంలో రైతన్నా-మీకోసం కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఇంటింటికి తిరిగి రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన పథకాలను తెలియజేస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం జరిగిన గ్రామసభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటికే అన్నదాత సుఖీభవ నిధులు రెండో విడత విడుదల చేశారన్నారు. గ్రామాల్లో చెరువులు, పంట కాలువల పటిష్టతకు ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. రైతు రథం పథకం కింద వ్యవసాయ పనిముట్లు, ట్రాక్టర్లు పంపిణీ చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకే దక్కిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో రైతులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. మత్స్యకారులకు అన్యాయం చేసేలా జగన్ తీసుకొచ్చిన 217 జీవోని కూటమి ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్య శాఖ అధికారి కే.శాంతి, పశుసంవర్థక శాఖ ఏడీఏ సురేష్‌నాయుడు, వ్యవసాయశాఖ ఇన్‌చార్జ్ ఏడీఏ కేవీ.శేషారెడ్డి, ఏవో విజయ్‌కుమార్ పాల్గొన్నారు. తొలుత ఉలవపాడులోని జాతీయ రహదారిపై నూతనంగా నిర్మించిన మనిక్ రెస్టారెంట్‌ను ఎమ్మెల్యే ఇంటూరి ప్రారంభించి అక్కడి నుంచి కరేడు గ్రామంలో రూ.16 లక్షల నిధులతో సీసీ డ్రైన్ పనులకు శంకుస్థాపన చేశారు.

● **బిట్రగుంట :** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రైతన్న మీ కోసం కార్యక్రమంలో భాగంగా సోమవారం బోగోలు మండలం విశ్వనాథరావుపేటలో మండల వ్యవసాయాధికారి బీ.శైలజ రైతు సంక్షేమ పథకాలపై రైతులకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు, కావలి ఏఎంసీ డైరెక్టర్ ఎల్.సుధీర్ బాబు, రైతు నేతలు సనిగంటి శ్రీనివాసులు, తోట సాయి ప్రసాద్, ఇందుపూరు తిరుపతిరెడ్డి, వీఆర్వో రాంమోహన్, సిబ్బంది పాల్గొన్నారు.



కొండాపురం : పథకాల కరపత్రాలు రైతులకు అందచేస్తున్న సచివాలయ ఉద్యోగి నరేంద్ర

● **కొండాపురం :** మండలంలోని సాయిపేట పంచాయతీ మక్కెనవారిపాలెంలో రైతన్న మీకోసం కార్యక్రమాన్ని సచివాలయ వీఏఏ నరేంద్ర నిర్వహించారు. రైతులకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా టెలికాం అడ్వైజరీ బోర్డు మెంబరు తాటికొండ అనూష, గ్రామ రైతులు పాల్గొన్నారు.

నేడు పూరేటిపల్లిలో..

● **గుడ్లూరు :** మండలంలోని పూరేటిపల్లిలో మంగళవారం నిర్వహించనున్న రైతన్న మీకోసం కార్యక్రమంలో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొంటారని మండల వ్యవసాయ శాఖ అధికారి రవికుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని రైతులు విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

గ్రావెల్ టిప్పర్లు, ఎక్స్‌కవేటర్ పట్టిస్తే.. వదిలేస్తారా?

● దళితులంటే అంత చులకనా? ● ఆర్డీవో కార్యాలయంలో నేలపై కూర్చుని నిరసన తెలిపిన దళిత సంఘం నేతలు

కావలి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కావలి రూరల్ ప్రాంతంలోని రుద్రకోటలో దళితుల భూముల్లో అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న టిప్పర్లు, ఎక్స్‌కవేటర్‌ను దళితులు పట్టుకుని అధికారులకు అప్పగిస్తే వాటిని వదిలి వేస్తారా..? దళితులంటే ఇంత చులకనా.. అంటూ దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికలో భాగంగా రుద్రకోట దళితులతో కలిసి కావలి ఆర్డీవో ఎం. సన్నీ వంశీక్రిష్ణకు వినతిపత్రం అందచేశారు. దళితులు పట్టించిన టిప్పర్లను అధికారులు వదిలివేయడాన్ని నిరసిస్తూ ఆర్డీవో కార్యాలయ సమావేశ మందిరంలో నేలపై కూర్చుని నిరసన తెలిపారు. అనంతరం మల్లి మాట్లాడుతూ ఈనెల 21న రుద్రకోటలో దళితులకు ఇచ్చిన సీజేఎఫ్ఎస్ భూములలో 350 ఎకరాలలో గ్రావెల్ అక్రమంగా కావలికి తరలిస్తుండగా ఆగ్రామ దళితుల వాటిని అడ్డుకుని అధికారులకు అప్పగించారన్నారు. అధికారులు ఎలాంటి ఒత్తిడిలకు గురయ్యారో తెలియదు కానీ వాటిని వెంటనే వదిలేశారన్నారు. దళితలు భూములలో తీసుకెళ్లుతున్న గ్రావెల్‌ను కూడా అడ్డుకునే హక్కు దళితులకు ఉందా లేదా అని ప్రశ్నించారు. దీనిపై స్పందించిన ఆర్డీవో సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దళిత నేతలు ముక్కు గోపాల్, ముక్కు శ్రీనివాసులు, లక్ష్మయ్య, వాసు, నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీవో కార్యాలయ సమావేశ మందిరంలో నేలపై కూర్చుని నిరసన తెలుపుతున్న దళిత నేతలు

పన్ను బకాయిలు చెల్లించకుంటే కుళాయి కనెక్షన్ కట్

కందుకూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మున్సిపాలిటీలో ఇంటి పన్ను, మంచినీటి కుళాయి పన్ను బకాయిలు చెల్లించని వారి కుళాయి కనెక్షన్లు కట్ చేయాలని నిర్ణయించినట్లు మున్సిపల్ కమిషనర్ కే.అనూష తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది మార్చికి ముందు బకాయిలు ఉన్నవారి కనెక్షన్లు కట్ చేయటం జరుగుతుందని, అలాంటివారంతా తక్షణం బకాయిలు మొత్తాన్ని మున్సిపల్ కార్యాలయంలోని కౌంటర్‌లో, వార్డు సచివాలయాలు, సీడీఎంఏ వెబ్‌సైట్ ద్వారా, పురమిత్ర యాప్ ద్వారా కానీ చెల్లించవచ్చునని ఆమె తెలిపారు.

● పీజీఆర్ఎస్‌కు 5 అర్జీలు

స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాఫిర్యాదుల కార్యక్రమంలో 5 అర్జీలు వచ్చాయి. రోడ్లు, పారిశుధ్యం తదితర సమస్యలపై వచ్చిన ఫిర్యాదులపై తక్షణం పరిష్కారంకు చర్యలు తీసుకోవాలని కమిషనర్ కె.అనూష ఆయా సెక్షన్ హెడ్స్‌కు ఆదేశాలు జారీ చేశారు. పారిశుధ్యం, ఇతర సమస్యలపై 9177700267 నెంబరుకు ఫోన్‌చేసి తెలియజేసినా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.



అర్జీలు స్వీకరిస్తున్న మున్సిపల్ కమిషనర్ అనూష

ఈసారి గోదాముల్లోనే..

(5వ పేజీ తరువాయి)

పౌరసరఫరాల అధికారి, అసిస్టెంట్ పౌరసరఫరాల అధికారిపైనా వేటు పడింది. ఆ సంస్థ అధికారులకు మందలింపులు కూడా వచ్చాయి. అయినా ఆ శాఖలోని అధికారుల తీరులో మార్పు రాలేదన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పటికీ నెల్లూరు, కావలి కేంద్రంగా ప్రతీ నెలా వేల టన్నుల బియ్యం రీసైక్లింగ్ జరిగి మార్కెట్లోకి వస్తోంది. అయితే అధికారులపై వేటు పడింది కానీ ఇందుకు సూత్రధారులైన రేషన్ మాఫియాపై మాత్రం ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

● అక్కడ ఎవరికి వారే!

జిల్లా పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో పాలన పూర్తిగా గాడి తప్పిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అక్కడ నడిపించే వారు లేకపోవడంతో ఎవరికి వారుగా వ్యవహరిస్తున్నారని, ఇది ఉద్యోగుల మధ్య వివాదాలకు దారితీస్తున్నట్లు చెప్పుకుంటున్నారు. ఇటీవల వరకూ రెగ్యులర్ డీఎస్‌వోగా పనిచేసిన విజయ్‌కుమార్‌ను ప్రభుత్వం రేషన్ బియ్యం పక్కదారి పట్టిన వ్యవహారంలో బదిలీ చేసింది. అలానే ఆ కార్యాలయంలో పని చేస్తున్న ఏఎస్‌వోను కూడా వేరే జిల్లాకు పంపింది. ఆ తర్వాత రెగ్యులర్ అధికారిని నియమించలేదు. కొన్ని రోజుల తర్వాత మెప్మా పీడీకి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. ఆమె ఇక్కడ పూర్తిగా దృష్టి పెట్టలేకపోతుండడంతో ఆ కార్యాలయంలో పనిచేసే ఓ ఉద్యోగి కర్రపెత్తనం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల రేషన్ షాపులు, పెట్రోల్ బంకుల తనిఖీలను పూర్తిగా విస్మరించారని, రికార్డుల్లో మాత్రం నమోదు చేసుకుంటున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక సివిల్ సప్లయిస్ డీఎం కార్యాలయంలో కూడా పాలన అస్తవ్యస్తంగా ఉందన్న ప్రచారం జరుగుతోంది.

విద్యుత్ సౌకర్యం కల్పించండి

● ఆర్డీవో కార్యాలయం వద్ద వినాయక కాలనీ వాసుల ధర్నా



ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న వినాయక కాలనీ వాసులు

కావలి(టౌన్), నవంబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 16వ వార్డు వినాయక కాలనీకి విద్యుత్ సౌకర్యం కల్పించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య కోరారు. ఈ మేరకు సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో వినాయక కాలనీ వాసులు ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కాలనీలో 15 ఏళ్ల నుంచి దాదాపు 70 కుటుంబాలు నివాసముంటున్నప్పటికీ ఇప్పటికీ విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయకపోవడం దుర్మార్గమన్నారు. దీంతో చాలాదూరం నుంచి కర్రల సాయంతో స్వయంగా లైను ఏర్పాటు చేసుకుని బిల్లులు చెల్లిస్తున్నారన్నారు. గాలి, వర్షం వచ్చిన సందార్భాల్లో కర్రలు పడిపోయి లైను తెగిపోయి విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందన్నారు. శాశ్వతంగా విద్యుత్ లైను లాగమని మున్సిపాలిటీ, విద్యుత్ శాఖ అధికారులకు అనేకమార్లు మొరపెట్టుకున్నప్పటికీ ప్రయోజనం లేదన్నారు. ఆర్డీవో దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లగా విద్యుత్ లైను ఏర్పాటుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణమోహన్, తిరుపాలు, వై మధు, కాలనీ పెద్దలు ఎం కొండయ్య, ఎస్‌కే సాబిర, అస్మత్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దపల్లిపాలెంలో ఉచిత వైద్య శిబిరం

ఉలవపాడు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని కరేడు పంచాయతీ పెద్దపల్లిపాలెంలో సోమవారం నారాయణ ఆరోగ్యమస్తు పథకం ద్వారా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు గొల్లపోతు యానాది, టీడీపీ నాయకులు పాలుబోయిన శ్రీనివాసులు ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రోగులకు కీళ్లు, ఎముకలు, కంటి, సాధారణ వ్యాధులకు సంబంధించి స్కానింగ్, రక్త పరీక్షలు నిర్వహించి శస్త్ర చికిత్స అవసరమైన వారిని ఉచిత బస్సులో నారాయణ వైద్యశాలకు తరలించినట్టు నిర్వాహకులు తెలిపారు. రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నారాయణ మెడికల్ కాలేజీ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.





హరనాథపురం వద్ద సిగ్నల్ లైట్ల స్విచ్ వేస్తున్న ట్రాఫిక్ పోలీసు, పక్కన గందరగోళంగా ట్రాఫిక్



మొదటి రోజే గందరగోళం!

నగరంలోని ప్రధాన కూడళ్లలో ఆదివారం ట్రాఫిక్ సిగ్నెల్ వ్యవస్థను రాజకీయ నాయకులు ప్రారంభించారు. ప్రారంభించిన తొలిరోజే వాహనదారులు నిబంధనలు పాటించలేదు. దీంతో గందరగోళం నెలకొంది. కొన్ని చోట్ల ట్రాఫిక్ జామ్ కావడంతో పోలీసులు తాత్కాలికంగా ట్రాఫిక్‌ను చేతులతో నియంత్రించారు. నిపుణులు చెబుతున్నట్లుగా కొత్తగా



ఏర్పాటు చేసిన సిగ్నెల్స్ సక్రమంగా పనిచేయాలంటే ప్రజల్లో అవగాహన పెంచడం కీలకం. త్వరలోనే ట్రాఫిక్ పోలీసులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి,వాహనవారులకు స్పష్టతనివ్వాలి.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, (ఆంధ్రజ్యోతి, నెల్లూరు)

వసతికి శుద్ధి జలం

- ఒక్కొక్క ఆర్వో ప్లాంటు రూ.2 లక్షలు
- జిల్లాకు చేరిన ప్లాంట్లు, కొన్ని చోట్ల ఏర్పాటు
- హాస్టళ్లలో తీరనున్న తాగునీటి కష్టాలు

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : హాస్టళ్లలో ఉండే విద్యార్థుల ఆరోగ్యం కోసం ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే హాస్టళ్లలో మరమ్మతుల కోసం నిధులు విడుదల చేసిన ప్రభుత్వం, తాజాగా నాణ్యమైన తాగునీటిని అందించేందుకు ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే, ఏదైనా సాధించగలరు. ఈ ఉద్దేశ్యంతో ప్రతి హాస్టల్‌లో విద్యార్థుల సంఖ్యనుబట్టి ఒకటి లేదా రెండు ఆర్వోప్లాంట్లను మంజూరు చేసింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేయటమే కాక, 45 రోజుల వ్యవధిలో వాటిని ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టింది.

● ఇప్పటికే కొన్ని చోట్ల ఏర్పాటు

ఒక్కొక్కటి రూ.2 లక్షల విలువైన ఆర్వో ప్లాంట్లను హాస్టళ్లకు మంజూరు చేసింది. తొలి విడతగా కొన్ని హాస్టళ్లకు చేరవేసింది. సాంఘిక సంక్షేమ హాస్టళ్లతో పాటు ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ సంస్థలు, ఏపీ స్టడీ స్టడీ సర్కిళ్లకు కూడా ఆర్వో ప్లాంట్లను మంజూరు చేసింది. హాస్టళ్లలో విద్యార్థుల సంఖ్య పెరుగుతుండటంతో తాగునీటి అవసరం అధికమవుతోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చాలా హాస్టళ్లలో ఇప్పటి వరకు పాత పద్ధతిలో నీటి సరఫరా ఉండటం, కొన్ని చోట్ల ఫిల్టర్‌లు పనిచేయకుండా పోవటంతో ఇబ్బందులు తలెత్తాయి. కొత్తగా ప్రతి సంక్షేమ హాస్టల్‌కు అవసరాన్ని బట్టి ఎక్కు నీటి సామర్థ్యం కలిగిన ఆధునిక సాంకేతికత కలిగిన ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నారు. ప్లాంట్ల నిర్వహణ కోసం ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయిస్తున్నట్లు తెలిసింది.



నగరంలోని బట్వాడిపాలెం కళాశాల బీసీ హాస్టల్‌లో ఏర్పాటు చేసిన శుద్ధి జల ప్లాంటు వద్ద నీరు పట్టుకుంటున్న విద్యార్థినులు

● 12 రాక... అన్ని హాస్టళ్లలో ఏర్పాటు

జిల్లాలో 69 సాంఘిక సంక్షేమ హాస్టళ్లు ఉన్నాయి. వీటన్నింటికీ ఆర్వో ప్లాంట్లు మంజూరయ్యాయి. వీటిలో తొలి విడతగా నెల్లూరు, ఆత్మకూరు, కోవూరు, పొదలకూరులోని హాస్టళ్లకు 12 ఆర్వో ప్లాంట్లు వచ్చాయి. మిగిలిన హాస్టళ్లకు త్వరలో రానున్నాయి. వాటిని బిగించి శుద్ధ జలం అందించనున్నారు. ఈ హాస్టళ్లే కాకుండా బీసీ సంక్షేమ, గిరిజన సంక్షేమ హాస్టళ్లు కూడా ఉన్నాయి. వీటికి కూడా ఆర్వో ప్లాంట్లు వచ్చే అవకాశం ఉంది.



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న జేసీ వెంకటేశ్వర్లు

అర్జీలపై పారదర్శక విచారణ జరపండి

● పీజీఆర్ఎస్‌లో జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పీజీఆర్ఎస్‌కు వచ్చే అర్జీలపై పారదర్శక విచారణ జరపాలని జేసీ మొగిలి వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో పీజీఆర్ఎస్ జరిగింది. ఈ సందర్భంగా ప్రజల నుంచి జేసీ అర్జీలు స్వీకరించారు. సంబంధిత అధికారులను పిలిపించి సమస్యలను క్షుణ్ణంగా చదివి పరిష్కరించాలని ఆదేశించారు. సుదూర ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రానికి వచ్చే అర్జీదారుల సమస్యలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని అన్నారు. అర్జీదారుల సంతృప్తి చెందేలా సమస్యలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని కోరారు. భూసమస్యలు, ఇతర రెవెన్యూ సమస్యలకు సంబంధించి అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని, వాటిని పరిష్కరించే దిశగా అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. పరిష్కరించలేని సమస్యలను ఎందుకు పరిష్కరించలేక పోతున్నామో వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో విజయకుమార్, డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

● పొలాన్ని ఆక్రమించి దౌర్జన్యం చేస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని అల్లూరు మండలం సింగపేట చెలికి గ్రామస్తుడు చెరుకూరు శ్రీనివాసులు జేసీకి వినతిపత్రం సమర్పించారు.

● దొంగ పట్టాలు అడ్డుకోండి

దొంగపట్టాలు అడ్డుకోవాలని చేజర్ల మండలం పెరుమాళ్లపాడు గ్రామస్థులు సోమవారం కలెక్టర్ పీజీఆర్ఎస్‌లో వినతిపత్రం అందచేశారు. గ్రామానికి చెందిన తలపనేని జయంతులు డీ ఫారం నమూనా పట్టా పేరుతో దొంగపట్టాలు, దొంగ రికార్డులు సృష్టించి, ఇంటింటికి సరఫరా చేస్తున్నాడని వారు ఆరోపిస్తూ జేసీ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం సమర్పించారు. గ్రామానికి చెందిన కిలారి జయరామయ్య, వేమన మహేష్, కోనంకి వెంకటేశ్వర్లు, బొర్ర వెంకటేశ్వర్లు, చంద్ర శ్రీనివాసులు, షేక్ ఫరీద్ బాషా, షేక్ నన్నేబాష తదితరులు మాట్లాడుతూ దొంగ పట్టాలు సృష్టించిన జయంతులుపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన జేసీ చేజర్ల ఎమ్మార్వోను విచారణ చేయాలని ఆదేశించారు.



కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న పెరుమాళ్లపాడు గ్రామస్థులు

చట్టప్రకారం విచారణ జరిపి న్యాయం చేస్తాం : ఎస్పీ

నెల్లూరు(క్రైం), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పోలీసు పీజీఆర్ఎస్‌లో స్వీకరించిన ఫిర్యాదులపై చట్టప్రకారం విచారణ జరిపి, న్యాయం చేస్తామని ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం పీజీఆర్ఎస్ నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 113 మంది తరలివచ్చి, వారి సమస్యలు తెలుపుకున్నారు. ఎస్పీ ఫిర్యాదులు స్వీకరించి, వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి అధికారులతో ఫిర్యాదుదారులను మాట్లాడించారు. వారికి తక్షణమే ఉపశమనం కలిగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పీజీఆర్ఎస్ ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి పరిష్కారం చూపాలని పోలీసు అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, రూరల్ డీఎస్పీ జీ శ్రీనివాసరావు, ఎస్బీ డీఎస్పీ శ్రీనివాసరావు, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులు రెడ్డి, పీసీఆర్ సీఐ భక్తవత్సల రెడ్డి, ఎస్బీ సీఐ-2 శ్రీనివాసరెడ్డి, వెల్ఫేర్ ఆర్ఐ రాజారావు, తదితరులు పాల్గొన్నారు.



వృద్ధుల వద్దకు వెళ్లి వినతిపత్రాలు స్వీకరిస్తున్న ఎస్పీ అజిత

మేయర్‌గా స్రవంతి వద్దు!

(5వ పేజీ తరువాయి)

నుంచి ఎలాంటి మద్దతు ఇవ్వకూడదన్న సంకేతాలు నేతల్లో వ్యక్తమయ్యాయి. స్రవంతిపై కార్పొరేటర్లంతా తిరుగుబాటు చేసి ఆమెను పదవి నుంచి తొలగించాలని కోరుతు జేసీకి అవిశ్వాస లేఖను అందచేసిన నేపథ్యంలో వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి, పార్టీ నెల్లూరు రూరల్ ఇన్‌చార్జి ఆనం విజయకుమార్ రెడ్డిలు నెల్లూరులోని ఆ పార్టీ కార్యాలయంలో సమావేశమయ్యారు. విశ్వసనీయ సమాచారం మేరకు ప్రస్తుతం మేయర్ తమ పార్టీలో లేనందున తాజా పరిణామాలపై ఎలాంటి ప్రకటన చేయకపోవడం ఉత్తమమని వారంతా నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఇటీవల డిప్యూటీ మేయర్ ఎన్నిక సమయంలో మేయర్ స్రవం తి ఓటు హక్కును వినియోగించుకోవడంలో గైర్హాజరవడంపై వైసీపీ నాయకులు సీరియస్‌గా ఉన్నారు. ఈ నేపథ్యంలో అవిశ్వాసంలోనూ పట్టించుకోకూడదన్న వాదనకు వచ్చినట్లు సమాచారం.

2న ఎర్ర చెరువు లీజు వేలం

సంగం, (ఆంధ్రజ్యోతి): ఎర్ర చెరువులో 1435 ఫసలికి సంబ ంధించి చేపలు పెంచుకొని పట్టుకొనుటకు లీజు వేలం డిసెంబరు 2వ తేదీన నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి నరసయ్య ఒక ప్రకటనలో తెలిపారు. పాల్గొనదలచినవారు పంచాయతీ కార్యాలయంలో ధరావత్తు రూ.20 వేలు చెల్లించాలని తెలిపారు.

రుచిగా మధ్యాహ్న భోజనం

● వంట ఖర్చులు పెంచిన ప్రభుత్వం ● విద్యార్థులకిక నాణ్యమైన తిండి

ఉదయగిరి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరం నుంచి సన్న బియ్యం అందజేస్తోంది. దీనికితోడు ఇటీవల నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోవడంతో వంట ఏజెన్సీల నిర్వాహకులు విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం, పీఎం పోషణ ద్వారా విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించేందుకు వంట ఖర్చులను పెంచింది. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ మధ్యాహ్న భోజనం డైరెక్టర్ శ్రీనివాసరావు ఇటీవల ఉత్తర్వులను జారీ చేశారు.



విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న నిర్వాహకురాలు

● నాణ్యమైన భోజనం

సవరించిన చార్జీలు ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఫిబ్రవరి 19, 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఆగస్టు 8 నుంచి అమల్లోకి రానున్నట్లు పేర్కొంది. ప్రస్తుత ఇస్తున్న అదనపు మెనూ చార్జీ రూ.0.40 మినహాయిస్తున్నట్లు వివరించింది. మధ్యాహ్న భోజనం చార్జీలు పెరగడంతో పథకం మరింత బలోపేతమవవడంతో పాటు జిల్లాలో 2,507 ప్రభుత్వ పాఠశాలలు, 25 జూనియర్ కళాశాలల్లో విద్యనభ్యసిస్తున్న సుమారు 3 లక్షల మంది విద్యార్థిని, విద్యార్థులకు నాణ్యమైన భోజనం లభిస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

మధ్యాహ్న భోజన ధరల వివరాలు (రూ.)

తరగతులు	గతం	ప్రస్తుతం
1 నుంచి 5	5.45	6.19
6 నుంచి 8	8.17	9.29
9 నుంచి ఇంటర్	8.17	9.29

జీజీహెచ్‌లో అరుదైన శస్త్రచికిత్స

నెల్లూరు (వైద్యం), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నగరంలోని జీజీహెచ్ ఈఎన్‌టీ విభాగంలో అరుదైన శస్త్రచికిత్సను వైద్యులు విజయవంతంగా నిర్వహించారు. సోమవారం ఆసుపత్రిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మాధవి మాట్లాడారు. నెల్లూరుకు చెందిన వేళాంగిణి(38)కి ముక్కు నుంచి రక్తం కారటం, ఎడమకన్ను వాపు, ముఖంలో ఎడమవైపు నొప్పి రావడంతో జీజీహెచ్‌లోని ఈఎన్‌టీ విభాగానికి వచ్చిందన్నారు. వైద్యులు పూర్తిస్థాయి పరీక్షలు చేసి, సిటీస్కాన్ తీశారని తెలిపారు. ఎడమ ముక్కులో కండ పెరిగటం కారణంగా చూపునకు కూడా అంతరాయం ఏర్పడిందన్నారు. దీంతో ఎండోస్కోపి ద్వారా ఆధునిక పరికరాలతో శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించామని ఆమె తెలిపారు. దీంతో ఆ బాధితురాలు పూర్తిగా కోలుకున్నదన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుకుమార్, డిప్యూటీ కలెక్టర్ పరమేశ్వర్‌రెడ్డి, ఏడీ ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.



శస్త్రచికిత్స చేయించుకున్న రోగితో వైద్యులు, అధికారులు

మా ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారు!

● అధికారుల తీరుపై చేనేతల ఆగ్రహం

● కలెక్టరేట్ ఎదుట రాట్నాలతో ఆందోళన

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ సాయం ఇవ్వకపోగా బియ్యం కోసం మగ్గం గుంతలు నిర్మించారంటూ అధికారులు పేర్కొనడాన్ని నిరసిస్తూ చేనేత కార్మికులు కలెక్టరేట్ ఎదుట రాట్నంతో వినూత్న రీతిలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా చేనేత ఐక్య వేదిక కన్వీనర్ బుధవారపు బాలాజీ మాట్లాడుతూ వరుస వర్షాలకు, తుఫాన్లకు నూలు డిజైన్ అట్టలు మెత్తబడి గుంతల్లోకి నీరు చేరి రోజువారి ఉపాధిని చేనేతలు కోల్పోయారని తెలిపారు. వారికి తుఫాన్ సాయం అందించటంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు. నారాయణరెడ్డిపేట, పొదలకూరు, తాటిపర్తి, మడమనూరు, గుమ్మలదిబ్బ తదితర ప్రాంతాలలో చేనేతల వివరాలు సేకరించటంలో అధికారులు విఫలమయ్యారని మండిపడ్డారు. కరెంటు మీటరు నేతన్న పేరుమీద లేదని, వర్షాల సమయంలో వేరే పనికి పోయారని, తాము చూసినప్పుడు మగ్గం మీద పనిలో లేరనే కారణాలను అధికారులు చూపడాన్ని తప్పుపడుతున్నామన్నారు. చేనేతలను అవమానించి ఆత్మగౌరవాన్ని అదికారులు దెబ్బతీశారని వాపోయారు. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు బాధితులను ఆదుకోమని ఆదేశాలు ఇచ్చినా అధికారులు బియ్యం కోసం నేతన్నలు ఆరాట పడుతున్నారంటూ ఎద్దేవా చేశారన్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందచేశశారు. ఈ ధర్నాలో బీజేపీ నేతలు మిడతల రమేష్, కందికట్ల రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

గుణ్ణంకట్ట గుటుక్కు!

మిగిలిన ఒక్క వైపూ ఆక్రమణలు



కందుకూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కందుకూరు పట్టణ నడిబొడ్డున ఉన్న గుణ్ణంకట్ట కుంట కొన్ని దశాబ్దాలుగా మూడువైపుల ఆక్రమణలతో కుచించుకుపోగా ఆక్రమణలు జరగని మిగిలిన ఒక్కవైపు ఆక్రమణలు షురూ అవుతున్నాయి. ఈ కుంటకు తూర్పు వైపున మార్కెట్ సెంటర్ నుంచి శివాలయంకు వెళ్లే రోడ్డు వైపు ఇంతకాలం ఆక్రమణలు జరగలేదు. అయితే అధ్వానంగా ఉన్న ఈ రోడ్డును అభివృద్ధి చేసి సిమెంటు రోడ్డు వేసింది మొదలు తూర్పువైపున ఉన్న భవనాల వారు మెల్లిమెల్లిగా ఆక్రమణలకు తెరతీశారు. ఈ రోడ్డు అభివృద్ధి చెందాక కట్టకింద పెద్దబజారులోకి ఉన్న పలు భవనాల వారు ఇటువైపు కూడా ద్వారాలు ఏర్పాటు చేయటంతో పాటు కొందరు రోడ్డులోకి అక్రమ నిర్మాణాలు చేస్తున్నారు. ఈ దశలో సోమవారం ఓ భవన యజమాని ఏకంగా రోడ్డుకి అడ్డంగా రోడ్డులోనే బోరు వేశారు. ఇది అక్రమణదారుల బరితెగింపునకు అద్దం పడుతోంది. పరిస్థితి ఇలాగే కొనసాగితే మిగిలిన ఒక్కవైపు కూడా ఆక్రమణలతో గుణ్ణంకట్ట ఆనవాళ్లు కోల్పోయే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు కఠిన చర్యలు చేపట్టి సర్వే చేయించి తూర్పువైపు కట్టపై, మిగిలిన ప్రాంతాల్లో గుణ్ణంకట్ట ఆక్రమణలను కట్టడి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఆయిల్ పామ్‌కు రాయితీలు

● సాగుకు ఆసక్తి చూపుతున్న రైతులు ● జిల్లాలో పెరిగిన తోటల విస్తీర్ణం

నెల్లూరు(వ్యవసాయం), నవంబరు 24(ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో పెట్టుబడులు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. ఏళ్ల తరబడి రైతులు పంట మార్పిడిపై దృష్టి పెట్టడం లేదు. అధికశాతం మంది వరి సాగుకే మొగ్గు చూపుతున్నారు. ఒక్కోసారి ఆశించిన దిగుబడులు రావడం లేదు. దీనికి తోడు ఖర్చులు బాగా పెరిగాయి. దీంతో గిట్టుబాటు కాని పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితిలో ప్రభుత్వ ప్రోత్సాహంతోపాటు రాయితీలు అందడంతో రైతులు ఆయిల్ పామ్ సాగుకు ఆసక్తి చూపుతున్నారు.



ఆయిల్‌పామ్ మొక్క నాటుతున్న రైతులు, అధికారులు(ఫైల్)

● పెరిగిన సాగు విస్తీర్ణం

సాంప్రదాయ పంటల సాగులో ఆశించిన ఫలితాలు రాకపోవడంతో రైతులు ప్రత్యామ్నాయ పంటలపై ఆసక్తి చూపుతున్నారు. ముఖ్యంగా ఆయిల్ పామ్ సాగుకు రైతులు ముందుకొస్తున్నారు. గత ఐదేళ్లలో పరిశీలిస్తే జిల్లాలో ఆయిల్ పామ్ సాగు ఊపందుకుంది. 2021-22లో 723 ఎకరాల్లో మాత్రమే ఆయిల్ పామ్ సాగు అయింది. 2022-23లో 850 ఎకరాలు, 2023-24లో 1050, 2024-25లో 2571, 2025-26లో ఇప్పటి వరకు 3355ఎకరాల్లో సాగవుతున్నట్లు ఉద్యానశాఖ లెక్కలు చెబుతున్నాయి.

● ప్రభుత్వ రాయితీలు

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యానశాఖద్వారా ఎకరాకి 50 మొక్కల చొప్పున నూరుశాతం రాయితీపై అందిస్తుంది. మొత్తం నాలుగేళ్లకుగాను ఇండిజినస్ ఆయిల్ పామ్ సాగుకు రూ.62వేలు. ఇంపోర్టెడ్ ఆయిల్ పామ్ సాగుకు రూ.71వేలు ఉద్యానశాఖ ద్వారా రైతులకు రాయితీ అందుతోంది. యాంత్రీకరణ, నీటివసతి తదితరాలకుం రూ.22వేల నుంచి రూ.1.50లక్షల వరకు రాయితీ ఇస్తున్నారు. నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్ పథకం కింద జిల్లాలో ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం పెంచేందుకు ఆయిల్ పామ్ కంపెనీ వారు అమ్మా పామ్ ప్లాంటేషన్ ప్రైవేటు లిమిటెడ్‌లను జిల్లాకు కేటాయించారు. వీటి ద్వారా ఆయిల్ పామ్ మొక్కలను ఉచితంగా సరఫరా చేస్తున్నారు.

● దిగుబడులు ఇలా....

ఆయిల్ పామ్ ఎకరాకు 50 మొక్కల చొప్పున చతురస్రాకార పద్ధతిలో నాటుకోవలి. భూసారం, యాజమాన్య పద్ధతులు మొక్క ఎదుగుదలను బట్టి 4సంవత్సరాల నుంచి దిగుబడులు వస్తాయి. మొదటి కాపు ఎకరానికి 3 నుంచి 4టన్నులు వస్తున్నాయి. 8సంవత్సరాల వయసు కలిగిన తోటలకు ఎకరాకి 8 నుంచి 10 టన్నుల దిగుబడి వస్తున్నట్లు ఉద్యానశాఖ అధికారులు చెబుతున్నారు. మొదటి నాలుగు సంవత్సరాలు అంతర పంటలుగా పత్తి, వేరుశగన, కూరగాయలు, పూల మొక్కలు, జామ, కోకో తదితర పంటలు సాగుకు కూడా ప్రభుత్వం ప్రోత్సాహం ఇస్తోంది. అంతే కాకుండా దళారీ వ్యవస్థ లేకుండా ప్రభుత్వం ప్రకటించిన ధరల ప్రకారమే కంపెనీలు పంటను కొనుగోలు చేస్తాయి. నేరుగా రైతుల ఖాతాల్లోకి నగదు జమ అవుతుంది.

సద్వినియోగం చేసుకోవాలి



ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి. ఆయిల్ పామ్ తోటల సాగు, యాజమాన్య పద్ధతులు, మార్కెటింగ్, ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, ప్రోత్సాహకాలు తదితర విషయాలపై గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ఆసక్తి కలిగిన రైతులు రైతు సేవా కేంద్రాల్లోని సిబ్బందిని, ఉద్యాన అధికారిని సంప్రదించాలి.

- ఎంవీ సుబ్బారెడ్డి, జిల్లా ఉద్యానశాఖ అధికారి

బైక్‌ల దొంగ అరెస్ట్

● 8 ద్విచక్రవాహనాల స్వాధీనం



నెల్లూరు(క్రైం), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : వరుసగా బైక్‌ల చోరీకి పాల్పడుతూ పోలీసుల కళ్లుగప్పి తిరుగుతున్న నిందితుడిని బాలాజీనగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి వద్ద నుంచి ఎనిమిది మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడి వివరాలను సోమవారం బాలాజీనగర్ పోలీసు స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ కే సాంబశివరావు తెలిపారు. కోవూరు మండలం ఇనుమడుగు మిక్స్‌డ్‌కాలనీకి చెందిన గూడూరు చిరంజీవి బైక్ మెకానిక్‌గా జీవనం సాగిస్తున్నాడు. వ్యసనాలకు బానిసైన చిరంజీవి సరిపడా నగదు కోసం బైక్ దొంగగా మారాడు. ఈనెల 8న పూలేబొమ్మ వద్ద మైపాడుకు చెందిన రవి బైక్ చోరీ జరిగింది. రవి ఫిర్యాదు మేరకు బాలాజీనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ కే. సాంబశివరావు పర్యవేక్షణలో ఎస్ఐ విజయ్‌శ్రీనివాస్ తన సిబ్బందితో కలిసి సాంకేతికత ఆధారంగా నిందితుడు చిరంజీవిగా గుర్తించారు. సోమవారం ఇనుమడుగు వద్ద నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించారు. నెల్లూరు బాలాజీనగర్ పోలీసుస్టేషన్ పరిధిలో నాలుగు బైక్‌లు, నవాబుపేట పోలీసు స్టేషన్‌లో 2, చిన్నబజారు, కోవూరు స్టేషన్ల పరిధిలో ఒక్కో బైక్‌ను దొంగలించినట్లు నిందితుడు అంగీకరించాడు. చిరంజీవిని అరెస్ట్ చేసి, అతడి వద్ద నుంచి ఎనిమిది బైక్‌లను స్వాధీనం చేసుకున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. బైక్ దొంగను అరెస్ట్ చేయడంలో ప్రతిభ కనబరిచిన ఇన్‌స్పెక్టర్, ఎస్ఐ, సిబ్బంది కేవీ సుధాకర్, రమేష్, వెంకటరావు, జయరామయ్య, శివకుమార్, శ్రీహరి, తిరుపతి, సాయి కిషోర్‌లను పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.